
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి ®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:237 హైదరాబాద్, బుధవారం, 26 మార్చి 2025 పేజీలు: 12 వెల: 1.00

## రేవంత్ కొత్త టీమ్...?

హైదరాబాద్, మార్చి 25,

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిపోయింది. ఇంకా కొన్ని మంత్రి పదవులకు రాష్ట్రంలో అవకాశం ఉన్నా.. వివిధ కారణాలతో ఇప్పటి వరకు సాధ్యం కాలేదు. కానీ.. ఈ రోజు సీఎం రేవంత్ రెడ్డి హుటాహుటిన దిల్లీకి పయనమయ్యి వెళ్లారు. ఆయన దిల్లీ టూర్ వెనుక కొత్త మంత్రుల ఎంపిక నిర్ణయం ఉందంటున్నారు విశ్వసనీయ వర్గాలు. తెలంగాణ పీసీసీ, ప్రత్యేక పార్టీ బాధ్యుల నుంచి అనేక మార్లు వివరాలు తెప్పించుకున్న పార్టీ కేంద్ర కమిటీ.. ఎట్టకేలకు తెలంగాణలో పెండింగ్ లోని మంత్రుల పదవుల్ని భర్తీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే.. సీఎం దిల్లీ పయనమవ్వగా.. నూతనంగా క్యాబినేట్ లోని ఆరుగురు కొత్తవారికి చోటు కల్పించనున్నట్లు తెలుస్తోంది. భారత రాజ్యాంగం ప్రకారం, రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య అసెంబ్లీ సభ్యుల మొత్తం సంఖ్యలో 15% మించకూడదు. ఈ లెక్కన తెలంగాణ క్యాబినేట్ లో గరిష్టంగా 18 మందికి మంత్రి పదవులు ఇచ్చేందుకు వీలుంటుంది. ముఖ్యమంత్రి పదవితో సహా మరో పద్దెనిమిది మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయొచ్చు. ప్రస్తుతానికి.. తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్‌లో 12 మంది మంత్రులే ఉన్నారు. ఇంకా.. 6 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. 2023 డిసెంబర్ 7న, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఆయనతో పాటు 11 మంది మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సంఖ్యను ఇప్పటి వరకు పెంచలేదు. అనేక దఫాలుగా రాష్ట్ర క్యాబినేట్ విస్తరణపై విస్తృతంగా చర్చలు నిర్వహించారు. అయినా.. ఇప్పటి వరకు ఈ అంశం కొలిక్కి రాలేదు. కులాలు, మహిళలు సహా అనేక పరిమితుల్ని పరిగణలోకి తీసుకుని.. పార్టీలో సమాలోచనలు చేస్తున్నారు. అలా.. పూర్తి స్థాయి సన్నదత పూర్తయ్యాక.. కొత్తగా ఆరుగురికి రేవంత్ టీమ్ లో అవకాశం కల్పించాలని పార్టీ, రాష్ట్ర, కేంద్ర కమిటీలు నిర్ణయానికి వచ్చాయి. దీంతో.. ఎవరికి మంత్రి పదవులు దక్కుతాయోననే ఉత్కంఠ నెలకొంది. కాగా.. మంత్రులుగా ప్రమాణ స్వీకరం చేయనున్న వారి పేర్లు విశ్వసనీయ వర్గాల ద్వారా వెల్లడైంది. అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని జాబితాలోని పేర్లను కుదించుకుంటూ వస్తున్నారు. అలా.. చివరికి 6 పోస్టులకు



8 మంది ఆశావాహులు పేర్లు ఖరారైయ్యాయి. మంత్రివర్గ విస్తరణలో ఆశావహుల జాబితా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

1) గడ్డం వివేక్ వర్సెస్ ప్రేమ్ సాగర్ రావు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా

2) మదన్ మోహన్ రావు వర్సెస్ సుదర్శన్ రెడ్డి

వరంగల్ జిల్లా

3) విజయశాంతి

మెదక్ జిల్లా

4) మైనంపల్లి రోహిత్ రావు

హైదరాబాద్ జిల్లా

5) అమీర్ అలీ ఖాన్

రంగా రెడ్డి జిల్లా

6) మల్ రెడ్డి రంగా రెడ్డి వర్సెస్ రామ్మోహన్ రెడ్డి

ఉమ్మడి మహబూబ్ నగర్

7) వాకిట శ్రీహరి

ఉమ్మడి నల్లగొండ

8) కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

## ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలం?: సుప్రీంకోర్టు

లదిల్లీ: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. ముగ్గురు ఎమ్మెల్యేలపై వేర్వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదన్నారు. నోటీసు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడారని.. ఆ తర్వాత కూడా భారాసలోనే ఉన్నామంటున్నారని చెప్పారు.



"ఫిర్యాదులపై ఏం చేస్తారో.. 4 వారాల్లో షెడ్యూల్ చేయాలని కోర్టు ఆదేశించింది. అయినా పార్టీ మారిన వారికి స్పీకర్ నోటీసులు ఇవ్వలేదు. ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారు. 3 వారాల్లో రిప్లై ఇవ్వాలని.. ఫిబ్రవరి 13న స్పీకర్ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికి 3 వారాలైంది.. నోటీసులు ఎటు వెళ్లాయో తెలియదు. మేము ఫిర్యాదు చేసి ఏడాదైనా స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదు" అని సుందరం తెలిపారు. ఈక్రమంలో స్పందించిన జడ్జి జస్టిస్ గవాయ్.. పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయిందా అని వ్యాఖ్యానించారు.

%ఇలాంటి వ్యవహారాల్లో రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు ఉన్నాయని జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పేర్కొంది. ఎప్పటిలోగా తేల్చాలనే విషయంలో గత తీర్పులు స్పష్టంగా చెప్పలేదని పేర్కొంది. అలాంటప్పుడు ఆ తీర్పును కాదని ఎలా ముందుకు వెళ్లగలమని చెప్పింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలమని ప్రశ్నించింది. పిటిషనర్ల వాదనలు ముగియడంతో విచారణను సుప్రీంకోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది.



## అసెంబ్లీ అంటే అదీ..

## మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 25: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఏది మాట్లాడినా సంచలనమే. ఏం చేసినా ఆసక్తికరమే. ఆయన మీడియా ముందుకు వచ్చారంటే చాలు ఏదో విషయంపై మాట్లాడుతూ నవ్వులు పూయిస్తుంటారు. ఇప్పుడు తాజాగా మల్లారెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో.. అప్పటి అసెంబ్లీ సమావేశాలు.. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యత్యాసాలను చెప్పుకొచ్చారు. గతంలో అసెంబ్లీని ప్రజలు ఆసక్తిగా చూసేవారని అన్నారు. ఇప్పుడు మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే అన్నట్లుగా సమావేశాల్లో కనిపిస్తోందంటూ కామెంట్స్ చేశారు. అంతే కాకుండా అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, వివేక్ మధ్య జరిగిన సంభాషణ కూడా ఆసక్తికరంగా మారింది.

మల్లారెడ్డి కామెంట్స్ ఇవే..

పార్లమెంట్‌లో ఆనాడు మాజీ ప్రధాని వాజుపేయి లాంటి వారు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసేవారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు అత్తుకుని పోయేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడతారని ఆసక్తి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే కనిపిస్తోందంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ కామెంట్స్ సంచలనంగా మారాయి.




మల్లారెడ్డి, వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ

ఇక.. అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. ఈరోజు అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. 'వివేక్‌ను.. నమస్తే మంత్రి గారు' అంటూ మల్లారెడ్డి పలకరించారు. ఇందుకు థాంక్స్ మల్లన్న అని పలకరించారు వివేక్ వెంకటస్వామి. రాష్ట్రంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్యామిలీ, వివేక్ వెంకటస్వామి ఫ్యామిలీదే హవా నడుస్తోందంటూ మల్లారెడ్డి కామెంట్స్ చేయగా.. బీఆర్ఎస్ హయంలో కేసీఆర్, మల్లారెడ్డిదే హవా నడిచిందని వివేక్ సమాధానం ఇచ్చారు. 'మేము అధికారం కోల్పోయాం మాదేం లేదన్న' అంటూ మల్లారెడ్డి అనడంతో ఇద్దరు నేతల మధ్య నవ్వులు పూశాయి.

## నీతీశ్ ఆరోగ్య పరిస్థితి వెల్లడించాలి: పీకే


బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ (పై ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (% మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. బహిరంగ కార్యక్రమాలు, మీడియా సమావేశాల్లో సీఎంను మాట్లాడనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల దృష్టి నుంచి తప్పించుకునేందుకే సీఎం సన్నిహితులు ఇలా చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో సీఎం మానసిక స్థితిపై వైద్య నివేదిక విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

"నీతీశ్ కుమార్ ఆయన కేబినెట్ మిత్రుల పేర్లు కూడా మరచిపోతున్నారు. పర్యటనలు చేస్తున్నప్పుడు ఆయన ఏ జిల్లాలో ఉన్నారో కూడా గుర్తించుకోవడం లేదు. ఇటీవల బీపీఎస్సీ పరీక్షలపై జరిగిన ఆందోళనల సమయంలో.. రాష్ట్రంలో ఏం జరుగుతుందనేది ఆయనకు తెలియదనే విషయం నాకు తెలిసింది" అని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యంపై మెడికల్ బులెటిన్ విడుదల చేస్తే ప్రజలకు (వాస్తవాలు తెలుస్తాయన్నారు. అయితే, అలాంటి వాటికి సీఎం అస్సలు అంగీకరించరని పీకే పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నీతీశ్ మానసిక ఆరోగ్యంపై ఆయన సన్నిహితుడు సుశీల్ మోదీ 2023లో మొదటిసారి ఆందోళన వ్యక్తం చేశారని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా బిహార్ ప్రజలు కూడా ఆయన తీరును గమనిస్తూనే ఉన్నారన్నారు.

## పీఎం-కిసాన్.. అనర్హుల నుంచి రూ.416 కోట్లు రికవరీ

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో అనర్హుల ఏరివేతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటి వరకు అనర్హుల నుంచి రూ.416 కోట్లు రికవరీ



చేసినట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6వేలను మూడు విడతల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. 2019లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 19 విడతల్లో రూ.3.68లక్షల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే, ఈ పథకం ప్రారంభంలో స్వీయ ధ్రువీకరణ ఆధారంగా లబ్ధిదారుల పేర్ల నమోదుకు అనుమతించారు. ఇప్పటికే 100శాతం ఆధార్ సీడింగ్ పూర్తిచేయగా.. ఆధార్, ఆదాయపన్ను శాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖల వద్ద ఉన్న సమాచారంతో అనర్హులను ఏరివేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

ఈ క్రమంలో ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, చట్టబద్ధ పదవుల్లో ఉన్నవారు దీనికింద లబ్ధిపొందితే వారి నుంచి రికవరీ చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచించింది. ఇదిలాఉంటే, ఈ పథకం ద్వారా లబ్ధిపొందే రైతుల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, పీఎం-కిసాన్ అన్‌లైన్ పోర్టల్‌లో స్వయంగా రిజిస్టర్ చేసుకోవచ్చని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి చౌహాన్ వెల్లడించారు.

## జీహెచ్ఎంసీ, హైడ్రా కీలక నిర్ణయం.. రెండు కమిటీల ఏర్పాటు

హైదరాబాద్: నగరంలో వరుసగా జరుగుతోన్న అగ్ని ప్రమాదాలు, వర్షాకాలంలో ఎదురయ్యే వరద ముంపు నివారణకు పరిష్కారంపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), హైడ్రా ప్రత్యేకంగా దృష్టి సారించాయి. వరద ముంపుతోపాటు అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశమైన హైడ్రా, జీహెచ్ఎంసీ కమిషనర్లు రంగనాథ్, ఇలంబర్తి.. వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలు, అగ్నిప్రమాదాల నివారణపై సమీక్షించారు.




అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖతో పాటు హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, వర్షాకాలంలో వరద ముంపు నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసేందుకు ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులతో మరో కమిటీ వేయాలని కమిషనర్లు నిర్ణయించారు. ఈ రెండు కమిటీలు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారుల సమన్వయంతో సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాయని పేర్కొన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

## పదేళ్లలో ఇండియా జీడీపీ డబుల్


భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలపడుతోంది. గతంతో పోలిస్తే ఆర్థిక వృద్ధి గాడిలో పడింది. కాస్త మందగమనం ఉన్నప్పటికీ.. అనేక విషయాల్లో భారత ఆర్థిక వ్యవస్థ ముందంజలోనే ఉంది. ఈ క్రమంలో ఈజ25లో భారతదేశ జీడీపీ వృద్ధి గత 10 సంవత్సరాలలో రెట్టింపు అయింది. 2015లో 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి 4.3 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేయడం జరిగింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి విడుదల చేసిన డేటాలో ఈ సమాచారం ఇచ్చారు. ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందడం వల్ల, భారతదేశ జీడీపీ 2025లో జపాన్, 2027లో జర్మనీ కంటే ముందు వరుసలో నిలవనుంది. ఐఎంఎఫ్ డేటా ప్రకారం భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. ఇది విధాన సంస్కరణలు, బలమైన ఆర్థిక వృద్ధి కారణంగా పేర్కొంది. 10 సంవత్సరాలలో భారతదేశం తన స్థూల దేశీయోత్పత్తిని రెట్టింపు చేసి 105 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఐఎంఎఫ్ డేటా తెలిపింది. 2015లో 2.1 ట్రిలియన్ డాటర్ల నుండి 2025లో 4.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. గతంలో పోల్చితే, అదే కాలంలో అమెరికా 66 శాతం, చైనా జీడీపీ 44 శాతం పెరిగాయి. దీంతో, భారతదేశం ఇప్పుడు యునైటెడ్ స్టేట్స్ (30.3 ట్రిలియన్ డాలర్లు), చైనా (19.5 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4.9 ట్రిలియన్ డాలర్లు), జపాన్ (4.4 ట్రిలియన్ డాలర్లు) తర్వాత ప్రపంచంలో పరంగా ఐదవ అతిపెద్ద దేశంగా భారత్ నిలిచింది. ఐఎంఎఫ్ డేటా ప్రకారం, గత దశాబ్దంలో జపాన్ జీడీపీ సున్నాగా పెరగడంతో, భారతదేశం త్వరలో జపాన్‌ను అధిగమించనుంది. గత దశాబ్దంలో యునైటెడ్ కింగ్‌డమ్ జీడీపీ 28 శాతం వృద్ధి చెందగా, ఫ్రాన్స్ జీడీపీలో 38 శాతం వృద్ధిని సాధించింది. 2015లో 2.4 ట్రిలియన్ డాలర్ల నుండి 2025 నాటికి 3.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. 50 శాతం కంటే ఎక్కువ జీడీపీ వృద్ధిని సాధించిన ఇతర అగ్ర ఆర్థిక వ్యవస్థలు రష్యా (57 శాతం), ఆస్ట్రేలియా (58 శాతం), స్పెయిన్ (50 శాతం)గా ఉన్నాయి. భారతదేశ జీడీపీ వృద్ధిని అపూర్వమైన రేటుతో చూపిస్తున్న డేటాను బిజెపి మంత్రి అమిత్ మాల్వియా తన అధికారిక చీ పోస్ట్ ద్వారా పంచుకున్నారు. ఈ వృద్ధి వేగం భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక సూపర్ పవర్‌గా నిలబెట్టింది. 2025 నాటికి జపాన్‌ను, 2027 నాటికి జర్మనీని అధిగమిస్తుందని బీజేపీ నాయకుడు అమిత్ మాల్వియా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో షేర్ చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ అసాధారణ విజయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి, ఆయన ప్రభుత్వ అవిశ్రాంత కృషికి నిదర్శనమని మాల్వియా పేర్కొన్నారు. చురుకైన ఆర్థిక విధానాలు, సాహసోపేతమైన నిర్మాణాత్మక సంస్కరణలు, వ్యాపారాన్ని సులభతరం చేయడంపై అవిశ్రాంత దృష్టి ద్వారా, మోదీ ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా మార్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మునుపటి ఏ ప్రభుత్వం సాధించని విజయం ఇది అని అమిత్ మాలవ్య అన్నారు. మార్చి నెల ప్రారంభంలో, భారతదేశం వివేకవంతమైన విధానాలను ప్రశంసిస్తూ, ఐఎంఎఫ్ కార్యనిర్వాహక బోర్డు, దేశం బలమైన ఆర్థిక పనితీరు 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారడానికి కీలకమైన సంస్కరణలను స్వీకరించడంలో సహాయపడుతుందని పేర్కొంది. అధిక-నాణ్యత ఉద్యోగాలను సృష్టించడానికి, దేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి నిర్మాణాత్మక సంస్కరణలు చాలా కీలకమని ఐఎంఎఫ్ కార్యనిర్వాహక బోర్డు పేర్కొంది. దేశ జీడీపీలో ప్రైవేట్ వినియోగం వాటా పెరిగినందున దేశ ఆర్థిక వృద్ధి మరింత సమతుల్యంగా మారుతోందని ఇటీవల విడుదలైన క్రిసిల్ నివేదిక వెల్లడించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో ముందస్తు అంచనాలో 10 బేసిస్ పాయింట్లు స్వల్పంగా సవరించి 6.5 శాతానికి చేర్చడం జరిగింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన వాస్తవ వృద్ధి కరోనా మహమ్మారికి ముందు దశాబ్దంలో వచ్చిన సగటు 6.6 శాతానికి చేరువైంది. సవరించిన వృద్ధి గణాంకాలపై క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్ ధర్మకీర్తి జోషి మాట్లాడుతూ.. గత ఏడాది వృద్ధిలో 100 బేసిస్ పాయింట్లు పెంచి 9.2 శాతానికి సవరించిన తర్వాత ఈ పెరుగుదల సాధ్యమైందని అన్నారు. సాధారణ రుతుపవనాలు, తక్కువ ఆహార ద్రవ్యోల్బణం, ప్రస్తుత ద్రవ్య చక్రంలో 75-100 బేసిస్ పాయింట్ల రేటు కోతలు వంటి అంశాల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా వేశారు. దేశంలో ప్రైవేట్ వినియోగం నానాటికీ పెరుగుతుంది. ఇది ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ, గృహ పెట్టుబడులు రెండూ వేగంగా అభివృద్ధి చెందాయి. అయితే భారత్‌లో కార్పొరేట్ పెట్టుబడులు ఇంకా ఆశించినంతగా పుంజుకోలేదు. కొనసాగుతున్న సుంకాల యుద్ధాలు, చైనా డంపింగ్ భయం కారణంగా కార్పొరేట్ రంగం పెట్టుబడులపై అంతగా ఆసక్తి చూపడం లేదు. టారిఫ్‌ల వల్ల వచ్చే నష్టాల సంక్లిష్టత ఇప్పటికే ప్రారంభమైంది. రాబోయే నెలల్లోనూ ఇది కొనసాగే అవకాశం ఉంది. దీంతో మా అంచనాలకు ప్రతికూలతలు సృష్టిస్తుందని జోషి అన్నారు.

# ఆ ఊరికి ఏమైంది...

## గ్రామంలో ప్రతి ఇంటిలో క్యాన్సర్ పేషంట్

కాకినాడ, మార్చి 25

ఒకరికి కాదు.. ఇద్దరికి కాదు.. ఏకంగా గ్రామంలో సుమారు 200 మందికి పైబడే కేన్సర్ వ్యాధి లక్షణాలు నిర్ధారణ అవ్వడం కలవరానికి గురిచేస్తోంది.. వైద్యపరీక్షల ద్వారా 23 మందికి కేన్సర్‌ను గుర్తించిన అధికారులు గ్రామంలో ఉన్న పరిస్థితిని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతితోపాటు ఉన్నతాధికారులకు వివరించారు.. ఇంకా గ్రామంలో ఎంతమందికి క్యాన్సర్ ఉందో తెలుసుకునే ప్రయత్నంలో నిమగ్నమైన అధికారులు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు.. ప్రాథమికంగా గ్రామంలో చాలా మంది చిన్నారుల్లో కూడా కాలేయ సంబందిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది.. ఇదిలా ఉంటే బలభద్రపురంలో క్యాన్సర్ కోరల్లో ప్రజలు చిక్కుకుంటున్న పరిస్థితిపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అసెంబ్లీలో కూడా ప్రస్తావించడంతో దీనిపై ప్రభుత్వ, అధికార యంత్రాంగం కూడా ప్రత్యేక దృష్టిసారించిన పరిస్థితి కనిపించింది.. బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ కోరలు చాస్తోందన్న వార్త గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొంటున్న పరిస్థితి కనిపిస్తోంది.. తమ ఒంట్లో ఏ క్యాన్సర్ రాకాసి ఉందోనన్న అనుమానాలు ఆ గ్రామస్తుల మాటల్లో కనిపిస్తున్నాయి.. ఎందుకంటే ఈగ్రామంలోనే ఇప్పటికే 23 మంది క్యాన్సర్ బారిన పడడం గమనార్హం. ఇంకా సుమారు 200 మందికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు సమాచారం. అయితే అధికారులు ఇంకా అధికారికంగా ధృవీకరించకపోయినప్పటికీ తూర్పు గోదావరి జిల్లా వైద్యశాఖ, కాకినాడ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందాలు సారథ్యంలో గ్రామంలో 32 బృందాలుగా సర్వే చేస్తున్నారు.. అయితే ఇప్పటికే గ్రామంలో 23 మంది క్యాన్సర్ చికిత్సలో ఉండగా మరికొంత మందికి ఈ వ్యాధి ఉందన్న సమాచారంతో గ్రామంలో తీవ్ర భయాందోళన పరిస్థితి నెలకొంది.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గ పరిధిలోకి వచ్చే భలభద్రపురం గ్రామంలోనే గ్రాసిమ్ కెమికల్ ఇండస్ట్రీతో పాటు ఇతర పరిశ్రమలున్నాయి.. వీటినుంచి వెలువడే కాలుష్య వల్లనే గ్రామంలో ఈ భయంకర పరిస్థితులు నెలకొన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు భూగర్భంలో డంపింగ్ చేయడం వల్ల భూగర్భజలాలు కాలుష్యకాసారాలుగా మారుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. బలభద్రపురం గ్రామంలో సుమారు 10 వేల మంది జనాభా ఉండగా ఎవ్వరిని కదిపినా క్యాన్సర్ కలవరం స్పష్టంగా కనిపిస్తోంది.. ఏప్రిల్ 2022లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బలభద్రపురం శివారు ప్రాంతంలో గ్రాసిమ్ ఇండస్ట్రీను ప్రారంభించారు.. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బలభద్రపురంలో క్యాన్సర్ కోరలు చాస్తోందని తన ప్రసంగంలో ప్రస్తావించారు. దీనిపై వైద్యఆరోగ్యశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేకపోతే ఇప్పటికే గ్రామంలో చాలా మంది క్యాన్సర్ బారిన పడ్డారని, మరింత మందికి ఈ వ్యాధి ఉండే అవకాశం లేకపోలేదని, గ్రామంలో తక్షణ చర్యలు చేపట్టి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతోపాటు క్యాన్సర్ కారకాలను గుర్తించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోపాటు వైద్యఆరోగ్యశాఖ మంత్రికి విన్నవించారు..



చర్యలకు ఉపక్రమించిన ఆరోగ్యశాఖ

తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల కలకలంపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. బలభద్రపురంలో అత్యధిక క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని అనపర్తి ఎమ్మెల్యే అసెంబ్లీలో పేర్కొన్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దీంతో వెంటనే 31 మెడికల్ టీమ్ లను అక్కడికి పంపామన్నారు. నాన్ కమ్యూనకబుల్ 3.0 సర్వేలో భాగంగా నాన్ కమ్యూనకబుల్ డిసిజ్ క్యాన్సర్ స్క్రీనింగ్ మొదలు పెట్టామని వెల్లడించారు. ఇప్పటివరకు కోటి 93 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించగా వీరిలో లక్ష 45వేల 649 మంది వేర్వేరు క్యాన్సర్లతో భాదపడుతున్న అనుమానిత కేసులు వచ్చాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు."బలభద్రపురానికి సంబంధించి 10800 మంది జనాభాలో 3500 ఇళ్లు ఉన్నాయి. వీరిలో 2803 ఇళ్ల వద్దకు వెళ్లి 8830 మందికి పరీక్షలు చేయగా 38 కేసులు బయటపడ్డాయి. దీనిలో గతంలో క్యాన్సర్ ఉన్న కేసులు ఉన్నాయి. భారత్ లో 14 లక్షల 13 వేల కొత్త కేసులు వచ్చాయి. లక్ష జనాభాకు 367 మంది అంటే 10 వేలు జనాభా ఉన్న బలభద్రపురంలో 32 కేసులు ఉన్నాయి. అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాం. ఆయన అసెంబ్లీలో మాట్లాడటంతో మీడియాలో హైలెట్ అయ్యి అందరికీ తెలిసింది. అనపర్తి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుంటే లక్షా 19వేల మందికి స్క్రీనింగ్ చేయగా 736 సస్పెక్టెడ్ కేసులు వచ్చాయి. క్యాన్సర్ ట్రీట్ మెంట్ ను 2022-25 మధ్య ఎన్టీఆర్ వైద్య సేవ కింద లక్ష 13 వేల 363 మందికి చికిత్స చేశారు. బలభద్రపురంలో క్యాన్సర్ అనుమానిత కేసులు అసాధారణంగా పెరగలేదు. స్క్రీనింగ్ ట్రైన్డ్ సీహెచ్ సెంటర్లలో ఉండే వారు చేస్తారు. ఆశా వర్కర్లు కాదు" అని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

కృష్ణబాబు- ప్రిన్సిపల్ సెక్రటరీ, వైద్యారోగ్య శాఖ

క్యాన్సర్ ను కన్ ఫామ్ చేయడానికి చేసే పరీక్ష బయాప్సీ మాత్రమే. మిగిలిన పరీక్షలన్నీ రూలౌట్ చేయడానికే. కేజీహెచ్, గుంటూరు, కర్నూలులో క్యాన్సర్ ట్రీట్ మెంట్ సౌకర్యాలు ఉన్నాయి. తొలి స్టేజ్ లో డయాగ్నోజ్ చేస్తే లైఫ్ స్పాన్ ను పెంచుకోవచ్చు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాళ్లు కూడా ఓ టీంను బలభద్రపురం పంపారు. పర్యావరణ అంశాలు క్యాన్సర్ కు కారణం అంటే లంగ్స్, స్కిన్ ఎఫెక్ట్ కావాలి. ఆ తరహా క్యాన్సర్లు అక్కడ డయాగ్నోజ్ కాలేదు. ఇదే అంశంపై సీఎం కూడా రివ్యూ చేశారు.

# మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ

గుంటూరు, మార్చి 25

చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజని, నరసరావుపేట టిడిపి ఎంపీ లావు కృష్ణదేవరాయలు మధ్య పరస్పర ఆరోపణలు జోరుగా సాగుతున్నాయి. వైసీపీలో హయాంలో ఆరోగ్యశాఖ మంత్రిగా మొన్న విడదల రజిని తన నియోజకవర్గంలో స్టోన్ క్రషర్స్ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేశారంటూ ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ంఅః కేసులు నమోదు చేసింది. రేపో మాపో విడదల రజని అరెస్టు తప్పదు అంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై భగ్గుమన్న రజని టిడిపి నేతలపై ఆరోపణలు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుత నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు తనపై కక్ష కట్టారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానికంగా ఉన్న స్టోన్ క్రషర్ యజమాని నుండి రెండు కోట్లకు పైగా డబ్బులు వసూలు చేశారనేది ఆమెపై ఉన్న ఆరోపణ. మాజీ మంత్రి విడదల రజని చేసిన ప్రధాన ఆరోపణ తన కుటుంబాన్ని ప్రస్తుత ఎంపీ లావు కృష్ణదేవరాయులు టార్గెట్ చేశారని తన ఫోన్ కాల్ డేటాను సేకరించే ప్రయత్నం కూడా గతంలోనే చేశారని జర్మనీలో ఉంటున్న తన మరిది ని కూడా కేసుల్లో ఇరికించే కుట్ర జరుగుతుందని. నిజానికి ఒకప్పుడు కృష్ణదేవరాయలు కూడా వైసిపి ఎంపిగానే ఉండేవారు. అప్పటినుంచే వారిద్దరి మధ్య విభేదాలు ఉన్నాయి. 2020లో గురజాల పోలీస్ స్టేషన్లో తనకు అవమానం జరిగిందని దాని వెనక అప్పటి వైసీపీ ఎంపీ కృష్ణదేవరాయల అధికార దుర్వినియోగం ఉందని రజని ఆరోపించారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు నేపథ్యంలో కృష్ణదేవరాయలు టిడిపిలోకి రావడం నరసరావుపేట ఎంపీగా గెలుపొందడం జరిగిపోయింది. మరోవైపు వైసీపీ ఓటమి పాలయ్యింది. అప్పటినుంచి తనను కేసుల్లో ఇరికించే కుట్రలు ఎక్కువ అవుతున్నాయని విడదల రజని ఆరోపిస్తున్నారు. తనపై విడదల రజని చేసిన ఆరోపణలకు ఢిల్లీలో ఎంపీ లావు కృష్ణ దేవరాయలు కౌంటర్ ఇచ్చారు. తనకు బూతులు రావని, మాజీ మంత్రి రజనీలా అబద్దాలు ఆడడం రాదని ఆయన అన్నారు. రజిని కాల్ డేటా సేకరించి ప్రయత్నం తాను చేయలేదని తన ఇంట్లో కూడా మహిళలు ఉన్నారని వాళ్ళకో న్యాయం రజనీ కో న్యాయం అంటూ ఉండదని చెప్పుకొచ్చారు. రజినీ మాటలు వెనక ఎవరున్నారో తనకు తెలుసని చెప్పిన కృష్ణదేవరాయలు ఎవరో స్టోన్ క్రషర్ యజమాని ఇచ్చిన కంప్లైంట్ కు తనకు సంబంధం ఏంటని అన్నారు. తమ చాలా ఏళ్లుగా విద్యాసంస్థలు నడుపుతున్న ప్రభుత్వం నుంచి భూమిని తీసుకున్న సందర్భమే లేదని అన్నారు. పది రోజుల క్రితం విడదల రజని ఒక మధ్యవర్తి ద్వారా కేసులు నుంచి తనని తప్పించమని రాయబారం నడిపిన మాట వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. స్టోన్ క్రషర్ యజమాని నుండి తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని చెప్పిన మాట నిజమో కాదో రజిని చెప్పాలని ఆయన అన్నారు. చేసిందంతా చేసి ఇప్పుడు ఇలా తనపై విమర్శలు చేయడం కరెక్ట్ కాదని చట్టం తన పని తాను చేసుకు పోతుందని కృష్ణదేవరాయలు మాజీ మంత్రికి కౌంటర్ ఇచ్చారు. తను వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ఎవ్వరి పైనా ఎలాంటి విమర్శలు చేయలేదని తనను అనవసరంగా రెచ్చగొట్టొద్దని ఆయన స్పష్టం చేశారు. మరి రానున్న రోజుల్లో ఈ వివాదం ఇంకెన్ని టర్న్ తీసుకుంటుందో చూడాలి.

## తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ సిబ్బంది నిరసన

విజయనగరం

విజయనగరం జిల్లా కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ 102 సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం కెప్టెన్లు కు ఇస్తున్న 7780 రూపాయల జీతం చాలడం లేదని అన్నారు. మార్చి 31వ తేదీతో ముగిసిపోతున్న తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ 102 టెండర్ ముగి సిపోవడంతో కొత్త టెండర్ విధానం లో 18500 జీవితం చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు సకాలం లో అందడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు టెండర్లు ఆహ్వానించినప్పుడు డ్రైవర్స్ జీతాలని మునుగోడులోకి తీసుకొని టెండర్లు వేస్తారని ఆశిస్తూ ఎదురు చూస్తున్నట్లు తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ సిబ్బంది తెలిపారు. 102 డ్రైవర్లను 104 వాహనాలకు కూడా వాడు తున్నారని ఇది డ్రైవర్లకు మరింత బారమని అన్నారు.

## రెండు లారీలు ఢీ.. డ్రైవర్ కు తీవ్ర గాయాలు

పామర్రుపామర్రు - దిగమర్రు జాతీయ రహదారిపైపామర్రు (మ) కొండాయపాలెం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. ఢీకొన్న లారీ డ్రైవర్ క్యాబిన్ లో ఇరుక్కుపోయాడు. డ్రైవర్ తోట్లవల్లూరు మండలం కలాసుమాలపల్లికి చెందిన గుంజ శ్రీనివాసరావు గా గుర్తించారు. ఎస్సై రాజేంద్రప్రసాద్, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, స్థానికులు మరో లారీకి తాళ్లు కట్టి క్యాబిన్ ఇరుక్కుపోయిన డ్రైవర్ను బయటకు లాగి ప్రాణాలు కాపాడారు. గాయపడిన డ్రైవర్ ను అంబులెన్స్ లో మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు.

# శాపంగా మారిన సిన్సియారిటీ...

గుంటూరు, మార్చి 25,

సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణకు ఇక మంత్రి పదవి దక్కే అవకాశాలు లేవు. ఎందుకంటే ఇప్పటికే కాపు సామాజికవర్గం కోటాలో అనేక మంది ఉండటంతో ఆయనకు ఈ టర్మ్ లో మంత్రిపదవి దక్కడం అనేది అసంభవమేనని చెప్పాలి. ఇటు జనసేన, అటు బీజేపీ, మరొకవైపు టీడీపీలోనూ కాపు సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎమ్మెల్సీ పదవుల విషయంలోనూ, మంత్రి పదవుల విషయంలోనూ కాపులకే ఈ మూడు పార్టీలు ఇప్పటికే ప్రాధాన్యత ఇచ్చాయి. దీంతో కన్నా లక్ష్మీనారాయణకు ఒకవేళ విస్తరణ జరిగినా మంత్రి పదవి దక్కే అవకాశం దాదాపు శూన్యమనే చెప్పాలి. ఎందుకంటే చంద్రబాబు కేబినెట్ లో ఇప్పటికే నలుగురు కాపు సామాజికవర్గానికి చెందిన వారుండటంతో పాటు నాగబాబుకు కూడా మంత్రి పదవి ఇస్తే ఐదుగురు అవుతారు. పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్ జనసేన నుంచి మంత్రి వర్గంలో ఉండగా, నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ టీడీపీ నుంచి ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ పోస్టుల్లోనూ జనసేన నాగబాబుకు అవకాశమివ్వగా, బీజేపీ అదే సామాజికవర్గానికి చెందిన సోము వీర్రాజుకు ఇచ్చింది. ఇక కేబినెట్ లో ఉన్న నిమ్మల రామానాయుడు,నారాయణలు ఇద్దరూ చంద్రబాబుకు అత్యంత ఇష్టులు. నమ్మకమైన నేతలు. వారిని కాదని మరొక కాపు సామాజికవర్గం నేతకు మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేదు. అందుకే కన్నా లక్ష్మీనారాయణ కు మంత్రి పదవి దక్కే అవకాశాలు దాదాపు మూసుకుపోయినట్లేనని ఏపీ పాలిటిక్స్ తెలిసిన వారు ఎవరైనా చెప్పక తప్పదు. సీనియర్ మోస్ట్ నేత అయిన కన్నా లక్ష్మీనారాయణ కాంగ్రెస్ లో ప్రభుత్వం ఏర్పడినప్పుడల్లా గుంటూరు జిల్లా కోటా కింద మంత్రి అయ్యే వారు. సీనియారిటీ మాత్రమే కాకుండా సామాజికవర్గం కూడా అదనపు బలం అయి కన్నా లక్ష్మీనారాయణకు ప్రతిసారీ మంత్రి పదవి దక్కేది. కానీ ఈసారి పార్టీలు మారినా, అధికారంలోకి వచ్చినా ఫలితం కనిపించడం లేదు. కన్నా లక్ష్మీనారాయణ రాష్ట్ర విభజనకు ముందు కూడా మంత్రివర్గంలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. కానీ రెండేళ్ల తర్వాత ఆయనను పదవి నుంచి తొలగించడంతో మనస్తాపం పొందిన కన్నా లక్ష్మీనారాయణ టీడీపీలో చేరారు. కన్నా లక్ష్మీనారాయణ జనసేనలో చేరతారని అనుకున్నా అనూహ్యంగా తెలుగుదేశం పార్టీలో చేరారు. కోడెల కుటుంబాన్ని కాదని సత్తెనపల్లి టిక్కెట్ ఇచ్చారు. ఇక అధికారంలోకి రాగానే తనకు మంత్రి పదవి గ్యారంటీ అనుకున్నారు. జిల్లా కోటాలోనూ... కానీ టీడీపీ కోటాలో దక్కించుకున్న ఇద్దరిలో నిమ్మల రామానాయుడు కాపు సామాజికవర్గమైనా మూడుసార్లు గెలిచి పార్టీకోసం అత్యంత నమ్మకంగా పనిచేశారు. పొంగూరు నారాయణను చంద్రబాబును వేరు చేసిచూడలేం. కాపు సామాజికవర్గంలో ఎక్కువ మంది నేతలుండటం వల్ల కన్నా లక్ష్మీనారాయణకు మంత్రి పదవి దూరమయిందనే అనుకోవాలి. ఆయన కూడా ఇక మంత్రి పదవి పై ఆశలు వదులుకున్నట్లే కనిపిస్తుంది. అందుకే పెద్దగా పార్టీలోనూ యాక్టివ్ గా ఈ మధ్యకాలంలో కనిపించడం లేదు. దీంతోపాటు గుంటూరు జిల్లా నుంచి నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్ కేబినెట్ లో ఉండటంతో జిల్లా కోటాలోనూ అసాధ్యమనే చెప్పాలి. అందుకే కన్నాకు పాపం.. సీనియారిటీ కంటే సిన్సియారిటీ శాపంగా మారిందనే చెప్పాలి.

# కర్నూలు మేయర్ పీఠంపై కన్ను

కర్నూలు, మార్చి 25,

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ లో రాజకీయం రసవత్తరంగా మారబోతోంది. మేయర్ పీఠంపై కన్నేసిన టీడీపీ త్వరలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. మార్చి 19తో మేయర్ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి కావడంతో ప్రస్తుత మేయర్ పై అవిశ్వాసం పెట్టే దిశగా టీడీపీ వ్యూహాలు రచిస్తోంది. ఇక కర్నూలు మేయర్ కార్పొరేషన్ లో 52 కార్పొరేటర్లకు గాను ప్రస్తుతం టీడీపీకి ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిపి 24 మంది సభ్యులు ఉన్నారు.గతంలో 52 లో 43 డివిజన్లు గెలిచిన వైసీపీ.. మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. అయితే ఇటీవల ఆరుగురు కార్పొరేటర్లు టీడీపీతో టచ్ లో ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ ఆరుగురు వైసీపీకి దూరమైతే ఆ పార్టీ సంఖ్యా బలం 37కి పడిపోనుంది. ఈ క్రమంలో మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు టీడీపీ పావులు కదుపుతోంది. పీఠాన్ని కోల్పోకుండా ఉండేందుకు వైసీపీ వ్యూహాలు రచిస్తోంది.కర్నూలు నగర మేయర్ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తైంది. దీంతో టీడీపీ కూటమి మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. మేయర్ గా బీవై రామయ్య పీఠాన్ని కైవసం చేసుకునేందుకు కూటమి సన్నద్ధమైంది. మూడు నియోజకవర్గాలకు సంబంధించిన కార్పొరేటర్లు కర్నూలు నగరానికి ఉన్నారు.మొత్తం 52 కార్పొరేటర్లు ఉన్నారు. 36 మంది కర్నూలు నగరానికి సంబంధించిన వారు, 16 మంది పాణ్యం నియోజకవర్గం, ముగ్గురు కోడుమూరు నియోజకవర్గానికి చెందిన వారు ఉన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నారు. గతంలో 43 మంది కార్పొరేటర్లతో వైసీపీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. మేయర్ దింపేసి పీఠాన్ని దక్కించుకోవాలని కూటమి చూస్తోంది. 28 మంది కార్పొరేటర్ల బలం ఉంటే మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. అందులో భాగంగానే మేయర్ సీటుపై టీడీపీ కన్నువేసింది

# ఆర్ఓబి నిర్మాణంలో అడ్డంకులు ఆదిగమించడానికి చర్యలు:

**గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**ఎన్.హెచ్.ఏ అధికారులతో సమావేశమైన..ఎమ్మెల్యే**

**రైల్వే గేట్లపై ఆర్ఓబి నిర్మాణ పనులకు... సాంకేతిక**

**అనుమతులు మంజూరు :ఎమ్మెల్యే రాము**

గుడివాడ మార్చి 25:

గుడివాడలో ఆర్ఓబి నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలో చర్యలు తీసుకుంటున్నామని....పూర్తి స్థాయిలో పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు.

గుడివాడ పట్టణం రాజేంద్రనగర్ లోని తన స్వగృహంలో జాతీయ రహదారుల అథారిటీ అధికారులతో....ఆర్ఓబి నిర్మాణ పనులపై ఎమ్మెల్యే రాము రివ్యూ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గుడివాడ పట్టణంలోనీ ప్రధాన రహదారుల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రాము సమీక్షించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు.

అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడారు.... గుడివాడ పట్టణంలో జరుగుతున్న రైల్వే గేట్లపై నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు.రైల్వే గేట్ల పై ప్రాంతంలో... ఆ శాఖ అనుమతులు రాకపోవడంతో నిర్మాణ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదన్నారు. రైల్వే శాఖ నుండి సాంకేతిక అనుమతులు వచ్చాయని,ఇతర అనుమతులు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రధానంగా గేట్ల పై బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెట్టిన తర్వాత.... అత్యధిక రోజులు గేట్లు మూయాల్సి వస్తుందని, గేట్ల మూసి ఉంచే రోజులను తగ్గించడమే కాక, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా చివరి దశకు చేరుకున్న 216 జాతీయ రహదారిని



అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.అండర్ పాస్ నిర్మాణ పనులు కూడా త్వరగతిన జరిగేలా కృషి చేస్తున్నామని... ఆర్ఓబి నిర్మాణం పూర్తి కావడానికి ఉన్న అడ్డంకులను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ వేగవంతంగా నిర్మాణ పనులు జరిగేలా అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.

అదేవిధంగా గుడివాడ బస్టాండ్ సెంటర్ నుండి వాసవి చౌక్, మార్కెట్ సెంటర్, బంటుమిల్లి రోడ్డు మీదుగా బైపాస్ రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ పై.... టైయిలింగ్ ఏర్పాటు పనులు, ఐఎంఎ రహదారి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు.పట్టణంలోని ప్రధాన రహదారుల ఎండ్ టూ ఎండ్ విస్తరణ, రహదారుల వెంబడి డ్రైనేజీల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు అతి త్వరలో అనుమతులు రానున్నాయని ఎమ్మెల్యే రాము చెప్పారు. ఢిల్లీ వరకు వెళ్లైనా సరే అభివృద్ధి పనులకు నిధులు సాధించేలా ఎంపీ వల్లభనేని బాలసౌరితో కలిసి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు.

ఈ సమావేశంలో నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సంజీవ రాయుడు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. శరత్ చంద్ర, ప్రాజెక్టు మేనేజర్ ఎన్. శ్రీనివాస్, టీం లీడర్ దివాకర్, రెసిడెన్ట్ ఇంజనీర్ బి. నిరంజన్ రావు,వల్లభనేని కన్స్ట్రక్షన్స్ ఎండి వి. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ ప్లాన్ పక్కాగానే ఉందే...

ఏలూరు, మార్చి 25,

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యూహం అదేనా? పదే పదే చంద్రబాబు నాయుడును పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని చెప్పడం వెనక కారణమేమై ఉంటుందన్న దానిపై ఆంధ్రప్రదేశ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఆయన ఒక స్ట్రాటజీ ప్రకారమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ముందుచూపుతోనే ఈ కామెంట్స్ తరచూ చేయడం వెనక కూడా దూరదృష్టి ఉందని అంటున్నారు. చంద్రబాబు నాయుడు పట్ల తనకున్న అభిమానాన్ని పవన్ కల్యాణ్ చెబుతుంటే భవిష్యత్ లో తనకు టీడీపీ అనుకూలురు మద్దతు కూడా లభిస్తుందన్న కారణంతోనే చంద్రబాబు పదిహేనేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలని పదే పదే కోరుతున్నారని చెబుతున్నారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ఒక రకంగా టీడీపీ శ్రేణులకు, నేతలకు కూడా కొంత ఇబ్బందికరంగా మారాయని చెప్పాలి. ఎందుకంటే చంద్రబాబు తమ అధినేత అయినప్పటికీ వారంతా నారా లోకేశ్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. నారా లోకేశ్ ను ఉప ముఖ్యమంత్రిగా చేయాలన్న డిమాండ్ ఇటీవల కాలంలో ఊపందుకుంది. చిన్న స్థాయి నేతల నుంచి సీనియర్ నేతల వరకూ నారా లోకేశ్ ను ఉప ముఖ్యమంత్రిగా చేయాలని అంటున్నారు. అయితే అందుకు జనసేన క్యాడర్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నారా లోకేశ్ కు డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పదవి ఇవ్వడమేంటని సోషల్ మీడియాలో ప్రశ్నించారు.అయితే చంద్రబాబును పదే పదే పొగడటంతో పాటు ఆయనే పదిహేనేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకోవడం వెనక కూడా పవన్ కల్యాణ్ వ్యూహమేనంటున్నారు. తన వ్యాఖ్యలతో నారా లోకేశ్ డిప్యూటీ సీఎం పదవికి చెక్ పెట్టడమే కాకుండా, దరిదాపుల సమయంలో నారా లోకేశ్ ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపించకూడదనే పవన్ కల్యాణ్ ఇలా చంద్రబాబును సీఎంగా కొనసాగాలంటున్నారన్న రాజకీయ విశ్లేషణలు మొదలయ్యాయి.



దీనివల్ల టీడీపీ సానుభూతి పరులతో పాటు ఆ ఓటు బ్యాంకు కూడా తనకు భవిష్యత్ లో అండగా నిలుస్తుందన్న భావన ఆయనలో ఉందన్నారు. అందుకే చంద్రబాబు నాయుడుప పదిహేనేళ్ల సీఎం అంటూ పదే పదే వ్యాఖ్యలు చేస్తూ పవన్ టీడీపీలో కొందరి మైండ్స్ ను బ్లాంక్ చేస్తున్నారంటున్నారు. చంద్రబాబు నాయుడు కూడా పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలకు ఖుషీ అవుతున్నారు. తనకు అండగా పవన్ కల్యాణ్ ఉంటారన్న నమ్మకంతో ఆయన జనసేనకు కూడా మంచి ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలున్నాయి. అదే సమయంలో నేతలు అక్కడకక్కడా ఇబ్బంది పెట్టినా పవన్ కల్యాణ్ అండ తనకు అవసరమని భావిస్తున్న చంద్రబాబు పవన్ కల్యాణ్ విషయంలోనూ భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ పరంగా చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. దీంతో పాటు బీజేపీని కూడా టీడీపీతో కలసి ప్రయాణం చేసేందుకు పవన్ కల్యాణ్ ఉపయోగపడతారని, కూటమి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు వీలవుతుందన్న అంచనాల్లో చంద్రబాబు ఉన్నారని చెబుతున్నారు.

# నల్లమల్లలో అలా నడుచుకుంటూ...

కర్నూలు, మార్చి 25,

నంద్యాల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు ఈనెల 27 నుంచి 31 వరకు వైభవంగా జరగనున్నాయి ఈ నేపథ్యంలో దేవాదిదేవుడిని తనివితీరా దర్శించుకునేందుకు నల్లమల అడవి మార్గం గుండా కాలినడకన పాదయాత్రగా కన్నడ భక్తులు వేలాది తరలివస్తున్నారు. నల్లమల అంతా ఓంకారనాదంతో ప్రతిధ్వనిస్తోంది. ఉగాది పర్వదినం సమీపిస్తుండటంతో శ్రీ గిరి మల్లయ్యను ధ్యాన మల్లన్న తండ్రి అదుకో అంటూ ఆర్తితో పిలుస్తూ శ్రీగిరి కొండకు చేరుకుంటున్నారు. నల్లమల అరణ్యం గుండా కాలినడకన వస్తున్న వారికి దేవస్థానం పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించింది. ఆత్మకూరు సమీపంలోని వెంకటాపురం గ్రామం వద్ద మంచినీటి సౌకర్యం గతం కంటే బాగుందని అయితే అటవీ మార్గం మధ్యలో కొద్దిగా ఇబ్బంది ఉన్న ఏర్పాట్లు బాగున్నాయని కన్నడ భక్తులంటున్నారు. నల్లమల బాటలన్నీ మల్లన్న సన్నిధి వైపే కన్నడ భక్తుల భజనలతో మార్మోగుతున్న శ్రీశైలం మరోపక్క వైద్య సదుపాయాలు బాగున్నాయని అడవి మార్గంలో బీమకొలను మీదుగా కొండెక్కి కన్నడిగులు పాదయాత్రగా నడుచుకుంటూ వస్తున్న నేపధ్యంలో దేవస్థానం అధికారులు లక్షలు ఖర్చుపెట్టి కాలినడకన నల్లమల నుంచి వచ్చే కన్నడ భక్తులకు వైద్య సౌకర్యాలు కల్పించారు.పాదయాత్ర భక్తుల కోసం అడవిమార్గంలో



రాళ్లు రప్పలు లేకుండా కాలినడకన వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి వెంట ట్రాక్టర్లతో నీరు చల్లుతున్నారు. భక్తులకు మార్గమధ్యలో దేవస్థానం సహకారంతో స్వచ్ఛంద సేవకర్తలతో అన్నదాన ఏర్పాటు చేశారు. కన్నడ భక్తులు శ్రీశైలం శ్రీ భ్రమరాంబికాదేవిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి ఆడపడుచును తనివితీరా చూసేందుకు ఎండను సైతం లెక్కచేయకుండా మండుటెండలో ఎంతో భక్తి శ్రద్ధలతో వెంకటాపురం నుంచి దట్టమైన అటవీప్రాంతంలో సుమారు 40 కిలోమీటర్లు నడుచుకుంటున్న వస్తున్నారు. పాదయాత్రగా వస్తున్న కన్నడ భక్తుల కోసం పలువురు దాతలు మజ్జిగ, పండ్లు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భక్తుల సౌకర్యాలపై దేవస్థానం ఈవో శ్రీనివాస రావు ప్రత్యేక దృష్టి పెట్టడం సంతోషంగా ఉందని పలువురు కన్నడ భక్తులు తెలిపారు.

# హైదరాబాద్ లో అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి కొరడా

రంగారెడ్డిరాజేంద్రనగర్ నలంద నగర్ అనుమతులేని నిర్మాణాలను జీహెచ్ఎంసి కూల్చివేసింది. ఎన్ని సార్లు నోటీసులు జారీ చేసినా బిల్డింగ్ యజమాని పట్టించుకోలేదు. దాంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య బిల్డింగ్ స్లాబ్ లను జీహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. పర్మిషన్ కు మించి బిల్డర్ రెండు అంతస్తులు అదనంగా వేసాడు. అదనంగా వేసిన ఐదవ, ఆరవ ఫ్లోర్ స్లాబ్లను జీహెచ్ఎంసి అధికారులు తొలగించారు.

# అవనిగడ్డ లో డీఎస్సీ అభ్యర్దుల ఆందోళన

అవనిగడ్డఅవనిగడ్డలో డీఎస్సీ అభ్యర్దులు అందోళనకు దిగారు. మెగా డీఎస్సీ ని వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగుల డిమాండ్ చేసారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ డీఎస్సీని ప్రకటించాలని రోడ్డుపై బైఠాయించారు. వందలాదిగా రోడ్డుపై బైటాయించి డిఎస్సీ నిరుద్యోగులు నిరసన తెలిపారు. సీఎం చంద్రబాబుఎన్నికల సమయంలో డీఎస్సీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేసారు. అవనిగడ్డలో రాజీవ్ చౌక్ వద్ద ధర్నా మానవహారం, అనంతరం ప్రదాన రహదారి వెంట భారీ ర్యాలీ నిర్వహించారుద. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించిన పవన్ కళ్యాణ్ గొంతుక అధికారంలోకి రాగానే మూగ పోయిందంటూ నినాదాలు చేసారు ఈ నేపథ్యంలో అవనిగడ్డలో కిలోమీటర్ మేర భారీగా ట్రాఫిక్ స్థంభించింది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు ఏప్రిల్ 2 కు వాయిదా

న్యూఢిల్లీ బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు ఏప్రిల్ 2 కు వాయిదా పడింది. మంగళవారం నాడు సుప్రీంకోర్టులో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు విచారణ జరిగింది. బిఆర్ఎస్ తరపు వాదనలు ముగిసాయి. స్పీకర్, అసెంబ్లీ సెక్రటరీ తరపు న్యాయవాదులు ఏప్రిల్ 2న వాదనలు వినిపించనున్నారు.

# క్యాన్సర్ బాధితుడి మాటలకు మంత్రి శ్రీధర్ బాబు కన్నీళు

## కోరిక మేరకు క్రికెట్ కిట్ అందజేత

## అన్నగా అండగా ఉంటానని భరోసా

హైదరాబాద్ 25,"సార్, నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కలగన్నా.. నాకో క్రికెట్ కిట్ ఇప్పించండి సార్" క్యాన్సర్ తో పోరాడుతున్న ఓ యువకుడి మాటలివి. వింటే మనసున్న ప్రతీ మనిషికీ గుండె చెమర్చక మానదు. ఈ మాటలకే మంత్రి శ్రీధర్ బాబు ఏకంగా కన్నీళ్లు పెట్టుకున్నారు.భూపాలపల్లి జిల్లా పాలిమల మండలం సర్వాయ్ పేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ కాన్సర్ తో బాధపడుతూ... ఖాజాగూడలోని లోని స్పర్ష్ హాస్పీస్ లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా ఆసుపత్రికెళ్లి పరామర్శించారు. నేనున్నానని భరోసానిచ్చారు.

# టూరిజం హబ్ గా విజయవాడ

విజయవాడ, మార్చి 25,

అమరావతికి గేట్ వేగా ఉన్న విజయవాడను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య, పర్యాటక కేంద్రంగా విరాజిల్లిన విజయవాడకు.. పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కృష్ణా తీరంలోని బెజవాడ నగరాన్ని వివిధ రంగాల సమగ్ర అభివృద్ధితోనూ పరుగులు తీయించాలని.. ప్రభుత్వం భావిస్తోంది.



ఇందుకోసం అన్ని వర్గాల ప్రజలను భాగస్వాముల్ని చేసేందుకు.. ఎన్టీఆర్ జిల్లా అధికారులు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. దీనికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.

1. విజయవాడకు పుదుచ్చేరి తరహాలో బ్రాండింగ్ తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 'వైబ్రెంట్ విజయవాడ' పేరుతో ఒక లోగోను రూపొందించాలని అధికారులు భావిస్తున్నారు.

2. ప్రభుత్వ శాఖలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్ అసోసియేషన్, ఇతర సంఘాల సహాయంతో పర్యాటక ప్యాకేజీని రూపొందించనున్నారు. విజయవాడలో ఉన్న పర్యాటక ప్రదేశాలను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

3. మంటపం, గాంధీ కొండ, ప్రకాశం బ్యారేజీ, రాజీవ్ గాంధీ పార్కు, మొగల్రాజపురం గుహలు, ఉండవల్లి గుహలు, భవానీ ద్వీపం, కొండపల్లి కోట వంటి ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నారు. కనకదుర్గ అమ్మవారి దేవాలయం, మరకత రాజరాజేశ్వరీ దేవాలయం, వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం, ఆంజనేయస్వామి వారి దేవాలయం, ప్రసన్న గణపతి దేవాలయం, త్రిశక్తి పీఠం, రామలింగేశ్వర స్వామి దేవాలయం వంటి మతపరమైన పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నారు.

4. పర్యాటకులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పర్యాటకులకు వసతి, రవాణా, ఆహారం, ఇతర సౌకర్యాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

5. విజయవాడ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం వివిధ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. విజయవాడ పర్యాటక ప్రదేశాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

6. విజయవాడలో భవాని ద్వీపం మంచి టూరిస్ట్ స్పాట్. భవాని ద్వీపాన్ని ఒక గొప్ప పర్యాటక ప్రదేశంగా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అక్కడ కొత్త పర్యాటక ఆకర్షణలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

7. ప్రకాశం బ్యారేజీని కూడా పర్యాటక ప్రదేశంగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బ్యారేజీ చుట్టూ పర్యాటక సౌకర్యాలు అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

8. విజయవాడలో ఉన్న చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆ ప్రదేశాలను పర్యాటకులకు ఆకర్షణీయంగా మార్చడానికి చర్యలు తీసుకుంటోంది.

9. విజయవాడ నగరంలోనే కాకుండా.. చుట్టూ కొత్త హోటళు ,, రిసార్ట్‌లను నిర్మించడానికి ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. అలాగే బెజవాడ చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

10. విజయవాడకు దేశంలో ఎక్కడినుంచైనా సులభంగా చేరుకోవచ్చు. ఎయిర్, రైల్వే, రోడ్ కనెక్టివిటీ ఉంది. దీంతో పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఎన్టీఆర్ జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# వైకాపా నేత ఇంటిపై దాడి

అనంతపురంఅనంతపురం జిల్లా గుత్తి పట్టణం లో టిడిపి నేతలు జక్కలచెరువు ప్రతాప్ వర్గం హల్చల్ సృష్టించారు. పట్టణంలోని వైసీపీకి చెందిన మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి ఇంటి పై కర్రలు రాడ్లతో దాడి చేశారు. పలువురు స్థానికులు చూస్తుండ గానే వైసిపి నేత కోన మురళీధర్ రెడ్డి ఇంటిపై రాళ్లతో ఇంటి తలపు లు అద్దాలు ధ్వంసం చేసి ఇంటి బయట ఉన్న కారుకు అద్దాలు పగలగొట్టి ధ్వంసం చేసి హల్చల్ చేశారు. అంతటితో ఆగకుండా ఎవరైనా చూసినట్లు చెప్తే చంపే స్తామంటూ స్థానికులు బెదిరించి నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన సమయంలో ఇంటి యజమాని ఇంటిలో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.అయితే ఘటన జరగక మునుపే గుత్తి సీఐ వెంకటేశ్వర్లు ఇంటికెళ్లొద్దంటూ వైసీపీ నేతను హెచ్చరించడం సీఐ చెప్పిన కాసేపటి తర్వాతే టిడిపి నేతలు ఇంటిపై దాడి చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. అదేవిధంగా జక్కలచెరువు ప్రతాప్ వర్గం పెద్ద ఎత్తున భూములను కబ్జాలు చేస్తూ చెరువుల్లో అక్రమం గా ఇసుకను తరలించడం మండల పరిధిలో పెద్ద ఎత్తున పేకాట స్థావ రాలను కూడా ఏర్పాటు చేసినట్లు అనేక ఆరోపణలు కూడా ఉన్నాయి వీటిని దృష్టిలో ఉంచుకొని గొడవల ను నివారించాల్సిన గుత్తి సీఐ వైసీపీ నేతను బెదిరించడం ప్రజల్లో తీవ్ర చర్చనీయంశంగా మారింది. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక ప్రెస్ మీట్ లలో కూడా టిడిపి నేతలు ఎక్కడైనా రౌడీయిజానికి పాల్పడితే అలాంటి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించడం జరిగింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి నేతలకు రౌడీ పాలన చెయ్యొద్దు అని చెబుతున్న ఇలాంటి టిడిపి నేతలు రౌడీయిజం చేయడం పై పలువురు ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు . ఇలాంటి వారి వల్ల టిడిపి పార్టీకే రాబోయే స్థానిక ఎన్నికల్లో తీవ్ర నష్టం వాటిల్లి ప్రమాదం ఉందని ప్రజల చర్చించుకుంటున్నారు.మరి ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందేనంటూ నేతలు చర్చించుకుంటున్నారు..

# వైఎస్ పేరు తీసేసిన నోరెత్తని వైసీపీ

విశాఖపట్టణం, మార్చి 25,

ఏపీలో వైఎస్ అనేది ఒక బ్రాండ్.. దివంగత నేత అమలు చేసిన సంక్షేమ పథకాలే ఆయనకు ఆ బ్రాండ్ క్రియేట్ చేశాయి. వైయస్సార్ బ్రాండ్ ఇమేజే వైసిపి ఆవిర్భావానికి పునాదులు వేసింది.. అయితే తండ్రి ఇమేజ్ ని కాపాడటానికి మాత్రం జగన్ ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. వైయస్సార్ పేరును కనిపించకుండా చేయాలని జగన్ చూస్తున్నా పార్టీ నాయకులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో తనదైన బ్రాండ్ చూపించగలిగారు. ప్రజా సంక్షేమ పథకాలు, ఆరోగ్య శ్రీ, జలయజ్ఞం లాంటి ప్రజాకర్ష పథకాలను అమలుచేసి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారు. అలాంటి వైఎస్‌కి ఇప్పుడు ఆదరణ కరువైనట్లు కనిపిస్తుంది. ఆ ఆదరణ, అభిమానం మిస్ అవుతుంది ప్రజల్లో కాదు.. పార్టీ పేరులో ఆ దివంగత నేత పేరు పెట్టుకుని రాజకీయం చేస్తున్న వైసీపీ నాయకుల్లో, కార్యకర్తల్లో.. వైయస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత వెల్లువెత్తిన అభిమానంతో వీధికో విగ్రహం పెట్టారు.వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పథకానికి ఆయన పేరు పెట్టారు. అధికారం కోసం, అధికారంలో ఉన్నప్పుడు పనిచేసిన వైఎస్ ఇమేజ్ అధికారం కోల్పోయిన వెంటనే తగ్గుతున్నట్లు కనిపిస్తుంది. విశాఖ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంకు వైఎస్ పేరు తొలగిస్తే ఆ పార్టీ నేతలు స్పందించిన తీరే అందుకు ఉదాహరణ.అధికారంలో ఉన్న సమయంలో విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి ఉన్న ఎన్టీఆర్ పేరుని తొలగించి వైయస్సార్ పేరు పెట్టింది జగన్ ప్రభుత్వం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్టీఆర్ యూనివర్సిటీకి ఉన్న వైఎస్సార్ పేరుని తొలగించి మళ్లీ ఎన్టీఆర్ పేరును పెట్టింది. హెల్త్ యూనివర్సిటీ స్థాపించినప్పటి నుంచి ఎన్టీఆర్ పేరు ఉంది కాబట్టి తర్వాత వైఎస్ఆర్ పేరు మార్చినా ఎలాంటి విమర్శలు రాలేదు. కొత్త జిల్లాల ఏర్పాటులో కడప జిల్లాకు వైఎస్ఆర్ పేరు కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టి వైసిపి ప్రభుత్వం ఆ నాయకులకు గౌరవ ఇచ్చామని చెప్పుకుందివైఎస్ఆర్ చనిపోయిన తర్వాత ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్లో చర్చించి విశాఖలో ఉన్న ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంకు వైఎస్ పేరు పెట్టారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన 9 నెలల తర్వాత ఐపీఎల్ మ్యాచ్ల కోసం స్టేడియం రెనోవేషన్ చేస్తున్న సందర్భంలో స్టేడియానికి వైఎస్ పేరు తొలగించి ఏసీఏ, వీ డిసిఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం అని పేరు మార్చారు. ఇప్పుడు ఇదే పెద్ద రాజకీయ దుమారం లేపుతుంది. విశాఖలోని క్రికెట్ స్టేడియానికి వైఎస్ పేరు తొలగించడం, వైయస్సార్ జిల్లాకు కడప యాడ్ చేసి వైఎస్ఆర్ కడప జిల్లాగా ప్రతిపాదించడంతో వైఎస్ పేరు కనిపించకుండా, వినిపించకుండా చేయడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించుకుందని వైసీపీ ఆరోపిస్తోందివిశాఖలోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంకు వైఎస్ఆర్ పేరు తొలగించిన వెంటనే వైసీపీ నాయకులు ఒక్కసారిగా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం మొదలుపెట్టారు. ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఉన్న వైసీపీ నాయకులు కార్యకర్తలు విశాఖ క్రికెట్ స్టేడియం వద్దకు చేరుకుని ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆందోళనకు పిలుపునివ్వడంతో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి మళ్లీ వైయస్సార్ పేరు పెట్టే రేంజ్లో ఆందోళన చేస్తారని అందరూ భావించారు.అయితే వైసీపీ నాయకులు ఇచ్చిన పిలుపు, చేసిన ఆందోళన కేవలం ఉనికిని కాపాడుకోవడానికి తప్ప.. నిజంగా వైఎస్ మీద అభిమానంతో కాదని స్పష్టమైంది. విశాఖ ఇంటర్నేషనల్ స్టేడియం దగ్గర వైసీపీ చేపట్టిన ఆందోళనకు కనీస స్పందన లేకపోవడం గమనార్హం.. వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న గుడివాడ అమర్నాథ్ తానే పిలుపునిచ్చారు కాబట్టి ఆందోళనకు హాజరవ్వక తప్పలేదు.. అమర్నాథ్‌తో పాటు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్ కుమార్, చింతలపూడి వెంకటరామయ్య, అరకు మాజీ ఎంపీ గొట్టేటి మాధవి, విశాఖ నగర మేయర్ గొలగాని వెంకట కుమారి, కొంతమంది కార్పొరేటర్లు సహా.. మహా అయితే వంద మంది కార్యకర్తలు ఆ ఆందోళనలో కనిపించారు.విశాఖ నార్త్ వైసీపీ ఇన్చార్జ్ కేకే రాజును పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంతో ఆందోళనకు రాలేదు. కూటమి ప్రభుత్వంతో పాటు సొంత పార్టీ నాయకుల్ని తీవ్రస్థాయిలో విమర్శించే విశాఖ దక్షిణ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ లాంటి వ్యక్తి కూడా ఆందోళనకు హాజరు కాకపోవడం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. దానికి తోడు ఉత్తరాంధ్ర వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ గా నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబు సైతం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆ కార్యక్రమానికి దూరంగా ఉండటం విమర్శల పాలవుతోంది. పార్టీలోని కీలకమైన నాయకులే రాకపోతే సాధారణ కార్యకర్తలు ఎలా వస్తారు అనే చర్చ మొదలైంది.క్రికెట్ స్టేడియానికి వైఎస్ పేరు తొలగించడంతో ఇటు మీడియా ముందు, అటు సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన వైసీపీనాయకులు కార్యకర్తలు ఆందోళనలో పాల్గొనడానికి మాత్రం ఆసక్తి చూపించలేదు. స్టేడియానికి తన తండ్రి పేరు తొలగింపుపై వైసీపీ అధ్యక్షుడు జగన్ కూడా ఎక్కడా స్పందించలేదు. ఈ మధ్య సోషల్ మీడియా పోస్టులతో తన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి. కూటమి ప్రభుత్వం చేసిన పని కరెక్ట్ కాదని ఎక్స్‌లో పోస్ట్ కూడా పెట్టలేదు. కన్న కొడుకే అలా ఉంటే పార్టీ నాయకులు కార్యకర్తలకు అంతకంటే ఏం అభిమానం ఉంటుందిలే అన్న సెటైర్లు వినిపిస్తున్నాయ.వైయస్సార్ పేరు క్రికెట్ స్టేడియం కు పునరుద్ధరించాలంటూ పిలుపునిస్తే ఉత్తరాంధ్ర నుంచి, కనీసం విశాఖ జిల్లా నుంచి 100 మంది కార్యకర్తలు కూడా హాజరు కాలేదంటే వైసీపీ శ్రేణులకు దివంగత నేతపై ఏంత ప్రేమ ఉందో అర్థమవుతోందంటున్నారు. వైఎస్ పేరుని వైసీపీ రాజకీయంగా వాడుకుంది తప్ప.. ఆయన ఇమేజ్‌ను కాపాడాలని జగనే భావించడం లేదని.. జగన్‌కి ఎంత సేపు సెల్ఫ్ ఇమేజే ముఖ్యమన్న విమర్శలు సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. వైఎస్ పేరు తొలగించారు కాబట్టి పార్టీ విమర్శలు పాలు కాకుండా ఉండడానికి ఓ ధర్నాకు పిలుపిచ్చి చేతులు దులుపుకున్నారని నెటిజన్లు దెప్పి పొడుస్తున్నారు.2024 ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితమైన వైసీపీ తిరిగి అంతో ఇంతో ఫాంలోకి రావాలంటే ఏదో ఒక ఇష్యూ ఎత్తుకుని ఆందోళనలు, ఉద్యమాలతో ప్రజల్లో ఉండటానికి ప్రయత్నించాలి? అంది వచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోకుండా ప్రభుత్వంపై ఎదురు దాడి చేయాలి. అయితే తన ప్యాలెస్ టూర్లకే పరిమితమవుతున్న జగన్ ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఇప్పటికే పెరిగిపోతున్నాయి. ఇప్పుడు విశాఖ స్టేడియానికి తండ్రి పేరు తొలగించినా మాజీ ముఖ్యమంత్రి స్పందించే తీరిక లేకుండా పోయింది. ఆ ఇష్యూని వైసీపీ సరిగ్గా హ్యాండిల్ చేసుంటే వైఎస్‌కు ఉన్న ఇమేజ్‌తో వైసిపికి కూడా మైలేజ్ వచ్చేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే జగన్ నోరు మెదపలేదు.. పార్టీ శ్రేణులు స్పందించకపోవడంతో ఆందోళన తూతూ మంత్రంగా ముగిసి.. ఆ పార్టీ ప్రతిష్ఠ మరింత దిగజారిందంటున్నారు.. అదే ఇప్పుడు వైజాగ్ వాసుల్లో చర్చనీయాంశంగా మారింది

## శారదా పీఠం అక్రమాలపై "సిట్" వేయాలి

## తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాఖపట్నం:

శారదా పీఠం పునాదులు కదులుతుండడం తెలుగు శక్తి చేసిన పోరాటల వల్లనే సాధ్యమైందని, ఇది ప్రజల విజయమని.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. ఇదే విషయమై మంగళవారం ఉదయం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో.. ఆయన మాట్లాడుతూ శారదా పీఠంలో అక్రమ నిర్మాణాలు కూల్చివెయ్యాలి తాము గతంలో శారదా పీఠం అక్రమాలపై పెందుర్తి తాసిల్దార్ తో పాటు జిల్లా కలెక్టర్ కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. తాము చేసిన ఫిర్యాదుల ఫలితంగానే సర్వే నిర్వహించిన అనంతరం పెందుర్తి తాసిల్దార్ మీడియాతో మాట్లాడుతూ.. శారదా పీఠంలో కొంతమేర భూమి ఆక్రమణలో ఉందని.. మీడియాకు తెలియజేశారన్నారు. అయితే విషయం సున్నితమైనది కావడంతో పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని.. వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు ఉంటాయని అప్పట్లోనే ప్రకటించారన్నారు. ఇప్పుడు తాజాగా... శారదా పీఠంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబరు 90లో మొత్తం 72 సెంట్ల స్థలం ఉండగా అందులో 22 సెంట్లు ఆక్రమణకు గురైందని పెందుర్తి తాసిల్దార్ ఆనంద్ కుమార్ ప్రకటించారన్నారు. ఆక్రమిత స్థలంలో ఉన్న నిర్మాణాలను ఎందుకు తొలగించకూడదో సమాధానం చెప్పాలని.. శారదా పీఠం మేనేజర్ కు నోటీసు జారీ చేశారన్నారు.

ఒకవేళ తగిన సంజాయిషీ ఇవ్వని పక్షం లో ఆక్రమణలను తొలగించడంతో పాటు అక్రమిత స్థలంలో ఉన్న ఆస్తులను జప్తు చేస్తామని ఆ నోటీసులో ఎంఆర్ఓ పేర్కొన్నారని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శారదా పీఠంలో విలువైన ఆస్తులు, డాక్యుమెంట్లు తరలిపోకుండా ఉండేందుకు పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎటువంటి గుర్తింపు లేని శారదా పీఠానికి అధిపతి అని చెప్పుకున్న స్వరూపానందకు.. వైయస్ జగన్ ప్రభుత్వానికి మధ్య క్విడ్ ప్రో కో జరిగిందన్నారు. ఇదే క్రమంలో భీమిలిలో కారు చౌకగా ఎకరా లక్ష రూపాయలు చొప్పున.. కోట్లాది రూపాయల విలువ చేసే భూములను వైయస్ జగన్ ప్రభుత్వం దారాదత్తం చేసిందన్నారు. అక్కడ ఆశ్రమం నిర్మిస్తానని చెప్పిన స్వరూపానంద వాణిజ్య అవసరాల కోసం ఆ స్థలాన్ని ఉపయోగించే ప్రయత్నం చేశారని బి.వి.రామ్ ప్రస్తావించారు. ఆ భూముల వ్యవహారంపై కూడా తాము ఫిర్యాదులు చేసామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వైయస్ జగన్ ప్రభుత్వం శారదాపీఠం మధ్య జరిగిన అక్రమ కార్యక్రమాలకు సంబంధించి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని బి.వి.రామ్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విలేఖరుల సమావేశం లో తెలుగు దేశం పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి బోడేపూడి దొరబాబు, మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్యాం ప్రసాద్, లాడి కిషోర్ కుమార్, డాక్టర్ కే.సురేష్, పీతల అప్పారావు, దువ్వి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంగా ట్రాక్టర్ డ్రైవింగ్? ప్రమాదంలో 15 మంది మృతి డ్రైవర్ కు పదేళ్ల కారాగార శిక్ష

యాదాద్రి

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి 15 మంది ప్రాణాలు పోవడానికి మరో 17 మంది క్షతగాత్రులు కావడానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్, మరో వ్యక్తికీ 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా రెండవ అదనపు సెషన్స్ కోర్టు జడ్జ్ తీర్పునిచ్చారు. శిక్షతోపాటు ఒక్కొక్కరికి 5 వేల రూపాయల జరిమానా విధించారు. 2018 సంవత్సరంలో వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధి వేములకొండ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా పంటను, వ్యవసాయ సామాగ్రిని తరలించడానికి మాత్రమే ఉపయోగించాల్సిన ట్రాక్టర్ ను చట్టబద్ధంగా వ్యవసాయ కార్మికులను తరలించడానికి ఉపయోగించడమే కాకుండా ట్రాక్టర్ ను నిర్లక్ష్యంగా, జాగ్రత్తగా నడిపినట్లు మోపబడిన ఆరోపణలు రుజువు కావడంతో ఎస్సీ ఎస్టీ ఉ రెండవ అదనపు సెషన్స్ కోర్టు ఇద్దరు నిందితులకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది

## క్రికెట్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్

క్రికెట్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకుని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌడవెల్లిలో ఘటన చోటు చేసుకుంది. గుండ్ల పోచంపల్లి కి చెందిన సోమేశ్ (29) క్రికెట్ బెట్టింగ్ లో రూ. రెండు లక్షలు పోగొట్టుకున్నాడు. మనోవేదనకు గురవుతున్న సోమేశ్, మంగళవారం గౌడవెల్లి పరిధిలో రైలు పట్టాలపై పడుకొని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## కొబ్బరి బొండాల ముసుగులో ఆవు దూడల రవాణా

నల్గొండ

నకిరేకల్ మండలం కడపర్తి జాతీయ రహదారిపై అశోక్ లీలాండ్ వాహనం బోల్తా పడింది. దాంతో ఆవులు బయటపడ్డాయి. కొబ్బరి బొండాల రవాణా ముసుగులో ఆవు దూడలను ముఠా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. చిన్న వాహనంలో 12 దూడలను కట్టివేసి పైనుండి కొబ్బరి బొండాలు వేసి కబేలాకి తీసుకు వెళుతున్నారు ముఠా సభ్యులు. 12 ఆవు దూడల్లో ఒకటి మృతి చెందింది. రెండిటికి తీవ్ర గాయాలు అయ్యాయి. పారిపోతున్న వాహన డ్రైవర్ ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

# రెడ్డి వర్గంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఛాన్స్ దక్కేనా?

**ముస్లిం మైనారిటీకి ప్రాధాన్యత ? ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ మంత్రివర్గంలో చేరతారా**

**రంగారెడ్డి జిల్లాకు న్యాయం ? మల్ రెడ్డి రంగారెడ్డికి కీలక పదవి దక్కుతుందా?**

**ఐలయ్య, విజయశాంతి,ఇతర నేతలకు అవకాశం ఉంటుందా?**

**ఎస్సీ, ఎస్టీ వర్గాలనుంచి గడ్డం వివేక్, బాలు నాయక్ పేర్లు పరిగణనలో!**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహం ? 2029 ఎన్నికల దిశగా కాంగ్రెస్ ముందుకు**



హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో మంత్రివర్గ విస్తరణ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు పూర్తయినా,ఇంకా కాబినెట్ లో 6 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి.

జిల్లాల వారీగా మంత్రి పదవులకు ఆశావహులు ఎక్కువవడంతో కాబినెట్ కూర్పు ఆలస్యమవుతుంది. తెలంగాణలోని ప్రధాన జిల్లాల నుంచి మంత్రి పదవులు ఆశిస్తున్నవారి జాబితాను పరిశీలిస్తేనల్గొండ జిల్లా నుండి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి (రెడ్డి) ?ఇప్పటికే మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడు. మంత్రి పదవి కావాలంటూ అసమ్మతి గళం వినిపిస్తున్నారు. మరో వైపు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య (బీసీ) ?బీసీ కోటా లో తనకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానం వద్ద లాబీయింగ్ చేస్తున్నారు. బాలు నాయక్ (ఎస్టీ) ? దేవరకొండ నియోజకవర్గం నుంచి ఎస్టీ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించా లని డిమాండ్ చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా నుండి సీఎం రేవంత్ రెడ్డికి సమీప బంధువు సుదర్శన్ రెడ్డి మాజీ మంత్రి ఒక్క మంత్రి కూడా లేని తమ జిల్లాకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు..రెడ్డి వర్గంలో ఒక మంత్రి పదవి ఆయనకు దక్కే అవకాశాలు ఎక్కువ అనే చర్చ జరుగుతుంది.రంగారెడ్డి జిల్లా నుండి ప్రాతినిధ్యం లేకపోవడం తో కేబినెట్ లో మంత్రి గా అవకాశం కల్పించాలని మల్ రెడ్డి రంగారెడ్డి (రెడ్డి) ?ఓ సి కోటా లో లాబీయింగ్ చేస్తున్నారు. మైనార్టీ లలో కూడా కాంగ్రెస్ కు ఒక్క ఎమ్మెల్యే లేకపోవడంతో ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ (ముస్లిం మైనారిటీ) ? ముస్లిం వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలనే కాంగ్రెస్ వ్యూహంలో కీలకమైన పేరుగా వినిపిస్తుంది..పెద్దపల్లి జిల్లా లో బలమైన నేత గా పేరున్నప్రేమ్ సాగర్ రావు (వెలమ)? వెలమ వర్గానికి మంత్రి పదవి ఖరారుచేసే అవకాశం ఉంది.మహబూబాబాద్ జిల్లా నుండి ఎస్సీ కోటా లో ఓ ఛానల్ అధినేత గడ్డం వివేక్ (ఎస్సీ మాల) ? ఎస్సీ వర్గానికి మంత్రి గా ప్రాతినిధ్యం ఇవ్వాలనే డిమాండ్ తో అధిష్టానం పరిశీలనలో బలంగా ఉంది.

ఇప్పటికే కాబినెట్ లో ఉన్న పన్నెండు మంది మంత్రులలో రెడ్డి సామాజిక వర్గం నుండి ?నలుగురు,బీసీ వర్గం నుండి ఇద్దరు, ఎస్సీ వర్గం నుండి ఇద్దరు ఎస్టీ వర్గం నుండి ఒకరు,మిగతా ముగ్గురు ఇతర సామాజిక వర్గాల నుండి ఉన్నారు.కాంగ్రెస్ నుండి ముస్లిం ఎమ్మెల్యే లు ఒక్కరు కూడా గెలవకపోవడంతో ముస్లిం మైనారిటీలు ఎవరు మంత్రులుగా లేరు.మంత్రివర్గంలో మైనారిటీ వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడంతో కాంగ్రెస్ వ్యూహంలో ముస్లిం వర్గానికి ఒక మంత్రి పదవి ఖాయమని సమాచారం ఉంది.

ఇక తెలంగాణ మంత్రివర్గంలో బీసి మహిళా మంత్రుల సంఖ్య తక్కువగా ఉంది.కొండా సురేఖ తో పాటు ఎస్టీ కోటా లో సీతక్క మంత్రిగా ఉన్నారు. తాజాగా ఎమ్మెల్సీ గా ఎన్నికైన సినీ నటి విజయశాంతి కి బీసీ కోటా లో మరో మహిళా మంత్రిగా పదవి దక్కే అవకాశాలు ఉన్నాయి.

మొత్తంగా, తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కేవలం పదవుల పంపిణీ కాదని, రాబోయే ఎన్నికల వ్యూహానికి కీలకం అని స్పష్టమవుతోంది. రాబోయేరోజుల్లోఎవరెవరు మంత్రులు అవుతారు?ఏ సామాజిక వర్గాలకు ప్రాధాన్యం దక్కుతుంది?, కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉంది.

## మళ్లీ కవ్విస్తున్న చైనా

న్యూఢిల్లీ, మార్చి 25,

భారత్?చైనా సరిహద్దు వివాదం పరిష్కారానికి చర్చలు జరుగుతున్న వేళ, చైనామరోసారి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడింది. లద్దాఖ్ భూభాగంలోని కొంత ప్రాంతంలో రెండు కొత్త కౌంటీలుహెఆన్, హెకాంగ్ఏర్పాటు చేస్తున్నట్లు 2024 డిసెంబర్ 27న చైనా ప్రకటించింది. ఈ కౌంటీలు న్జియాంగ్‌లోని హోటన్ ప్రిఫెక్చర్‌లో ఉన్నప్పటికీ, వీటిలో కొంత భాగం భారత్ లద్దాఖ్‌లోని అక్సాయ్ చిన్‌లోకి చొచ్చుకొస్తుందని కేంద్రం ఆరోపిస్తోంది. దీనిపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, ఈ దురాక్రమణను ఎన్నటికీ సహించబోమని స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌పార్లమెంట్‌లో ఇలా వెల్లడించారు: "చైనా కౌంటీల ఏర్పాటు మా దృష్టికి వచ్చింది. ఈ కౌంటీల్లో కొన్ని భాగాలు లద్దాఖ్ పరిధిలోని భారత భూభాగంలోకి వస్తాయి. ఈ అక్రమ ఆక్రమణను మేం ఎప్పుడూ అంగీకరించలేదు. భారత సార్వభౌమత్వంపై మా స్థిరమైన వైఖరిని ఈ చర్యలు మార్చలేవు, చైనా బలవంతపు ఆక్రమణకు చట్టబద్ధతనూ ఇవ్వలేవు." ఈ విషయంలో భారత్ దౌత్య మార్గాల ద్వారా నిరసన తెలిపినట్లు ఆయన తెలిపారు. చైనా ఈ కౌంటీలతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో అభివృద్ధి ప్రాజెక్టులను కూడా చేపడుతోందని, దీనిపై తమకు సమాచారం ఉందని విదేశాంగ శాఖ వెల్లడించింది. అక్సాయ్ చిన్‌ను 1962 నుంచి చైనా నియంత్రిస్తున్నప్పటికీ, భారత్ దానిని తన భూభాగంగా భావిస్తుంది. ఈ కొత్త చర్యలు సరిహద్దు ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది.చైనా చర్యలకు ప్రతిస్పందనగా, భారత్ సరిహద్దు మౌలిక సదుపాయాలపై దష్టి సారించింది. "గత దశాబ్దంలో సరిహద్దు అవసరాల కోసం బడ్జెట్‌ను పెంచాం. సరిహద్దు రహదారుల సంస్థకు మూడు రెట్లు అధిక నిధులు, సొరంగాలు, వంతెనల నిర్మాణం చేపట్టాం," అని కీర్తివర్ధన్ సింగ్ వివరించారు. 2020 గల్వాన్ ఘర్షణల తర్వాత ఉద్విగ్నంగా ఉన్న సంబంధాల నేపథ్యంలో, చైనా ఈ చర్యలు సరిహద్దు వివాదాన్ని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి.

# తమిళనాడులోకి జనసేన

చెన్నై, మార్చి 25, పవన్ కళ్యాణ్ కొద్ది రోజులుగా తమిళనాడులో సైతం హల్చల్ చేస్తున్నారు. పవన్ సనాతన ధర్మ పరిరక్షణకు బలమైన వ్యవస్థ కావాలని పోరాట బాట పట్టినప్పుడు తమిళనాడు నుంచి ఎక్కువగా విమర్శలు వచ్చాయి. తమిళ నేతలంతా పవన్ పై వ్యక్తిగత కామెంట్లకు సైతం దిగారు. నటుడు ప్రకాష్ రాజ్ అయితే బిజెపి అజెండా అంటూ అనుమానాలు కూడా వ్యక్తం చేశారు. మొన్నటికి మొన్న హిందీ భాష పై జరిగిన వివాదంలో కూడా పవన్ తమిళ నేతల తీరును తప్పు పట్టారు. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో ఏ రాష్ట్ర నేతలతో లేని విధంగా తమిళ నేతలతో పవన్ ఆగ్రహంగా వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిచ్చింది. అయితే పవన్ తమిళనాడులో జనసేన విస్తరించాలన్న ఆలోచనతో ఇదంతా చేసినట్లు ప్రచారం ప్రారంభమైంది. అందుకు తగ్గట్టుగానే పవన్ సైతం ఈ విషయంలో క్లారిటీ ఇచ్చారు.వరుసగా తమిళ నేతలతో జరుగుతున్న వివాదాల నేపథ్యంలో.. ఓ తమిళ టీవీ పవన్ కళ్యాణ్ ను ఇంటర్వ్యూ చేసింది. ఈ క్రమంలో తన జనసేన తమిళనాడులో విస్తరిస్తానని తేల్చి చెప్పారు పవన్ కళ్యాణ్. ఇటీవల పిఠాపురం జనసేన ఆవిర్భావ సభలో పవన్ హిందీ విషయంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే హిందీ భాషను తమపై బలవంతంగా రుద్దుతున్నారని తమిళనాడులో ఆగ్రహవేశాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తరుణంలో పవన్ చేసిన వ్యాఖ్యలు మిస్ ఫైర్ అయ్యాయి. ఈ క్రమంలో ఆయన వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. హిందీ నిర్బంధంగా నేర్పించాలనే విధానానికి తాను కూడా వ్యతిరేకమని స్పష్టం చేశారు. తాను స్వచ్ఛందంగానే తమిళంతో పాటు హిందీని నేర్చుకున్నట్లు తెలిపారు.పవన్ హిందీ విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిటిష్ వారు తీసుకొచ్చిన ఇంగ్లీష్ భాష నేర్చుకోవడానికి లేని భయం.. దేశంలోని హిందీ భాష నేర్చుకునేందుకు ఎందుకని పవన్ ప్రశ్నించారు. నేతలు హిందీలో ప్రసంగాలు చేస్తుంటారు. కానీ హిందీని మాత్రం విమర్శిస్తుంటారని తప్పు పట్టారు పవన్. మరోవైపు తమిళనాడులో బిజెపి తప్పకుండా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు పవన్. రాజకీయాల్లో ఏదైనా జరగవచ్చునని చెప్పారు. భవిష్యత్తులో తన జనసేన సైతం తమిళనాడులో విస్తరించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారుఇటీవల జరుగుతున్న పరిణామాలతో తమిళనాడులో జనసేననుఅభిమానించేవారు పెరుగుతున్నారు. తమిళనాడు రాజకీయాల్లో భిన్న పరిస్థితుల నేపథ్యంలో పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని సైతం జై కొట్టిన వారు ఉన్నారు. అందుకే పవన్ తాజాగా ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీకి తమిళనాడులో కూడా విపరీతమైన అభిమానులు ఉన్నారు. పవన్ కళ్యాణ్ ప్రసంగాలను తమిళనాడు వాసులు ఎక్కువగా వాచ్ చేస్తుంటారు. డబ్బులు అవసరం ఉన్నన్ని రోజులు నటిస్తానని కూడా చెప్పుకున్నారు పవన్ కళ్యాణ్. రాజకీయాలతో పాటు సమానంగా సినీ కెరీర్ కొనసాగుతుందని.. అదే సమయంలో వివిధ రాష్ట్రాల్లో జనసేన విస్తరించనునట్లు కూడా చెప్పారు పవన్.

# చేనేతలకు 365 రోజుల పనే లక్ష్యం

## ఎగ్జిబిషన్ల నిర్వహణతో రోజూ మాకు పని దొరుకుతోందని వెల్లడి

విజయవాడ :

నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించడంతో పాటు చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం మరిన్ని ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. నగరంలోని ఓ కల్యాణమండపంలో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. చేనేత వస్త్రాల అమ్మకాల కోసం రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లోనూ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రాబోయే ఉగాది సంబరాల నేపథ్యంలో విజయవాడలో చేనేత ఎగ్జిబిషన్ ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ లో రాష్ట్రానికి చెందిన పొందూరు, ఉప్పాడ, అంగర, పులగర్త, బందరు, మంగళగిరిచీరలు మరియు డ్రెస్ మెటీరియల్స్ చీరాల చీరలు మరియు డ్రెస్ మెటీరియల్స్ వెంకటగిరి,ధర్మవరం మదనపల్లి ఎమ్మిగనూరు, గద్వాల్, కంచిపురం, పోచంపల్లి శారీల స్టాళ్లతో పాటు తెలంగాణ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, జమ్మూ కశ్మీర్, బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ కు చెందిన నేతన్నలు 89 స్టాళ్లు ఏర్పాటు చేశారన్నారు. ఎగ్జిబిషన్ లో పాల్గొన్న నేతన్నలందరికీ ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

నేతన్నలకు ఇచ్చిన హామీల అమలు

నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించాలన్న లక్ష్యంతో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేనేతలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చిన విధంగా మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. నూలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. ఆధునిక పని ముట్లను 90 శాతం సబ్సిడీ చేనేతలకు సరఫరా చేస్తున్నామన్నారు. ముడి సరకులు కూడా సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. త్రిఫ్ట్ పథకంలో ప్రభుత్వం వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచామన్నారు. గత ఏడాది 10 క్లస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. జగన్ ప్రభుత్వం తొమ్మిది పర్యాయాలు విద్యుత్ ఛార్జీలు పెంచి, చేనేతలపై అధిక భారం మోపిందని మండిపడ్డారు.

త్వరలో మరిన్ని ఎగ్జిబిషనన్లు

చేనేత వస్త్రాలకు మరింత మార్కెట్ సదుపాయం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా రానున్న రోజుల్లో మరిన్ని ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయనున్నామని మంత్రి సవిత తెలిపారు. రాబోయే తెలుగు సంవత్సర పండగను దృష్ట్యా ప్రజలందరూ సంప్రదాయానికి ప్రాధాన్యమిస్తూ చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

రోజూ మాకు పని దొరుకుతోంది :

నేతన్నల హర్షం

అంతకుముందు మంత్రి సవిత ఎగ్జిబిషన్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగారు. అనంతరం చేనేత వస్త్రాలు, హ్యాండీ క్రాఫ్ట్ స్టాళ్లను సందర్శించారు. ఏ రాష్ట్రం నుంచి వచ్చారు...ఏయే వస్త్రాలు అమ్మకాలకు పెట్టారు..? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులు... మంత్రి సవితతో మాట్లాడుతూ, తరుచూ ఎగ్జిబిషన్లు నిర్వహించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం వల్ల చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగాయని, రోజూ పని దొరుకుతోందని, దీంతో తమకు ఆదాయం పెరిగిందని స్టాళ్ల నిర్వాహకులు ఆనందం వెలిబుచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తమకు మంచి రోజులు ప్రారంభమయ్యాయని నేతన్నలు ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, అబద్దయ్య, పలువురు డైరెక్టర్లు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, జాయింట్ డైరెక్టర్ కన్నబాబు, ఆప్కో జీఎం రాజారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పోలీసుల గాలింపు

సికింద్రాబాదిసికింద్రాబాద్ ఎం ఎం టి ఎస్ లో యువతి పై జరిగిన లైంగిక దాడి కేసు లో సైబరాబాద్,ఎస్ ఓ టీ,సి సి ఎస్, జి ఆర్ పి పోలీసులు సంయుక్తంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు. మొత్తం 13 బృందాలతో నిందితుడి కోసం గాలిస్తున్నారు. రైల్వే పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా, సంఘటన జరిగిన చోట,పలు రైల్వే స్టేషన్ల లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. ??సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో సి సి కెమెరాలు లేకపోవడంతో నిందితుడిని గుర్తించడంలో జాప్యం జరుగుతోంది. అల్వాల్ రైల్వే స్టేషన్ వద్ద మహిళా కోచ్ లోకి నిందితుడు వచ్చినట్లు గుర్తించారు.

## లోన్ బకాయిలపై బెదిరింపులు ఎనిమిదిమంది అరెస్టు

ఏలూరు జిల్లా బజాజ్ ఫైనాన్స్ నుండి సొమ్ములు అప్పుగా తీసుకొని తిరిగి కట్టవలసిన వారికి తాము పోలీసులమని లాయర్లమని చేలమని ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతున్న ఎనిమిది మంది ముఠా సభ్యులను ఏలూరు మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలుగు డిఎస్పి

# కనీసం అవశేషాలు దొరుకుతాయా...

మహబూబ్ నగర్, మార్చి 25,

శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ లో జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతదేహాల ఆచూకీ తెలియలేదు. దీంతో టన్నెల్ లోతప్పిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ప్రమాదం జరిగి నెల రోజులు దాటుతున్నప్పటికీ ఇప్పటికీ మృతదేహాల ఆచూకీ మాత్రం లభించకపోవడం పై వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నాళ్లు ఇలా పడిగాపులు కాయాలంటూ వారు ప్రశ్నిస్తున్నారు. మరొక వైపు శ్రీశైలం టన్నెల్ లో సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయి. దాదాపు పన్నెండు బృందాలు నిరంతరం టన్నెల్ లో సహాయక చర్యలు చేపడుతున్నా ఎటువంటి ఫలితం కనిపించడం లేదు టన్నెల్ లో తాజా పరిస్థితిని ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష చేయనున్నారు. ఉన్నతాధికారులు ఇచ్చే ఫీడ్ బ్యాక్ తో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించనున్నారు. ఇప్పటి వరకూ టీబీఎం మిషన్ తొలగింపు, బురదను తవ్వకం పూర్తి కాకపోవడంతో మృతదేహాలు ఉంటాయని భావిస్తున్న ప్రాంతంలో తవ్వకాలు సాధ్యపడటం లేదు. రోబోలను పెట్టి తవ్వకాలు జరిపినా సాధ్యం కాకపోవడంతో ఇక కార్మికుల చేత తవ్వకాలు జరిపించాలని ఉన్నతాధికారులు భావించినా అది ప్రమాదకరంగా ఉండటంతో కొంత వెనుకంజ వేస్తున్నారు. బంధువులకు అప్పగించాలని... ఏడుగురు మృతదేహాలు ఇక లభ్యమయ్యే అవకాశాలు లేవు. కనీసం అవశేషాలు అయినా బంధువులకు అప్పగించాలన్న ఉద్దేశ్యంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు ఉన్నతాధికారుల తెలిపారు. మృతదేహాలను గుర్తించేందుకు ఫోరెన్సిక్ బృందాల సహకారం తీసుకుంటామని, అవశేషాలు లభ్యమయ్యేంత వరకూ సహాయక చర్యలు కొనసాగించడం తప్పని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఫిబ్రవరి 22న ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. టన్నెల్ లో పని చేసేందుకు మొత్తం 40 మంది కార్మికులు లోపలికి వెళ్లగా.. అకస్మాత్తుగా పైకప్పు కూలిపోయింది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన కార్మికులు బయటకు పరుగులు తీశారు. వీరిలో 32 మంది ప్రాణాలతో బయటపడగా... 8 మంది సిబ్బంది లోపలే చిక్కుకుపోయారు. దీంతో రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ర్యాట్‌హోల్ మైనర్స్, సింగరేణి, హైడ్రా సహా.. దేశంలోని అత్యుత్తమ కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి.దాదాపు 15 రోజుల తర్వాత ఒకరి మృతదేహం దొరికింది. కేరళ కేడావర్ డాగ్స్ స్క్వాడ్ సహాయంతో అనుమానిత ప్రాంతాలను గుర్తించి తవ్వకాలు జరపగా.. టీబీఎం (టన్నెల్ బోర్ మెషిన్) ఆపరేటర్ గురుప్రీత్ సింగ్ మృతదేహం మాత్రమే దొరికింది. మిగిలిన ఏడుగురి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్న ఫలితం లేదు. ఈ సొరంగం ప్రమాదం దేశంలోనే చాలా అరుదైనదని నిపుణులు అంటున్నారు. సొరంగం మొత్తం పొడవు 14 కి.మీ కాగా.. 13.85 కిలోమీటర్ల దగ్గర పైకప్పు కూలిపోయింది. మట్టి, రాళ్లు, బురద, సిమెంట్ దిమ్మెలు, నీరు, టీబీఎం శిథిలాలు 11వ కిలోమీటరు నుంచి 13.85 కిలోమీటర్ల వరకు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. నిమిషానికి 5 వేల లీటర్ల నీరు ఊరుతుండటంతో అందులోని మట్టి గట్టిగా మారింది. మట్టి గట్టిగా ఉండటం, పైకప్పు బలహీనంగా ఉండటంతో సహాయక చర్యలు జాగ్రత్తగా కొనసాగిస్తున్నారు. దేశంలోని ఉత్తమ కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీల బృందాలు దాదాపు 1000 మందితో మూడు షిఫ్టుల్లో 24 గంటలూ పని చేస్తున్నాయి. అయినా సహాయక చర్యల్లో ఏమాత్రం పురోగతి కనిపించడం లేదు. దేశంలోనే అరుదైన సొరంగ ప్రమాదంగా నిపుణులు చెబుతున్నారు. మట్టి, రాళ్లు, బురద, సీసీ సెగ్మెంట్స్, నీరు, టీబీఎం శిథిలాలన్నీ సొరంగంలో 11వ కి.మీ. నుంచి 13.85 కి.మీ. వరకు పేరుకుపోయాయని.. వీటి ద్వారా సహాయక చర్యలకు ఆటకం కలుగుతోందని అంటున్నారు. కాగా, అందులో చిక్కుపోయిన ఏడుగురు ప్రాణాలతో ఉండే ఛాన్స్ లేదని.. వారి మృతదేహాలను కడసారి చూపు కోసం బంధువులకు అప్పగించాలి కాబట్టి సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని రెస్క్యూ సిబ్బంది చెబుతున్నారు. టీబీఎం యంత్రాన్ని కట్ చేసి.. తవ్వకాలు జరుపుతున్నామని త్వరలోనే మిగిలిన ఏడుగురి ఆచూకీ కనుగొంటామని అంటున్నారు.

## బీరు సీసాతో కానిస్టేబుల్ పై దాడి

హైదరాబాద్

హైదరాబాద్ బంజారాహిల్స్లో బైక్ రేసర్ బీర్ బాటిల్తో కానిస్టేబుల్పై దాడి చేసిన ఘటన కలకలం రేపింది. టోలిచౌకి నుండి వేగంగా వస్తున్న ఖాజా అనే బైక్ రేసర్ ఓ కారును ఢీకొట్టాడు. ఈ ఘటన బంజారాహిల్స్ ఒమేగా హాస్పిటల్స్ రోడ్డులో చోటుచేసుకుంది. ప్రమాదం అనంతరం కార్ డ్రైవర్, ఖాజా మధ్య వాగ్వాదం తలెత్తింది. అప్పుడే కానిస్టేబుల్ శ్రీకాంత్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో విధుల కోసం వెళ్తున్నాడు. ఈ ఘర్షణను గమనించిన కానిస్టేబుల్ శ్రీకాంత్ వారిని శాంతింపజేయడానికి ప్రయత్నించాడు. అయితే, ఈ క్రమంలో ఖాజా పక్కనే ఉన్న బీర్ బాటిల్తో కానిస్టేబుల్ శ్రీకాంత్పై దాడి చేశాడు. కానిస్టేబుల్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం శ్రీకాంత్ను ఆసుపత్రికి తరలించగా, వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఖాజాపై కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయ్యారు. హైదరాబాద్లో రోడ్డు రేసింగ్, వేగంగా వాహనాలు నడపడం, హింసాత్మక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## బీఆర్ఎస్ నేతలపై పిర్యాదు

నకిరేకల్

నల్లగొండ జిల్లా నకిరేకల్లో జరిగిన పదవ తరగతి పేపర్ మాస్ కాపీయింగ్ ఘటనకు ఎలాంటి సంబంధం లేకున్నా తమపై బిఆర్ఎస్ నాయకులు, యూట్యూబ్, వెబ్ పత్రికలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత ఉగ్గిడి శ్రీనివాస్ వారు డిమాండ్ చేశారు. నిజనిర్ధారణ తెలుసుకోకుండా తమపై ఎమ్మెల్యే వేముల వీరేశంపై దుష్ప్రచారం చేస్తూ రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని వారు తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా కేటీఆర్ ట్విట్టర్ లో పెట్టడం సరైంది కాదన్నారు. తమ పరువు ప్రతిష్టలకు భంగం కలిగించిన వారిపై కోర్టులో దావా వేస్తామని ఎందాకైనా వెళ్తామని వారు తెలిపారు

# గులాబీ కాదని చెయ్యి అందుకుంటే...

## కడియానికి కలిసి రాని కాలం

వరంగల్, మార్చి 25

రామేశ్వరం వెళ్లినా.. శనీశ్వరం తప్పడం లేదనన్నట్లు తయారైందంట ఆ సీనియర్ ఎమ్మెల్యే పరిస్థితి. గులాబి పార్టీలో వర్గ పోరు తట్టుకోలేక హస్తం పార్టీలోకి మారితే.. ఇప్పుడు ఇక్కడా అదే వర్గపోరుతో తలపట్టుకోవాల్సి వస్తుందంట. ఉపముఖ్యమంత్రి సహా పలు పదవులు అనుభవించిన ఆ నాయకుడు ఇంటిపోరు తట్టుకోలేక సతమతమవుతున్నారంట. ఇప్పుడు తనపై అధిష్టానానికి ఫిర్యాదు చేయడానికి ప్రత్యర్థులు సిద్ధమవుతుండటంతో టెన్షన్ పడిపోతున్నారంట.ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ రాజకీయాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రులుగా పనిచేసిన ఇద్దరు నేతలు అక్కడివారే. తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి ఇద్దరూ నిన్నటి వరకు గులాబీ పార్టీలో ఉన్నవారే. రాజయ్యకు ఉపముఖ్యమంత్రి పదవి తీసేసి కడియం శ్రీహరికి కట్టబెట్టినప్పటి నుంచి ఇద్దరి మధ్య ఉన్న పోరు తారాస్థాయికి చేరుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాజయ్యను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇవ్వడంతో రాజయ్య వర్గం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది.

రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, గులాబీ పార్టీ అధిష్టానం తీరుతో విసుగెత్తిన కడియం శ్రీహరి గెలిచాక హస్తం పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నుండి తన కూతురు కడియం కావ్యకి వరంగల్ ఎంపీ టికెట్ తెచ్చుకొని ఆమె విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా కడియం శ్రీహరికి అసలు పంచాయతీ మళ్ళీ మొదలైందంట. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 800 కోట్ల రూపాయల నిధులతో పలు కీలక అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.సీఎం పర్యటన సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా కేడర్‌తో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసిన కడియం.. రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రస్తుతం నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న సింగపురం ఇందిరను పక్కన పెట్టారనే టాక్ వినిపిస్తోంది. పార్టీలో చేరిన తర్వాత అందరినీ కలుపుకోవాల్సిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తన వర్గానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారని.. ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలను నాయకులను పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో కడియం శ్రీహరికి గట్టి పోటీ ఇచ్చి ఓటమిపాలైన సింగపురం ఇందిరను కావాలనే కార్నర్ చేస్తున్నాడని ఇందిరా అనుచరులు చెబుతున్నారు. అందుకోసమే సీఎం సభ ఏర్పాట్ల విషయంలోనూ, సీఎంను నియోజకవర్గానికి ఆహ్వానించే విషయంలోనూ ఇందిరకు సమాచారం ఇవ్వలేదట. సాధారణ కార్యకర్తలరాలా ఇందిరను ట్రీట్ చేశారని అందుకే సీఎం సభకు సైతం ఇందిర దుమ్మా కొట్టారని ఆమె సన్నిహితులు గుసగుసలాడుకుంటున్నారుఆ క్రమంలో స్టేషన్ ఘన్పూర్ కాంగ్రెస్ లో వర్గ విభేదాలు పూర్తిగా తొలగిపోలేదనే టాక్ నడుస్తోంది. చాలా రోజులుగా ఇందిర వర్గం కాంగ్రెస్ లోకి వచ్చిన కడియం శ్రీహరి వర్గంతో కలవలేక పోతుందట. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇందిర తన కేడర్ ని కాపాడుకుంటూ వచ్చే ప్రయత్నం చేశారు. మారిన రాజకీయాల నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి పార్లమెంట్ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇక అప్పటినుంచి వీరి మధ్య వర్గ విభేదాలు మరింత పెరిగిపోయాయంటున్నారు.కడియం శ్రీహరి చేరిక సందర్భంగా ఇందిరకి కాంగ్రెస్ పెద్దల నుంచి పలు హామీలు లభించినట్టు చెప్తున్నారు. ఇందిర వర్గీయులకి నామినేటెడ్ పదవులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కమిటీలలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారంట. అయితే ఆ హామీలేవి ఇంతకాలం అమలు కాకపోతుండటంతో ఇందిర వర్గీయులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు స్టేషన్ ఘన్పూర్ లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఇందిరకు కనీసం సమాచారం కూడా లేకపోవడంతో ఆమె కూడా అసంతృప్తితో కనిపిస్తున్నారు.కడియం కాంగ్రెస్‌లో చేరే సమయంలో పార్టీలో ఇందిరకి సముచిత స్థానం కల్పించడానికి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని కాంగ్రెస్ నాయకత్వం హామీ ఇచ్చి.. పార్లమెంట్ ఎన్నికల్లో పని చేయించుకుందంట. ఇప్పటివరకు ఆమెకి ఎలాంటి పదవి రాకపోగా స్టేషన్ ఘన్పూర్ లో తన వర్గం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతుందననే ఆవేదనలో ఆమె ఉన్నారట. సీఎం సభ సందర్భంగా కూడా కడియం శ్రీహరి ఆమెను నిర్లక్ష్యం చేయడం వల్లే ఆవిడ ఆ సభకి దూరంగా ఉన్నారని ఇందిర వర్గం బహిరంగంగానే చెబుతుంది. ముఖ్యంగా సమాచారం మాత్రమే ఇచ్చి ఇందిరని కనీసం సభకు రాకుండా కడియం శ్రీహరి ఎత్తులు వేశారని ఇందిర వర్గం ఆగ్రహంతో ఉన్నారట.సభకి ఒకరోజు ముందు ఇందిర తన ముఖ్య అనుచరులతో మంతనాలు జరిపి కడియం శ్రీహరి పిలవకపోయినా స్టేషన్ ఘన్పూర్‌లో సీఎం పాల్గొనే సభకి హాజరైతే ఎలా ఉంటుందని సమాలోచనలు జరిపారంట. అయితే కడియం శ్రీహరి వ్యవహార శైలి అధిష్టానానికి తెలిసేందుకైనా ఈ సభకు వెళ్లకూడదని దుమ్మా కొట్టారని ఇందిర వర్గంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.కడియం శ్రీహరి తీరుతో తీవ్ర అసంతృప్తిగా ఉన్న సింగపురం ఇందిర, ఏఐసీసీ పెద్దల వద్ద తన గోడు వెళ్లబోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లోను ఏఐసీసీ పెద్దల అండతోనే సింగపురం ఇందిరా టికెట్ తెచ్చుకున్నారని.. ఆ స్థాయిలో ప్రభావం చూపగల సత్తా ఇందిరకు ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ క్రమంలో ఇన్ని రోజులు కడియం శ్రీహరి తీరును లైట్ గా తీసుకున్న ఇందిరా అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారట. 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడితే, తనను పక్కన పెడుతున్నారన్న ఆవేదనతో.. ఏఐసిసి పెద్దల వద్దే తన విషయం తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారని ఇందిర అనుచరులు చెప్పుకుంటున్నారు. దాంతో ఇందిర ఏం చేయబోతుందోనని, కడియం వర్గీయులు ఆందోళన చెందుతున్నారు. కడియం శ్రీహరి సైతం ఏం జరుగుతుందో అని అయోమయంలో పడ్డారట.



# ఇంటి తలుపులు తీసుకుపోయిన మునిసిపల్ సిబ్బంది

భూపాలపల్లిమున్సిపాలిటీ సిబ్బంది అక్రమంగా తీసుకొని పోయిన తమ ఇంటి తలుపులను తమకు ఇవ్వకుంటే కలెక్టర్ కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11 వ వార్డు పెద్ద కుంటపల్లి కాలనీ కు చెందిన వాంకుడోత్ హునా నాయక్ అన్నారు. పెద్ద కుంటపల్లిలో తాము గత 30 ఏళ్ల క్రితం ములుగు జిల్లాలోని రామచంద్రపురం నుండి బ్రతుకుతెరువు కోసం పెద్ద కుంటపల్లికి వచ్చి, మేకల కాపరిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానన్నారు. 30 ఏళ్ల నుండి ఇప్పటివరకు ఏ అధికారి వచ్చి కూడ తమను ఇంటి పన్ను అడగలేదన్నారు. మున్సిపాలిటీ అధికారులు వాంకుడోతు హునా నాయక్ పేరు మీద రూ. 20వేల ఇంటి పన్ను ఉన్నదని, ఇందులో రూ. 5,500 కడితే చాలని, మిగతావి మరో 6 నెలల తర్వాత కట్టవచ్చని చెప్పారన్నారు. వెంటనే నేను అప్పు తెచ్చి రూ. 5,500 కట్టానన్నారు. ఆ తర్వాత వచ్చి ఇంకా రూ. 15 వేల ఇంటి పన్ను ఉన్నదని, ఈ పన్ను కట్టకుంటే ఇంట్లో సామాన్లు జప్తు చేసుకుంటామని చెప్పి, ఇంటి పదిమంది తన ఇంట్లోకి వెళ్లి ఇంట్లో ఉన్న బియ్యం, ఇతర పాత్రలు కింద పారబోసి, తమ ఇంటి తలుపులు తీసుకొని వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఒక్క రోజు కూడా మున్సిపాలిటీ అధికారులు వచ్చి తాను మున్సిపాలిటీకి ఇంటి పన్ను బాకీ ఉన్నానని చెప్పలేదని, కనీసం ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వలేదన్నారు.

## న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను ఖండిస్తూ నిరసన

రంగారెడ్డి

న్యాయవాది యెర్రబావు ఇజ్రాయిల్ హత్యను ఖండిస్తూ రంగారెడ్డి జిల్లా ఇబ్రాహీంపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం కోర్టు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి సాగర్ రహదారిపై న్యాయవాదుల రక్షణచట్టం అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆంజన్ రెడ్డి మాట్లాడుతు ఇజ్రాయిల్ హత్యను తీవ్రంగా ఖండించారు.ఆపదలో వచ్చిన ఓ మహిళకు న్యాయవాదిగా అండగా నిలిచి పిర్యాదు ఇప్పించినందుకు ఇజ్రాయిల్ ను హత్య చేయడం దారుణం అన్నారు.ప్రభుత్వం న్యాయవాదులపై మనవీయ కోణంతో ఆలోచించి ఇప్పుడు జరిగే అసెంబ్లీ సమావేశాల్లో న్యాయ రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.నిందితుడి పక్షాన వాదించేందుకు న్యాయవాద వృత్తిలో వారు ఎవరు సహకరించవద్దంటు సూచించారు.

# కేటీఆర్ కాన్ఫిడెన్సా...

హైదరాబాద్, మార్చి 25,

నేను కేసీఆర్ అంత మంచోడ్ని కాదు, మేం అధికారంలోకి వస్తే ఎవర్నీ వదిలిపెట్టం.. ఇలాంటి డైలాగులతో కేటీఆర్ ఎవర్ని మెప్పించాలనుకుంటున్నారు..? ఇప్పటికే కొంతమంది నాయకులు చేజారారు, కేడర్ కూడా పార్టీకి దూరమవుతోంది. ఈ దశలో కాంగ్రెస్ పై, సీఎం రేవంత్ రెడ్డిపై పదే పదే తీవ్ర విమర్శలు చేస్తూ హైలెట్ కావాలనుకుంటున్నారు కేటీఆర్. బీఆర్ఎస్ రజతోత్సవ సభతో అయినా కేడర్ లో కాస్త ఉత్సాహం వస్తుందేమోనని ఆయన ఆశ. కానీ ఆ ఆశ నెరవేరేలా లేదు. తెలంగాణలో బీఆర్ఎస్ తిరిగి పుంజుకోగలదా..? ఆ పార్టీ నేతలు మాత్రం పైకి మేకపోతు గాంభీర్యం చూపిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పని అప్పుడే అయిపోయిందని రాబోయేది తమ ప్రభుత్వమేనని చెప్పుకుంటున్నారు. అందులోనూ అధికారానికి దూరంగా ఉండలేని కేటీఆర్ లాంటి నాయకులు అస్సలు కుదరట్లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోపే ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు ఎక్కుపెట్టారు కేటీఆర్. సీఎం విఫలమయ్యారని, ఆయనకు పార్టీలో ఎవరి సపోర్ట్ లేదని బురదజల్లాలనుకున్నారు. కాంగ్రెస్ లో రేవంత్ రెడ్డిని ఒంటరిని చేయాలనేది బీఆర్ఎస్ ఎత్తుగడ. అందుకోసం సోషల్ మీడియా ద్వారా పదే పదే తప్పుడు ప్రచారం చేసింది. చివరకు పెయిడ్ జర్నలిస్ట్ లతో చేసిన ఎత్తుగడలు కూడా విఫలమయ్యాయి. తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు కూడా. రెండేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ని ప్రజలు 2023 ఎన్నికల్లో నిర్మొహమాటంగా తిరస్కరించారు. అప్పటికీ ఆ పార్టీలో మార్పు రాలేదు. దీంతో ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కి పెద్ద షాకిచ్చారు. ఆ ఓటమిని కూడా మసిపూసి మారేడుకాయ చేయాలనుకున్నారు కేటీఆర్. జనంలోకి రాని కేసీఆర్, ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఇరుక్కున్న కవిత.. ఇలా బీఆర్ఎస్ ప్రతిష్ట ఎప్పుడో మంటగలిసి పోయింది. భవిష్యత్ నాయకుడిగా చెప్పుకుంటున్న కేటీఆర్ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అటు హరీష్ రావు నుంచి ఆపద ఉందని తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు కేటీఆర్. అందుకే ఆయన త్వరలో పాదయాత్ర చేపడతానని ప్రకటించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఇప్పుడు కేసీఆర్ గుర్తొస్తున్నారనేది కేటీఆర్ వ్యాఖ్యానం. కేసీఆర్ ని ఎందుకు ముఖ్యమంత్రి చేసుకోలేకపోయామా అని వారు బాధపడుతున్నారట. ఆ మాటకొస్తే రాష్ట్ర ప్రజలే ఇప్పుడు కేసీఆర్ కి గుర్తొస్తున్నారు. ప్రజలను ఎందుకు దూరం చేసుకున్నామా అని ఆయన బాధపడుతూ



ఉండొచ్చు. అధికారం పోయిందని కేటీఆర్ అంతకంటే ఎక్కువ బాధపడుతూ ఉండొచ్చు. అది బాధే కానీ, పశ్చాత్తాపం కాదని ఆయన పలుమార్లు తన మాటలతో రుజువు చేశారు కూడా. ఓటములనుంచి గుణపాఠాలు నేర్చుకుని ప్రజల్లోకి రావాలి కానీ, ప్రజలు కాంగ్రెస్ చేతిలో మోసపోయారంటూ తమని తాము కవర్ చేసుకోవాలని చూడటం కేటీఆర్ అవివేకం. అయినా ప్రజల ముందు గంభీరంగా ఉండాలి. ఓడిపోయినా తమ తప్పేమీ లేదని చెప్పుకోవాలి, కేడర్, లీడర్ చేజారకుండా చూసుకోవాలి. అందుకే కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుంటారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా గులాబీ జెండా రెపరెపలాడుతుందని సవాళ్లు విసురుతున్నారు. త్వరలో జరగబోతున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం కరీంనగర్ లో నిర్వహించగా ఆ సమావేశంలో కేటీఆర్ మరోసారి సవాళ్లతో కేడర్ ని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఏప్రిల్ లో నిర్వహించే రజతోత్సవ సభతో తిరిగి పుంజుకుంటామని అంటున్నారాయన. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టింగ్ లు పెట్టిన వారిని పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని నానా యాగీ చేస్తున్నారు కేటీఆర్. బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగిందో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని అంటున్నారు కాంగ్రెస్ నేతలు. అసలింతకీ బీఆర్ఎస్ జాతీయ పార్టీనా, రాష్ట్ర పార్టీనా అనే కొంతర్లు కూడా పడుతున్నాయి. జాతీయ రాజకీయాల్లో వెలిగిపోవాలనే ఆశతో పార్టీ పేరు కూడా మార్చేసి, పక్క రాష్ట్రాల్లో ఆఫీసులు కూడా తెరిచేసి అమధ్య హడావిడి చేశారు. తీరా సొంత రాష్ట్రంలో ఘోర పరాభవంతో ఆ మాటే ఎత్తకుండా సైలెంట్ అయ్యారు. పార్టీ పేరు తిరిగి టీఆర్ఎస్ గా మార్చేస్తారనే వార్తలు వినిపించినా ఇక్కడ కూడా కేసీఆర్, కేటీఆర్ కి ఇగో అడ్డు వచ్చింది. పార్టీ పేరు తిరిగి మార్చేస్తే కాంగ్రెస్, బీజేపీనుంచి పడే కౌంటర్లను తట్టుకోలేమని సైలెంట్ అయ్యారు. ఎప్పటికైనా పార్టీ పేరు జాతీయ స్థాయిలో మార్మోగి పోతుందని లేనిపోని బీరాలు పలుకుతున్నారు కేసీఆర్, కేటీఆర్.

## తెలంగాణ ఎమ్మెల్యేలకు హనీట్రాప్...?

హైదరాబాద్, మార్చి 25,

తెలంగాణలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు టార్గెట్‌గా కొత్త రకం హనీట్రాప్ నడుస్తోంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫోన్ నెంబర్లను కనుక్కొని మరి వీడియో కాల్ చేసి బెదిరిస్తున్నారట. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నేహ శర్మ అనే పేరుతో వీడియో కాల్స్ వచ్చినట్లు తెలుస్తోంది. పలువురు ఎమ్మెల్యేలు పోలీసులకు ఫిర్యాదు చేయగా మరికొందరు మాత్రం ఎందుకు వచ్చిన తలనొప్పి అంటూ సైలెంట్‌గా ఉంటున్నారు. హాట్ టాపిక్‌గా మారడంతో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నేతల మధ్య ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. అసెంబ్లీ లాబీలో, ఎల్పీ ముందు పలువురు నేతలు ఈ విషయంపై చర్చించుకుంటున్నారు. తనకు కాల్ వచ్చిందని ఒక ఎమ్మెల్యే చెప్పగా, తనకూ కాల్ వచ్చిందని మరో ఎమ్మెల్యే తన అనుభవం చెప్పుకొని గోడు వెళ్ళబోసుకుంటున్నారు. నేహ శర్మ అనే పేరుతో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కాల్స్ వచ్చినా అనుమానంతో ఎత్తలేదని పలువురు ఎమ్మెల్యేలు తమ సహచర ఎమ్మెల్యేలతో చెప్పుకున్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు కూడా గతంలో ఇలాగే హనీ ట్రాప్ కాల్ వచ్చింది. కాల్ చేసి 20 సెకండ్లు మాట్లాడి ఆ సమయంలో తాను ఇబ్బందికరంగా ప్రవర్తించి ఆ వీడియోను సదరు ఎమ్మెల్యేకి పంపించి 50 వేల రూపాయలు పంపించాలని డిమాండ్ చేశారు. డబ్బులు పంపకపోతే పక్క పార్టీ గ్రూపుల్లో వీడియో వేస్తామని బ్లాక్ మెయిల్ చేశారు. దీంతో అలెర్ట్ అయిన ఎమ్మెల్యే వీరేశం జిల్లా ఎస్పీకి కాల్ చేసి విషయం చెప్పారట. పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తిని మధ్యప్రదేశ్ నుంచి తీసుకొచ్చి లోపలేశారట. ఈ ట్రాప్ కాల్స్ పార్టీలకతీతంగా పలువురు ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు వస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కాల్ చేసి వీడియో రికార్డు చేసి బీఆర్ఎస్ గ్రూపుల్లో వేస్తామని బెదిరించడం, బీఆర్ఎస్ పార్టీ నేతలకు కాల్ చేసి వీడియోలను రికార్డు చేసి కాంగ్రెస్ గ్రూపుల్లో వేస్తామని బెదిరించడం హాట్ టాపిక్‌గా మారింది. ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను టార్గెట్ చేస్తూ తరచూ కాల్స్ వస్తుండటంతో నేతలు జాగ్రత్త పడుతున్నారు. ప్రజా ప్రతినిధిగా ఎవరో ఆపదలో ఉండి కాల్ చేస్తున్నారని ఎత్తితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హనీ ట్రాప్ వ్యవహారం ఎమ్మెల్యేల్లో కొత్త టెన్షన్ మొదలైంది. చేయని తప్పుకకు బలి కావాల్సి వస్తుందేమోనని.. పోనీ తమ తప్పేం లేదని చెప్పినా ఇలాంటి విషయాల్లో నమ్మే పరిస్థితి ఉండదని భావిస్తున్నారట. లేడీ నుంచి కాల్ వస్తే చాలు భయపడిపోతున్నారట. ఎటుపోయి తమ మెడకు చుట్టుకుంటుందోనని.. ఒకవేళ అలా బెదిరించి వీడియోను సర్క్యులేట్ చేస్తే ప్రజల్లో చులకన అయిపోతామని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారట. ఇక ఈ ట్రాప్ వ్యవహారానికి పోలీసులు ఎలా ఫుల్ స్టాప్ పెడుతారనేది చూడాలి మరి.

==============లిలిలిలిలి

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం.

రంగారెడ్డి

హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత పై ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో గిరిజన సంఘాల ప్రతినిధులు సుధీర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలి అశోక్ రాథోడ్,

సుధీర్ రెడ్డి రాజకీయంగా పనికిరాడు అని అసలు ఎమ్మెల్యే పదవికి అనర్హుడు అని గిరిజన ఆదివాసి నాయకుడు అశోక్ రాథోడ్ అన్నారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆమెపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసనగా బస్ సదన్ డివిజన్ చంపాపేట్ ప్రధాన రోడ్ పై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దిష్టిబొమ్మ దానం చేశారు, అనంతరం గిరిజన నాయకులు మాట్లాడుతూ ఒక బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఉండి మహిళలను అగౌరపరిచే విధంగా మాట్లాడడం సుధీర్ రెడ్డికి సరికాదని ఆయన అన్నారు. సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి అనర్హుడ అని అన్నారు. తను చేసిన వ్యాఖ్యలకు నైతికంగా బాధ్యత వహించి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చట్టపరంగా అతనిపై చర్యలు తప్పవని కఠినమైన శిక్ష పడే వరకు మేము పోరాడుతూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కాకాణిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు

నెల్లూరు పొదలకూరు మండలం తాటిపర్తిలోని రుస్తుం మైన్స్ లో రూ. కోట్లలో విలువైన క్వార్ట్ దోపిడీ చేశారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ4గా కాకాణి వుండగా .. 120ఎ, 447, 427, 379, 220, 506, 129తో పాటు ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టెన్స్ యాక్ట్ కింద కేసు నమోదు అయ్యింది. పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి ఏ1గా, వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డిలు ఏ2, ఏ3లుగా ఉన్నారు.

## చెత్త తీసేందుకు ప్రత్యేక దళాలు

మేడ్చల్:కుషాయిగూడ పారిశ్రామికవాడలో మూడు రోజుల క్రితం రసాయన పదార్థాలు పేలిన చెత్త కుప్పను తొలగించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. చెత్తను తీసే క్రమంలో. రసాయన పదార్థాలు పేలే అవకాశం ఉన్నందున జాగ్రత్త చర్యలు పాటిస్తూ చెత్తను తీసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రస్తుతం బృందాలన్నీ సంఘటన స్థలంలోనే ఉన్నాయి. పోలీసు, ఫైర్, బాంబ్స్ స్క్వాడ్, క్లూస్ టీమ్, ఇండస్ట్రియల్ సేఫ్టీ టీం, టీఎస్ఐఐసి అధికారులు రంగంలో దిగాయి. సంఘటన స్థలాన్ని ఎసిపి టి. మహేష్, కుషాయిగూడ సిఐ భాస్కర్ రెడ్డి సందర్శించారు.

## కొత్త బీజేపీ అధ్యక్షుడు ఎవరు

హైదరాబాద్, మార్చి 25, (న్యూస్ పల్స్)

కేంద్ర మంత్రి, ప్రస్తుత తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. షెడ్యూలు ప్రకారం.. సికింద్రాబాద్‌లో జరిగే ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొనాల్సి ఉంది. దాన్ని రద్దు చేసుకొని మరీ ఢిల్లీకి వెళ్లారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడి నియామకం కోసం కసరత్తు జరుగుతున్న ఈ సమయంలో కిషన్ రెడ్డి ఉన్నపళంగా ఢిల్లీకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం తెలంగాణలో బీజేపీ దూకుడు మీద ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంతో.. కేడర్ కూడా జోష్‌లో ఉంది. అయితే.. కిషన్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ బీజేపీకి సారథ్యం వహిస్తున్నారు. అదే సమయంలో కేంద్రంలో మంత్రిగా ఉన్నారు. దీంతో రెండు బాధ్యతలు నిర్వహించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిని నియమిస్తారని ప్రచారం జరిగింది. కానీ వివిధ కారణాలతో ప్రకటన వాయిదా పడుతూ వస్తోంది. కమలం పార్టీ పెద్దలు.. కొత్త అధ్యక్షుడి ఎంపిక విషయంలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రాంతాలు, సామాజిక సమీకరణాలు వంటి అంశాలను లెక్కలోకి తీసుకుందని సమాచారం. నేతలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్లే విధంగా ఉండే నాయకుడికి అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడి రేసులో చాలామంది నేతలు ఉన్నారు. ముఖ్యంగా డీకే అరుణ, ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరే కాకుండా.. రఘునందన్ రావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కూడా అధ్యక్ష పగ్గాల కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికల పరిశీలకురాలుగా ఉన్న శోభా కరంద్లాజే ఇప్పటికే నేతల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఆ నివేదికను బీజేపీ పెద్దలకు అందించినట్టు సమాచారం. ఈసారి బీసీ నేతకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీల గురించి పెద్ద చర్చే జరుగుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడా బీసీలను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కాంగ్రెస్ బీసీ నేతకు పీసీసీ పగ్గాలు అప్పగించింది. దీంతో బీజేపీ కూడా బీసీ కార్డుపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఉగాది లోపే కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించే అవకాశం ఉంది.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎలక్షన్స్ కూడా సమీపిస్తున్నాయి కాబట్టి.. వీలైనంత త్వరగా కొత్త సారథిని ప్రకటిస్తారని వివరించారు. అటు కిషన్ రెడ్డి సెడెన్‌గా ఢిల్లీ వెళ్లటంతో ఇక ప్రకటన దాదాపు ఖాయమైందని తెలుస్తోంది. అయితే.. పార్లమెంట్ సమావేశాల కోసమే కిషన్ రెడ్డి ఢిల్లీ వెళ్లారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

========================

## 80 కోట్లకు చేరిన కోకాపేట విలువ

హైదరాబాద్, మార్చి 25,

హైదరాబాద్ నేలకు విలువ.. కుంచములతో బంగారం కొలవ' అంటారు తెలంగాణ పెద్దలు. ఇది అక్షరాల నిజం అవుతోంది. భాగ్యనగరంలోని కొన్ని ప్రాంతాల్లో భూముల విలువ బంగారం కంటే ఎక్కువగా ఉంది. ముఖ్యంగా వెస్ట్రన్ హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. హైదరాబాద్ అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు, పెట్టుబడులు, కంపెనీల స్థాపనల కారణంగా భాగ్యనగరం ప్రపంచపటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఇక్కడి పాలకులు కూడా మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాయి. ఫలితంగా మన భాగ్యనగరం భూములు బంగారం అయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్ అంతర్జాతీయ నగరాలతో పోటీపడుతోంది. ఈ క్రమంలో శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న కోకాపేట, గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్ రాంగూడ, నార్సింగి ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అక్కడ పరిస్థితులు చూస్తే.. మనం హైదరాబాద్‌లోనే ఉన్నామా.. లేక దేశం దాటి వచ్చామా అనే అనుభూతి కలుగుతుందివెస్ట్రన్ హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాలు ఉపాధికి కేంద్ర బిందువుగా మారాయి. ఆకాశాన్ని తాకే భవనాలు, ప్రముఖ కంపెనీలతో ఈ ప్రాంతాల రూపురేఖలే మారిపోయాయి. వ్యాపారులు, విదేశీ కంపెనీలు కూడా హైదరాబాద్ శివారు ప్రాంతాల వైపే మొగ్గుచూపుతున్నాయి. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శివారు ప్రాంతాల్లో ఊహించని రీతిలో భూముల ధరలు పెరిగాయికోకాపేటలో భూముల ధరలు పెరగడానికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతం హైదరాబాద్ నగరంలో ఒక ప్రధానమైన వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ ఐటీ కంపెనీలు, మల్టీ నేషనల్ కంపెనీలు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు వేగంగా పెరుగుతున్నాయి. దీనితో పాటు కోకాపేటకు మంచి రోడ్డు మార్గాలు ఉండటం కూడా ఇక్కడి భూముల ధరలు పెరగడానికి ఒక ముఖ్య కారణంగా చెబుతారు. కోకాపేట ప్రాంతం హైదరాబాద్ ఐటీ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. ఇక్కడ అనేక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రభుత్వం కూడా కోకాపేట అభివృద్ధికి కృషి చేస్తోంది. దీనివల్ల మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయి. దీంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు, సంపన్నులు, కంపెనీల నిర్వాహకులు ఇక్కడ భూములు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఒక్క ఎకరం ధర రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఉందిఇక హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు.. భూముల ధరలపై ప్రభావం చూపుతోంది. రీజినల్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు బాగా పెరుగుతున్నాయి. ప్రధానంగా ఇంటర్చేంజ్‌ల దగ్గర భూములకు ఎక్కువ డిమాండ్ ఉంది. కమర్షియల్ ల్యాండ్, రెసిడెన్షియల్ ప్లాట్, విల్లా.. ఇలా విభజించి భూములను అమ్ముతున్నారు. గతంలో పోలిస్తే.. ఎకరానికి కోటి రూపాయల నుంచి రూ.2 కోట్ల వరకు ధరలు పెరిగాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు.

==============

## మెట్రో ఆర్ట్ ఫెస్ట్...

హైదరాబాద్, మార్చి 25,

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు అదిరిపోయే అవకాశాన్ని కల్పిస్తోంది యాజమాన్యం. ఐజీపీ గలేరియాతోకలిసి హైదరాబాద్ మెట్రో ఆర్ట్ ఫెస్ట్ 2025ని ఆవిష్కరించినట్లు ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ప్రకటించింది. ఎర్రమంజిల్‌లోని ప్రీమియా మాల్‌లో మార్చి 27వ తేదీ నుంచి 29 వరకు ఈ ఆర్ట్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మూడు రోజుల కార్యక్రమంలో భారత దేశం నలుమూలల నుంచి వచ్చిన 10 మంది ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు ఉండనున్నాయని తెలిపింది. సందర్శకులు రియల్‌టైమ్‌లో సృజనాత్మక ప్రక్రియలను వీక్షించేలా ఐజీపీ గలేరియా లైవ్ పెయింటింగ్ సెషన్లకు ఆతిథ్యమివ్వనుండటం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణ. అందులోనూ ఈ మూడు రోజుల ఆర్ట్ ఫెస్ట్‌కు ఎంట్రీ కూడా పూర్తి ఉచితమని స్పష్టం చేశారు."కళలకు సంబంధించి హైదరాబాద్‌కి ఘన చరిత్ర ఉంది. ప్రయాణికులు, సందర్శకులకు ప్రేరణనిచ్చేలా, కళలను రోజువారీ జీవితంలో భాగం చేసేందుకు హైదరాబాద్ మెట్రో ఈ ఆర్ట్ ఫెస్ట్‌ని నిర్వహిస్తోంది." అని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ శ్రీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు."హైదరాబాద్ మెట్రో రైల్ ఒక రవాణా మాధ్యమం మాత్రమే కాదు. ఇది నగర పురోగతి, ఆవిష్కరణలకు చిహ్నం. హైదరాబాద్ మెట్రో ఆర్ట్ ఫెస్ట్ లాంటి కార్యక్రమాల ద్వారా కళలను గ్యాలరీల నుంచి బయటికి, అందరికీ అందుబాటులోకి తేవడం, నగరంలో సృజనాత్మకతను పెంపొందింపచేయడమే మా లక్ష్యం." అని ఒఒఒఖీఊఒ ఎండీ ఒ సీఈవో శ్రీ కేవీబీ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓటి. శ్వేతా చంద్ర (హైదరాబాద్), ఓటీ. మనీష్ చావ్లా (అహ్మదాబాద్), ఓటీ. రాము దాస్ (శాంతినికేతన్), ఓటీ. బాసుకి దాస్‌గుప్తా (బెంగళూరు), ఓటి మోనికా ఘులే (బద్లాపూర్), ఓటీ. దినకర్ జాదవ్ (పుణె), ఓటీ. నర్సింలు కంది (హైదరాబాద్), ఓటి. బందనా కుమారి (భోపాల్), ఓటీ. వసంతు రామకృష్ణ (హైదరాబాద్), ఓటీ. భాస్వర రావు బొప్ప (హైదరాబాద్) తమ కళాత్మక నైపుణ్యాలను ప్రదర్శించనున్నారు. ఐజీపీ గలేరియా అనేది ఒక ప్రసిద్ధ ఆర్ట్ కన్సల్టింగ్ సంస్థ. ఇది ప్రముఖ కళాకారులు, వర్ధమాన కళాకారుల పెయింటింగ్స్, శిల్పాలు, గ్రాఫిక్స్, మృణ్మయ కళలకు సంబంధించి ఎగ్జిబిషన్లు, కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమం మరింత మంది ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో నగరం మధ్యలో, ఎర్రమంజిల్ మెట్రోస్టేషన్‌కు నేరుగా అనుసంధానమైన ప్రీమియా మాల్ ఎంచుకున్నారు.

కార్యక్రమ వివరాలు: హైదరాబాద్ మెట్రో ఆర్ట్ ఫెస్ట్ 2025

తేదీలు: 2025 మార్చి 27, 28 మరియు 29

వేదిక: లెవెల్ 2, ప్రీమియా మాల్, ఎర్రమంజిల్, హైదరాబాద్

సమయం: మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఎంట్రీ: ఉచితం

## బాలానగర్ లో హిట్ అండ్ రన్.

హైదరాబాద్

బాలానగర్ లో కారును మద్యం మత్తులో నడిపించి కీర్తి (19)అనే యువతిని ఢీ కొట్టిన ఘటన జరిగింది.



బాలా నగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఐడిపిఎల్ చౌరస్తా లో మద్యం మత్తులో (ఫార్చునర్) కారు ను డ్రైవ్ చేస్తూ యువతి ని ఢీ కొట్టాడు. ఆక్సిడెంట్ చేసి కారును ఆపకుండా అతివేగంతో వెళ్లిపోయాడు. సిగ్నల్ వద్ద గల ట్రాఫిక్ పోలీసులు అలెర్ట్ అయ్యారు. ఫతే నగర్ సిగ్నల్ లో కారును ఆపి డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో ఆక్సిడెంట్ చేసిన వ్యక్తి బల్కం పెట్ కు చెందిన గొగం అనిల్(35)గా గుర్తించారు. యువతి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాలా నగర్ పోలీసులు కేసు నమోదు చేసారు.

## కరీంనగర్ జిల్లాలో రాజీవ్ రహదారిపై ఆశా వర్కర్లు ధర్నా... ఫిక్స్ వేతనం 18వేలు చెల్లించాలని డిమాండ్

కరీంనగర్కరీంనగర్ జిల్లాలో ఆశ వర్కర్లు రోడ్డెక్కారు. ఫిక్స్ వేతనం 18 వేలు చెల్లించాలని ధర్నా రాస్తారోకో చేశారు. గత కొద్దిరోజులుగా నిరసన ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు తిమ్మాపూర్ మండల కేంద్రంలో రాజీవ్ రహదారిపై ధర్నా రాస్తారోకో చేశారు. గత నాలుగు రోజులుగా ధర్నా చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిక్స్ వేతనం 18 వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

# ఏపీపీఎస్సీ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి:డిఆర్వో యం. విశ్వేశ్వర నాయుడు

కడప, మార్చి 25(భారత శక్తి ) : జిల్లాలోని 05 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పై ఏపిపిఎస్సి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి యం. విశ్వేశ్వర నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు.కడప కలెక్టరేట్ లో డిఆర్వో గారి ఛాంబర్లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే పై నాలుగు వివిధ రకాల నోటిఫికేషన్ సంబందించిన పరీక్షల నిర్వహణపై డిఆర్వో యం. విశ్వేశ్వర నాయుడు ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు శ్రీ వై. శ్రీనివాసులు(సెక్షన్ ఆఫీసర్), మానిటర్ మరియు శ్రీ షేక్ కాసిం వల్లి, (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్)లతో కలిసి పరీక్షల విధులు కేటాయించిన 05 మంది లైజెన్ ఆఫీసర్లు, 05 మంది చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో పై నాలుగు వివిధ రకాల నోటిఫికేషన్ సంబందించిన పోస్టుల భర్తీ కోసం ఈ నెల 25 మరియు 27వ తేదిన ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మరియు మధ్యాహ్నం 02.30 గంటల నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్ల, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా



చూడాలని సూచించారు.పోలీసు శాఖ ప్రతి సెంటర్లో బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండల పరిధిలో 03, చాపాడు మండల పరిధిలో 01, మరియు ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో 01 పరీక్షా కేంద్రంతో కలిపి మొత్తం 05 కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వివరాలు జతచేయడంజరిగింది.ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ మరియు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఏపీపీఎస్సీ, లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు మరియు లైన్ అప్ డిపార్టుమెంట్లు(పోలీస్, మెడికల్, ఎ.పి.యస్.ఆర్.టి.సి ,ఎ.పి.యస్.పి.డి.సి.ఎల్) శాఖల సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి: డిఆర్వో విశ్వేశ్వర నాయుడు





వైయస్సార్ జిల్లా, మార్చి 25(భారత శక్తి ) : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, అర్జీలకు త్వరితగతిన పరిష్కారం అందించాలని డిఆర్వో విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సభ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు.

అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. తొలుత పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, జడ్పి సీఈవో ఓబులమ్మ పిజిఆర్ఎస్ దరకాస్తు లపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన విజ్ఞప్తులు ప్రకారం లింగాల మండలం బోనాల గ్రామానికి చెందిన మస్తాన్ అనే వ్యక్తి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని మాకు ఊర్లో భూ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించి మా భూమి లో నాకు భాగం ఇప్పించాలని విజ్ఞప్తి చేసుకున్నారు.

మైదుకూరు మండలానికి చెందిన షేక్ హుస్సేన్ బి అనే మహిళ భర్తను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్నానని నాకు ప్రభుత్వం మంజూరు చేసే వితంతు పింఛను మంజూరు చేయించాలని అర్జీని సమర్పించారు.సిద్ధవటం మండలం మాసుపల్లి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి అని రైతు ఆధార్ కార్డు నందు వయస్సు తప్పుగా దొర్లిందని నాకు పెన్షన్ అందడం లేదని నా వయస్సును నిర్ధారించి నాకు వృద్యాప పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్థించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, జడ్పి సీఈవో ఓబులమ్మ, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి,ఎస్డీసి వెంకటపతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టీబీ ని నిర్మూలించడానికి డబ్ల్యూహెచ్వో తో కలిసి కార్యక్రమాలు చేపడతాం: ఇండియన్ మెడికల్ అసిసియేషన్ అధ్యక్షులు ఎనమల్ల

కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా వచ్చే 2030 వరకు టీబీ నీ నిర్మూలించడానీ కి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాల్లో తాము భాగస్వాములం అవుతామని ఇండియన్ మెడికల్ అసిసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎనమల్ల నరేష్ స్పష్టం చేశారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనదేశంలో 2023 లో 25 లక్షల టీబీ కేసులు అంటే వాటిలో 25లక్షల మందికి డయాలసిస్ చేసి, ట్రీట్మెంట్ ఇచ్చి 89శాతం సక్సెస్ సాధించామని చెప్పారు.

అలాగే ప్రపంచ టీబీ కేసులో మనదేశం వాతవ్26శాతం ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. 2018లో ప్రతి లక్షా




మందిలో 237 టీబీ కేసులు అంటే 2023లో 195మందికి తగ్గిందన్నారు. ఈ. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు డాక్టర్లు సుమన్, విజయకుమార్, నవీన్ కుమార్ లు పాల్గొన్నారు.

# 10వ తరగతి వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, మార్చి 25(భారత శక్తి):జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల ఆక్స్ఫర్డ్, సింగరేణి ఉన్నత పాఠశాలలు, తీగల ప్రహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

త్రాగునీరు, విద్యుత్ సరఫరా, ఆర్.టి.సి. బస్సులు, ప్రశ్నా, జవాబు పత్రాల రవాణా, బందోబస్తు, పారిశుద్ధ్యం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ. ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో పరీక్షల నిర్వహణ కొరకు 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 3వ రోజు ఆంగ్ల పరీక్షకు 9 వేల 177 మంది హాజరు కావలసి ఉండగా 9 వేల 156 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని, గతంలో అనుత్తీర్ణులైన వారు 31 మంది హాజరు కావలసి ఉండగా 24 హాజరయ్యారని, మొత్తంగా 99.70 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని తెలిపారు.జిల్లా విద్యాధికారి 7 పరీక్షా కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 19 పరీక్షా కేంద్రాలను సందర్శించడం జరిగింది.

# భారీ యంత్రాల నడుమ జరుగుతున్న ఇసుక డంపింగ్ నిలిపివేయాలి.

## -సొసైటీ ర్యాంపుల ద్వారా గ్రామస్థులకు ఉపాధి కల్పించాలి

## -జిల్లా గ్రీవెన్స్ లో పిర్యాదు చేసిన మాజీ ఎంపీటీసీ రావులపల్లి రామమూర్తి






మణుగూరు, మార్చి 25 (భారతశక్తి): మండలంలోని ఇసుక ర్యాంపుల నిర్వాహకులు అక్రమ సంపాదన కోసం బరితెగింపులకు పాల్పడుతున్నారని మాజీ ఎంపీటీసీ రావులపల్లి రామమూర్తి ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ లో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ కు సొసైటీ ర్యాంపుల్లో జరిగే అక్రమాలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా రామమూర్తి మాట్లాడుతూ మండలంలోని ఆనంతారం, అన్నారం, దమ్మక్కపేట, చినరాయిగూడెం, ఇంకా మొదలయ్యే గిరిజన ఇసుక సొసైటీ ర్యాంపుల్లో ముందే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టిజిఎండిసి ప్రాజెక్టు అధికారి అండదండలతో కాంట్రాక్టర్లు గోదావరి నుండి రాత్రి పగలు తేడా లేకుండా భారీ యంత్రాలతో ఇసుకను ఒడ్డు పైకి డంపింగ్ చేస్తున్నారని ఆక్షేపించారు. సొసైటీ ర్యాంపుల ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని ర్యాంపులకు ప్రభుత్వం నియమనిబంధనలతో అనుమతులు మంజూరు చేశారన్నారు. కానీ గిరిజనులకు మోసపూరిత మాటలు చెప్పి ర్యాంపులను రైజింగ్ కాంట్రాక్టర్లు దక్కించుకొని కోట్లు గడించాలనే లక్ష్యంతో నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వం ఒక్కపక్క సొసైటీ ఇసుక ర్యాంపుల్లో అక్రమాలు జరగకుండా జిల్లా కలెక్టర్, ఎస్పీ నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, కొంతమంది అధికారులు కాంట్రాక్టర్లతో చేతులు కలిపి ప్రభుత్వ లక్ష్యాలను నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్లకు టిజిఎండిసి అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇసుక డంపింగ్ చేయకుండానే ఆన్ లైన్ అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. దీనితో కాంట్రాక్టర్లు భారీ యంత్రాలు గోదావరిలో పెట్టి రాత్రి పగలు అనే తేడా లేకుండా లారీల ద్వారా ఒడ్డుపై డంపింగ్ చేస్తూ.. మధ్య మధ్యలో లారీలను ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తూ అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇసుక అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రామమూర్తి కోరారు.

# పోక్సో చట్టం మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం





కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చి 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా శ్రీమతి జి. శ్రీదేవి, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మరియు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారి సూచనల మేరకు కడప పట్టణంలో గల గవర్నమెంట్ సోషల్ వెల్ఫేర్ కాలేజీ ఫర్ గర్ల్స్ హాస్టల్ చింతకొమ్మదిన్నె మరియు కడప నగరం మరియాపురంలో గల గవర్నమెంట్ సోషల్ వెల్ఫేర్ కాలేజీ ఫర్ గర్ల్స్ నెంబర్:2 నందు అవగాహన కార్యక్రమమును నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఈ సందర్భంగా మాట్లాడుతూ పోక్సో చట్టం అంటే లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, 2012, ఇది పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నుండి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించబడింది. ఈ చట్టం పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నుండి రక్షణ కల్పించేందుకు, మరియు బాధితులకు మద్దతు ఇచ్చే వ్యవస్థను, నేరస్థులను పట్టుకోవడానికి మెరుగైన పద్ధతులను నిర్దేశిస్తుంది, 2012లో ఈ చట్టం ఆమోదించబడింది, ఎందుకంటే పిల్లలపై లైంగిక నేరాల సమస్యను సమగ్రంగా పరిష్కరించడానికి ఇది అవసరం అని ప్రభుత్వం భావించింది. శిక్షలు:ఈ చట్టం ప్రకారం, లైంగిక నేరాలకు పాల్పడే వారికి కఠినమైన శిక్షలు, తీవ్రమైన లైంగిక వేధింపుల కేసుల్లో మరణశిక్ష, జరిమానాలు మరియు జైలుశిక్ష విధించవచ్చు. 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ రక్షణ కల్పిస్తుంది. విభిన్నమైన నేరాల రక్షణ:లైంగిక వేధింపులు, లైంగిక వేధింపులు మరియు అశ్లీలత వంటి నేరాల నుండి పిల్లలను రక్షించడానికి బలమైన చట్టపరమైన ఫ్రేమ్వర్క్ను అందించడానికి ఈ చట్టం రూపొందించబడింది. న్యాయ ప్రక్రియలో పిల్లల ప్రయోజనాలు:న్యాయ ప్రక్రియ యొక్క ప్రతి దశలో పిల్లల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ చట్టం రూపొందించబడింది. వయసు:18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలతో లైంగిక చర్యలన్నీ లైంగిక నేరంగా పరిగణించబడుతుందని చట్టం భావిస్తుంది. పోక్సో ఈ-బాక్స్:ఫిర్యాదులను నమోదు చేయడానికి జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ (%చీజూజ=%) యొక్క అధికారిక పోర్టల్ లో ''%ూూజూ వ-దీశీఇ%'' బటన్ ఉంది సద్వినియోగం చేసుకోగలరు, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైని న్యాయమూర్తులు అయిన పులివెందుల జూనియర్ సివిల్ జడ్జ్ ఎం చంద్రశేఖర్ రెడ్డి, ప్రొద్దుటూరు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె సురేంద్రనాథ్ రెడ్డి, రైల్వే కోడూరు జూనియర్ సివిల్ జడ్జి పి తేజ సాయి, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, వార్డెన్స్ మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు 40 గంటల శిక్షణ

కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చి 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ అమరావతి మరియు మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ ఆదేశానుసారంగా చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప శ్రీమతి



జి శ్రీదేవి మరియు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ న్యాయ సేవా సదన్ కడప నందు "మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు 40 గంటల శిక్షణ" అనే అంశంపై ప్రారంభ సెషన్ కార్యక్రమము న్యాయవాదులతో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ, ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి, ఇది ఖర్చు మరియు సమయాన్ని ఆదా చేస్తుంది, ప్రాథమిక నియమాలు, అభ్యాసం అభ్యాస సూత్రాలు, వయోజన అభ్యాసం, శిక్షణ మధ్యవర్తిత్వ శిక్షణ, నిర్వహణ మరియు పరిష్కారం, పాత్ర పోషించడం, సెక్షన్ 89 కి ప్రత్యేక సూచనతో ఏడిఆర్ ఔచిత్యం, పౌర విధాన నియమావళి 1908, మధ్యవర్తిత్వం మరియు మధ్యవర్తిత్వం మధ్య ప్రతిఘటన, మధ్యవర్తిత్వం మరియు లోక్ అదాలకు మధ్య వ్యత్యాసం, ప్రయోజనాల మధ్య వర్తిత్వాలు, పాత్ర పోషించడం-11, కాకస్ మరియు ముగింపు పరిష్కారం, పరిష్కారం కానిది మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీజీ సురేష్, రిసోర్స్ పర్సన్/ట్రైనర్, కేరళ, జి జ్యోతి, రిసోర్స్ పర్సన్/ట్రైనర్, కేరళ మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ముందస్తు ప్రణాళికతో వేసవి తాపాన్ని, వడదెబ్బను అధిగమిద్దాం: జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు

-గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలి

-వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ స్వీయ జాగ్రత్తలు పాటించాలి

-అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారం తప్ప.. రాజకీయ పార్టీల ప్రమేయం ఉండకూడదు





కడప, మార్చి 25(భారత శక్తి ) : ముందస్తు చర్యలు చేపట్టి అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులు కారణంగా వచ్చే వడదెబ్బ (సన్ స్ట్రోక్), డీహైడ్రేషన్ వంటి సమస్యలను అధిగమించాలని.. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు అధికారులను ఆదేశించారు. కడప కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో "తాగునీటి కొరత, వేసవి వడగాల్పులు, వడదెబ్బ, ముందస్తు జాగ్రత్త చర్యలు" పై జెడ్పి సీఈవో ఓబులమ్మ, జిల్లా అదనపు వైద్యాధికారి ఉమామహేశ్వర కుమార్ లతో కలిసి డిఆర్వో విశ్వేశ్వర నాయుడు జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ముందస్తుగానే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో దీనిపై ప్రజలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రెండు నెలలు ఇదే పరిస్థితి వుండే అవకాశాలు ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు వేసవిలో అనవసరంగా బయటకు రాకూడదని అత్యవసర పనులు ఉంటే ఉదయం పూటనే పూర్తి చేసుకోవాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్తగా గొడుగు వాడటం, తెలుపు రంగు, పలుచటి చేనేత వస్త్రాలను ధరించడం, తలకు టోపీ లేదా రుమాలు వాడటం, వేడిగాలులు తగలకుండా చూసుకోవడం వంటి జాగ్రత్తలు తప్పక పాటించాలన్నారు. అన్ని మండలాల్లో ఎక్కడా కూడా తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఏ.ఎన్. ఎం.లతో సమన్వయం చేసుకుని.. వడగాల్పులపై ప్రజలకు అవగాహన కల్పించేలా, అలాగే తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతంలో షెడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని.. డ్వామా అధికారులను ఆదేశించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఆయా అంగన్వాడీ వేసవి వడగాల్పుల పై సిడిపిఓ, సూపర్వైజర్లు, అంగన్వాడి వర్కర్ల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలు, గర్భిణీల సౌలభ్యం కోసం ముందస్తుగా ఓ.ఆర్.ఎస్., సంబంధిత ద్రావకాలను సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఎలాంటి కొరత లేకుండా.. మంచి నీటి వసతి పూర్తిస్థాయిలో కల్పించడంతో పాటు.. విద్యార్థులకు వడగాల్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అటవీ పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణులు, పశు పక్షాదులకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా అక్కడక్కడా నీటి తొట్టెలు ఏర్పటు చేసి.. నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని అటవీశాఖాధికారులను ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేసవి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు మొదలైన జీవాలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్త చర్యలతో పాటు అన్ని పశు ఆరోగ్య కేంద్రాల వద్ద పశువులకు నీటి తొట్ల ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ లలో త్రాగు నీటి వసతితో పాటు ప్రథమ చికిత్సకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని.. రైల్వే, ఆర్టీసీ శాఖల స్టేషన్, జోనల్ మేనేజర్లను డిఆర్వో ఆదేశించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలోని పబ్లిక్ గ్యాదరింగ్ ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసుకునేలా మున్సిపల్ కమీషనర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఓఆర్ఎస్ ప్యాకెట్ల సరఫరాకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

104, 108 మొబైల్ మెడికల్ వాహనాల సేవలను.. వేసవిలో విస్తృతం చేయాలన్నారు. వడదెబ్బ, అతిసారం.. లాంటి సమస్యలపై వైద్య ఆరోగ్య సిబ్బంది, అధికారులు.. వెంటనే స్పందిస్తూ.. తక్షణ సేవాలందించాలన్నారు. వడదెబ్బ కేసుల రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ ఆ వివరాలను డిఆర్వో కు నివేదించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జనసమూహాలు ఉన్నచోట విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాల సౌజన్యంతో, ఎన్.జి.ఓ.ల భాగస్వామ్యంతో విరివిగా చాలివేంద్రాలు ఏర్పాటు చేయించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రద్దీగా ఉండే ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర గ్రీన్ తెరలను ఏర్పాటు చేయించాలన్నారు. డీఆర్డీఏ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో మహిళా సమాఖ్యల ద్వారా అవసరం ఉన్న చోట మంచినీటి చలివేంద్రాల నిర్వహణ బాధ్యతను అప్పగించాలన్నారు. ఎండ సమయంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పని చేసేవారు.. వేసవి సీజన్లో పాటించాల్సిన జాగ్రత్తలు తప్పక పాటించాలన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు అత్యంత జాగ్రత్తలు వహించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంలో సంబందిత శాఖల అధికారులు వారికి కేటాయించిన అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. రమాదేవి, డ్వామా పీడి అదిశేషారెడ్డి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మార్చి 25: జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 69 దరఖాస్తుదారులు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. రెవెన్యూ శాఖ 25 , పౌరసరఫరాల శాఖ 02,సర్వే ల్యాండ్ 3, పంచాయతీ %డ% పి టి విభాగం 7, పంచాయతీరాజ్ 4,డి.ఆర్.డి.ఓ 3,మున్సిపల్ 10, వెల్ఫేర్ డిపార్ట్మెంట్ 5, విద్యాశాఖ 2, వ్యవసాయ శాఖ 3, పశు వైద్య శాఖ 2, వైద్య %డ% ఆరోగ్యశాఖ 3, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజల ప్రధాన సమస్యలపై పూర్తి దృష్టి పెట్టి, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీ.ఆర్.ఓ పద్మజ రాణి, జడ్పీసీఈఓ జానకి రెడ్డి, ఆర్.డి.ఓ లు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మార్చి 25: ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఎల్.ఆర్.ఎస్. క్రింద చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లే అవుట్ల క్రమబద్ధీకరణకు ఈ నెల 31 తో ముగిస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రిబెట్ పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు దారులు సకాలంలో లే అవుట్ల క్రమబద్ధీకరణ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు దారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోగానే ప్రొసీడింగ్స్ జారీచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సి. హెచ్. రాజేందర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు:జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, మార్చి 25(భారత శక్తి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం ఊరు రామకృష్ణాపూర్కు చెందిన మెంగని శ్రీనివాస్ మందమర్రి శివారులో తనకు గల భూమిని కొందరు అక్రమంగా తనకు తెలియకుండా పట్టా చేయించుకున్నారని, ఈ విషయమై న్యాయస్థానంలో కేసు కొనసాగుతున్నందున ఇట్టి భూమిపై ఎలాంటి లావాదేవీలు, పట్టా మార్పులు జరగకుండా బ్లాక్ చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కత్తెరమల్ల లింగమూర్తి తన తాతల నుండి వస్తున్న పట్టా భూమిలో కొంత భాగాన్ని అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్ అవ్వడం లేదని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన నాగపురి శంకర్ తనకు గల భూమి ధరణి ద్వారా ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగంగా తప్పిదంగా నోటిపై చేశారని, తాను ఎలాంటి అవార్డు అమౌంటు, ఇతర లాభం పొందలేదని, ఇట్టి భూమిని సవరించి వహాణి మంజూరు చేయాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. భీమిని మండలం చిన్నగుడిపేట గ్రామానికి చెందిన పెసరి మల్లేష్ కుటుంబంలో పంపకాలు జరుగగా తనకు వచ్చిన వాటా భూమి వివరాలు తన పేరిట ఆన్లైన్లో నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామానికి చెందిన నల్లగొండ వెంకటి తన భూమి పాల్వాయి ప్రాజెక్టు 'సాలిగాం' ఎర్రవాగు లింకు కాలువలో కోల్పోయానని, ఇట్టి భూమికి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

భీమిని మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన పగిడి కవిత తాను గతంలో అంగన్వాడీ స్కూల్ టీచర్ , ఆయాగా పని చేయడంతో పాటు ప్రభుత్వం చేపట్టిన సర్వే ప్రక్రియలో రిపోర్టులు రాశానని, తనకు ఉపాధి కల్పించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ దివ్యాంగుల ఐక్యవేదిక ప్రతినిధి నగురారపు సుమన్ తన దరఖాస్తులో ప్రభుత్వం తలపెట్టిన ఇందిరమ్మ ఇండ్లను ప్రతి దివ్యాంగుడికి కేటాయించాలని, 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు అంత్యోదయ రేషన్ కార్డు జారీ చేయాలని, రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులు దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించాలని, ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచాలని, సదరం శిబిరాలలో స్లాట్లను 100కు పెంచాలని కోరారు. భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ప్రతినిధి మాధవరపు వెంకటరమణరావు జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన మొక్కజొన్న, వరి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దాసరి సృజన తనకు లక్కీడ్రాలో రెండు పడక గదుల ఇల్లు వచ్చిందని, సంవత్సరాలుగా కిరాయి ఉంటున్న తమకు ఇల్లు ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బొంతపల్లి ఆలయం అభివృద్ధి సంపూర్ణ సహకారం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



గుమ్మడిదల( సంగారెడ్డి )భారత శక్తి ప్రతినిధి, మార్చి 25: రాష్ట్రంలోనే ప్రముఖ శైవ క్షేత్రంగా పేరొందిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. దేవస్థానం నవహ్నిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని సోమవారం దేవాలయం లో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో ఎమ్మెల్యే జి.ఎం.ఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ పాలకవర్గం, దేవస్థానం పురోహితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల కాలంలో దేవాలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందజేశానని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఆలయ ఈవో శశిధర్, షేక్ హుస్సేన్, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు లాగులు తడిశాయి : బిఆర్ఎస్ నగర అధ్యక్షులు హరిశంకర్ ఫైర్

కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):కరీంనగర్ ఉమ్మడి జిల్లా బిఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం, కేటీఆర్ ర్యాలీనీ చూసి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులకు లాగులు తడిసినాయని నగర పార్టీ అధ్యకులు చల్ల హరిశంకర్ ఆరోపించారు. కేటీఆర్ ను విమర్శించే స్థాయి సునీల్ రావు కు లేదనీ, ఆయన కాలిగోటికి కూడా సరిపోవని మండిపడ్డారు. మంగళవారం మంకమ్మతోటలోని క్యాంపు కార్యాలయంలో నగర కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, యూత్ ప్రధాన కార్యదర్శి బోనకూరి సాయికృష్ణ, నాయకులు ఏడబోయిన శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరిశంకర్ మాట్లాడుతూ సునీల్ రావుకు మేయర్ పదవి, ఆ హెదానీ కల్పించింది బి ఆర్ ఎస్ పార్టీ అని, అధికారం కోసం జోకే చరిత్ర సునీల్ రావుదని ఎద్దేవా చేశారు. మేయర్ పదవిని దొడ్డిదారిన పొంది కోట్లు సంపాదించిన ఘనత సునీల్ రావుకు దక్కిందన్నారు. కరీంనగర్ రాజకీయాల్లో ఉసర వెల్లిగా సునీల్ రావుకు పేరుందనీ చెప్పారు. ఊసర వెల్లి సునీల్ రావు పట్ల బండి సంజయ్ జాగ్రత్త గా ఉండాలనీ సూచించారు.. అత్యంత అవినీతి పరుడు ఎవరని గూగుల్ లో వెతికితే సునీల్ రావు పేరు వస్తుందనీ ఆరోపించారు. ఉడుం సొచ్చినట్లు బీజేపీ లో సొచ్చిందనీ.. బీజేపీ నాయకులు జాగ్రత్తగా ఉండాలనీ చెప్పారు. బిఆర్ఎస్ నేతలను విమర్శిస్తే ఖబడ్దార్... సునీల్ రావు నీ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. స్మార్ట్ సిటీ లో బండి సంజయ్ పాత్ర లేదని బి.అర్.ఎస్ లో ఉన్నప్పుడు విమర్శించిన విషయం సునీల్ రావు మరిచి పోయావా అని గుర్తు చేశారు కరీంనగర్ అభివృద్ధి మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గారి తోనే సాధ్యమైందనీ చెప్పారు. బి.అర్.ఎస్ ప్రభుత్వ హాయంలోనే కరీంనగర్ అన్నివిధాల అభివృద్ధి చెందిన విషయం మంత్రి పొన్నం ప్రభాకర్ గమనించాలనీ కోరారు. 15 నెలల కాలంలో మంత్రిగా పొన్నం ప్రభాకర్ కరీంనగర్ కు ఏం చేశారో చెప్పాలి. తమ హాయంలో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ఎక్కడికక్కడ ఆగిపోయిందనీ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఒక కార్పొరేటర్ లా మాట్లాడారాని చెప్పారు .కెసిఆర్ కు దొంగ నోట్ల ప్రింటింగ్ ప్రెస్ ఉంది అన్న విషయం బండి సంజయ్ కు ఎలా తెలిసింది... అందులో పని చేశారా అని అడిగారు. రేవంత్ రెడ్డి దగ్గర మెప్పు పొందేదుకే బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారనీ, బండి సంజయ్ కు దమ్ముంటే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మీద మాట్లాడాలనీ మండిపడ్డారు. కెసిఆర్ కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ కలిసి డైవర్షన్ డ్రామాలు చేస్తున్నారనీ ఆరోపించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నగర మైనార్టీ అధ్యక్షులు షౌకత్, నగర విద్యార్థి విభాగం అధ్యక్షులు బొంకూరి మోహన్, యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, పార్టీయూత్ మైనార్టీ అధ్యక్షులు నవాజ్, చేతి చంద్రశేఖర్, ఆరె రవి గౌడ్ జెల్లోజి శ్రీనివాస్, కొత్త అనిల్ కుమార్, రాజేందర్, దుడెల్ల ప్రశాంత్, కర్రె అనిల్, నారదాసు వసంతరావు, మెరుగు శ్రీనివాస్, ఉమాశంకర్, ఒడ్నాల రాజు, సతినేని శ్రీనివాస్, గూడెల్లి రాజ్ కుమార్, మంచి కట్ల కిషోర్ నరసింగరావు, నయీమ్ గంటల రేణుక లుపాల్గొన్నారు.



# దేశవాళీలో అడుగుపెట్టిన ఏడాదిలోనే.. ఎవరీ విప్రాజ్ నిగమ్..?

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ కుర్రాడు విప్రాజ్ నిగమ్ ఆల్‌రౌండ్ ప్రతిభతో తళక్కున మెరిశాడు. బౌలింగ్‌లో కీలకమైన మార్‌క్రమ్ వికెట్ తీయడంతోపాటు.. బ్యాటింగ్‌లోనూ మెరుపు వేగంతో పరుగులు సాధించాడు. ఫలితంగా దిల్లీ క్యాపిటల్స్ ఒక వికెట్ తేడాతో థ్రిల్లింగ్ విక్టరీని సొంతం చేసుకొంది.



విప్రాజ్‌కు ఇది ఐపీఎల్ అరంగేట్రం మ్యాచ్ కావడం విశేషం. తొలి మ్యాచ్‌లోనే జట్టును ఆదుకొని విజయం అందించాడు. 210 లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దిల్లీ ఓ దశలో 113 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో 13 ఓవర్‌లో విప్రాజ్ బరిలోకి దిగి కేవలం 15 బంతుల్లోనే 39 పరుగులు సాధించి లఖ్‌నవూ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. రవి బిష్ణోయ్ వంటి అంతర్జాతీయ శ్రేణి స్పిన్నర్‌ను అలవోకగా ఎదుర్కొన్నాడు. ఈక్రమంలో అశుతోష్‌తో కలిసి కీలకమైన 55 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించాడు.

యూపీ టీ20తో వెలుగులోకి..

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన విప్రాజ్‌ను ఈసారి జెడ్డాలో జరిగిన మెగా వేలంలో దిల్లీ జట్టు రూ.50 లక్షలకు దక్కించుకొంది. ఈ యువ ఆల్‌రౌండర్ 2024 యూపీ టీ20 టోర్నీ సీజన్‌లో మెరుపులు మెరిపించి దిల్లీ ఫ్రాంచైజీ దృష్టిలోపడ్డాడు. యూపీ ఫాల్కన్స్ తరఫున 12 మ్యాచ్‌లు ఆడి.. 20 వికెట్లు పడగొట్టాడు.

ఇక దేశవాళీలో 2024-25 సీజన్‌లో తొలిసారి ఉత్తరప్రదేశ్ జట్టు అన్ని ఫార్మాట్లకు ఎంపికయ్యాడు. మూడు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, ఐదు లిస్ట్-ఎ గేమ్‌లు, 8 టీ20లు ఆడాడు. పశ్చిమ బెంగాల్‌పై ఆడిన రంజీ మ్యాచ్‌లో నిగమ్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు కీలక వికెట్లను పడగొట్టాడు. వీరిలో అంతర్జాతీయ ఆటగాడు వృద్ధిమాన్ సాహా కూడా ఉన్నాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో కూడా ముఖ్యమైన రెండు వికెట్లు సాధించాడు. మూడు రంజీ మ్యాచ్‌ల్లో 13 వికెట్లు పడగొట్టాడు. ఇక సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఏడు మ్యాచ్‌ల్లో 8 వికెట్లు కూల్చాడు. 2024 కర్నల్ సీకే నాయుడు ట్రోఫీ ఫైనల్‌లో రాణించి అండర్-23 జట్టులో స్థానం పొందాడు.

బ్యాటింగ్ నుంచి లెగ్ స్పిన్నర్‌గా..

2004లో జన్మించిన విప్రాజ్ తొలుత అండర్-19 వరకు బ్యాటర్‌గానే కొనసాగాడు. కానీ, ఆ తర్వాత అతడు క్రమంగా లెగ్‌స్పిన్ బౌలింగ్‌లో రాటుదేలాడని టీమ్‌ఇండియా మిస్టరీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ వెల్లడించాడు. బంతిపై చాలా కృషి చేసి.. మంచి టర్నింగ్ సాధించాడన్నాడు. బ్యాటింగ్‌లో కూడా విప్రాజ్ భారీ షాట్లు ఆడటానికి ఏమాత్రం వెనుకంజ వేయడని తెలిపాడు. అతడి హిట్టింగ్ సామర్థ్యం చూసి తనకు ఆశ్చర్యం వేసిందని పేర్కొన్నాడు.

# ఆ ధైర్యంతోనే ఆటగాళ్లు భయం లేకుండా ఆడుతున్నారు: ధోనీ

: చెన్నై సూపర్ కింగ్స్ ( మాజీ సారథి ఎంఎస్ ధోనీఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ని సమర్థించాడు. అయితే, ఈ రూల్ వచ్చిన కొత్తలో తనకు అస్సలు నచ్చలేదని, ఇది అవసరం లేదని అనిపించిందని పేర్కొన్నాడు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ని ఐపీఎల్ 2023 సీజన్‌లో ప్రవేశపెట్టారు. ఈ నియమం వల్ల అదనంగా ఒక బ్యాటర్ లేదా బౌలర్‌ను తీసుకుంటూ జట్లు ప్రయోజనం పొందుతున్నాయి. ముఖ్యంగా ఎక్స్ ట్రా బ్యాటర్‌ను బరిలోకి దింపి టీమ్ భారీ స్కోరు సాధించేలా చేస్తున్నాయి. గత సీజన్‌లో 41 సార్లు 200కుపైచిలుకు స్కోర్లు నమోదయ్యాయి. కానీ, ఇంపాక్ట్ ప్లేయర్ వల్ల భారీ స్కోర్లు నమోదు కావడం లేదని, ఆటగాళ్ల మైండ్ సెట్ మారడంతోనే ఇది సాధ్యమవుతోందని ధోనీ పేర్కొన్నాడు.



'ఈ రూల్‌ను అమలు చేసిన కొత్తలో నాకైతే ఇది అనవసరమనిపించింది. ఒక విధంగా ఈ రూల్ నాకు హెల్ప్ అవుతుంది. కానీ, నాకు దీని అవసరం లేదు. నేను ఇప్పటికీ వికెట్ కీపింగ్ చేస్తాను. కాబట్టి నేను ఇంపాక్ట్ ప్లేయర్‌ని కాదు. ఆటలో పాలుపంచుకోవడం నాకు ఇష్టం. ఈ రూల్ వల్ల మ్యాచ్‌ల్లో మరిన్ని భారీ స్కోర్లు నమోదవుతాయని చాలామంది అంటున్నారు. నేనైతే పిచ్ పరిస్థితులు,ప్లేయర్ల కాన్ఫిడెన్స్ లెవల్స్ కూడా భారీ స్కోర్లకు కారణమని నమ్ముతున్నా. అదనపు బ్యాటర్ ఉన్నాడనే ధైర్యంతో ఆటగాళ్లు భయం లేకుండా మరింత దూకుడుగా ఆడుతున్నారు. అలా అని టీమ్స్ నలుగురైదుగురు ఎక్స్ ట్రా బ్యాటర్లను ఆడించట్లేదు. కానీ, ఆ అదనపు బ్యాటర్ ఉన్నాడనే భరోసాతో మాత్రం ముందుగా వచ్చే బ్యాటింగ్ చేసే ప్లేయర్ల ఆటతీరును మార్చేస్తోంది. టీ20 క్రికెట్ ఇలాగే మారిపోయింది' అని ధోనీ వివరించాడు.

ప్రస్తుతం ఐపీఎల్ 2025లో ధోనీ సీఎస్కేకు ఆడుతున్న సంగతి తెలిసిందే. 43 ఏళ్ల వయసులోనూ వికెట్‌కీపర్‌గా అదరగొడుతున్నాడు. ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్‌ను మెరుపు స్టంపింగ్‌తో పెవిలియన్‌కు పంపాడు. ఛేదనలో విన్నింగ్ షాట్ కొట్టే అవకాశం వచ్చినా రెండు డాట్ బాల్స్ ఆడి రచిన్ రవీంద్రకు మ్యాచ్ ముగించే బాధ్యత అప్పగించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ తదుపరి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఈ మ్యాచ్ మార్చి 27న చెన్నై వేదికగా జరగనుంది.

# ఇంతకీ ధోనీ.. విఘ్నేశ్‌తో ఏం మాట్లాడాడు?

ముంబయి ఇండియన్స్ ) యువ స్పిన్నర్ విఘ్నేశ్ పుతర్ ప్రస్తుతం ఇంటర్నెట్ సంచలనంగా మారాడు. చెన్నైసూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో ఇతడు ఐపీఎల లో అరంగేట్రం చేశాడు. తన తొలి ఐపీఎల్ మ్యాచ్‌లోనే రుత్‌రాజ్ గైక్వాడ్ శివమ్ దూబే దీపక్ హుడా ను ఔట్ చేసి అందరితో భేష్ అనిపించుకున్నాడు. ఈ లెగ్ స్పిన్నర్ ధోనీ ని కూడా ఆకట్టుకున్నాడు. అందుకే మ్యాచ్ అనంతరం ధోనీ సైతం ఈ యువ క్రీడాకారుడితో మాట కలిపాడు. అసలింతకు ధోనీ అతడితో ఏం మాట్లాడి ఉంటారని అభిమానులంతా ఆసక్తి కనబరిచారు. చివరికి ఈ విషయం విఘ్నేశ్ చిన్ననాటి మిత్రుడు శ్రీరాగ్ ద్వారా తెలిసింది. మ్యాచ్ జరిగిన మరుసటి రోజు శ్రీరాగ్... విఘ్నేశ్‌కు ఫోన్ చేసి ధోనీతో జరిగిన సంభాషణ గురించి ఆరా తీశాడు.




'ధోనీ.. విఘ్నేశ్‌ను అతడి వయసెంత? అని అడిగాడు. అలాగే ఇదే ఆటతీరును కొనసాగించు' అని అతడికి సూచించాడని శ్రీరాగ్ మీడియాకు తెలిపాడు. కొన్ని రోజుల క్రితం విఘ్నేశ్ తల్లిదండ్రులతో జరిగిన సంభాషణనూ అతడు పంచుకున్నాడు. 'ఎంత ఎదిగినా మూలాలను మరిచిపోకూడదు. క్రికెటర్లకు చాలా త్వరగా ఫేమ్, డబ్బు వస్తుంది. వినోద్ కాంబ్లీ, పృథ్వీషా విషయంలో ఏం జరిగిందో మనందరికీ తెలిసిందే' అని నేను వాళ్లతో చర్చించాను అని శ్రీరాగ్ మీడియాకు వివరించాడు. మరో వైపు విఘ్నేశ్ తన మొదటి మ్యాచ్‌లో ప్రతిభ చాటినందుకు సంతోషంగా ఉన్నాడు. 'ఇంత పెద్ద పెద్ద వాళ్లతో కలిసి నేను ఆడతానని అసలు అనుకోలేదు అని' మ్యాచ్ అనంతరం తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. బుమ్రా, హార్దిక్ పాండ్యలాంటి అద్భుతమైన ప్రతిభాపాటవాలున్న మరో క్రీడాకారుణ్ని విఘ్నేశ్ రూపంలో ముంబై ఇండియన్స్ వెతికి పట్టుకుందని క్రీడా విశ్లేషకులు అంటున్నారు. రానున్న మ్యాచుల్లో ఈ యువ లెగ్ స్పిన్నర్ మరింతగా రాణించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# కుమార్తెతో కేఎల్ రాహుల్.. సోషల్ మీడియా ఫొటోలో నిజమెంత?

్క: భారత స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ తండ్రయ్యాడు. అతడి భార్య అతియాశెట్టి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని రాహుల్-అతియా సోమవారం సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అయితే, కుమార్తెతో భార్యాభర్తలిద్దరూ దిగిన ఫొటో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. కేఎల్ రాహుల్ కుమార్తె అంటూ సంబంధిత ఫొటోను షేర్ చేస్తున్నారు. ఇంతకీ ఈ ఫొటోలో నిజమెంత?



ఈ ఫొటో పూర్తి అవాస్తవం. ఆడబిడ్డ జన్మించిన విషయాన్ని కేఎల్ రాహుల్, అతియా శెట్టి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న కొన్ని గంటల్లోనే ఈ ఏఐ జనరేటెడ్ ఇమేజ్ సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం అయ్యింది. అచ్చం చూడ్డానికి ఒరిజినల్ ఫొటోను పోలి ఉన్న ఈ ఇమేజ్‌ను నిజమే అనుకుని చాలా మంది షేర్ చేస్తున్నారు.

ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నీలో జులపాలతో కనిపించిన కేఎల్ రాహుల్.. ఈ ఫొటోలో హెయిర్‌కట్‌తో కనిపించడం గమనార్హం. 3 రోజుల క్రితం దిల్లీ క్యాపిటల్స్ జట్టు నిర్వహించిన ఈవెంట్‌లోనూ జులపాలతోనే రాహుల్ కనిపించాడు.

ఈ ఫొటోను సైట్ ఇంజిన్ అనే ఏఐ డిటెక్టర్ టూల్‌లో వేసినప్పుడు 99 శాతం ఏఐ ఫొటో అని తేలింది.

అక్షర్ పటేల్‌తో కేఎల్ రాహుల్

ఏఐ జనరేటెడ్ ఫొటోను ధ్రువీకరించే క్రమంలో మరో ఆసక్తికర విషయం ఒకటి వెలుగు చూసింది. కేఎల్ రాహుల్ కుమార్తె జన్మించడానికి నెల రోజుల ముందే ఇదే తరహా ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. తాము తల్లిదండ్రులు కాబోతున్న విషయాన్ని గతేడాది నవంబర్‌లో ఈ జంట బయటపెట్టింది. దీంతో అక్కడికి రెండు నెలల తర్వాత సోషల్‌మీడియాలో ఏఐ ఫొటోలు ప్రత్యక్షమయ్యాయి. కొందరు వాటిని ధ్రువీకరించుకోకుండానే అభినందనలు తెలియజేశారు కూడా.

ఇదొక్కటే కాదు.. రోహిత్ శర్మకు ఖరీదైన కారును నీతా అంబానీ గిఫ్ట్ ఇచ్చారంటూ ఇలానే ఓ ఫేక్ ఫొటో చక్కర్లు కొట్టింది. తర్వాత అది కూడా ఫేక్ అని తేలింది. ఏఐ టూల్స్ అందుబాటులోకి రావడంతో ఇలా చాలా మంది ఫేక్ ఫొటోలను క్రియేట్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెడుతున్నారు. సరదా కోసం చేసే ఇలాంటి ప్రయోగాలు కొన్నిసార్లు విపరీత పరిణామాలకు దారి తీసే ప్రమాదమూ లేకపోలేదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాబట్టి సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఫొటోలను ఒకటికి రెండుసార్లు ధ్రువీకరించుకోండి.

# గుజరాత్ ఓపెనర్ బట్లర్ కాదు: శుభ్‌మన్ గిల్

గుజరాత్ టైటాన్స్ ఓపెనర్‌గా జోస్ బట్లర్ వచ్చే విషయం ఇంకా సందిగ్ధంలోనే ఉంది. ఈ అంశంపై ఆ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇంకా ఓ నిర్ణయానికి రానట్లు తెలుస్తోంది. పంజాబ్ కింగ్స్‌తో నేడు గుజరాత్ జట్టు తలపడనుంది. గతంలో రాజస్థాన్ రాయల్స్‌లో ఉన్నప్పుడు జైస్వాల్‌తో కలిసి బట్లర్ ఇన్నింగ్స్ ప్రారంభించేవాడు. కానీ, గుజరాత్‌లో అతడు కీలకమైన మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి.




ఈ అంశంపై గిల్ మాట్లాడుతూ "బట్లర్ వంటి ఆటగాడు ఉండటాన్ని ఏ జట్టూ సమస్య అనుకోదు. టీ20 క్రికెట్‌లో ఇంగ్లండ్ కోసం, ఐపీఎల్‌లో అతడు ఎలా ఆడాడో మనం చూశాం. గత సిరీస్‌లో అతడు 3వ స్థానంలో బరిలోకి దిగినట్లున్నాడు. అందుకే.. అతడు ఏ స్థానంలో ఆడతాడన్న అంశంపై మాకు ఎటువంటి ఇబ్బంది లేదు. ఆయన స్థానంపై ఇంకా మేము ఓ నిర్ణయం తీసుకోలేదు. అది ఆట మొదలయ్యాక తెలుస్తుంది. అతడు దాదాపు 9 ఏళ్ల నుంచి ఐపీఎల్ ఆడుతున్నాడు. వివిధ స్థానాల్లో అతడు ఆడి రాణించాడు. దానిని అసలు సమస్యే అనుకోము" అని పేర్కొన్నాడు. జట్టు పూర్తి ఫిట్‌గా ఉందని.. ఎటువంటి గాయాలు లేవని వెల్లడించాడు.

ఇక బౌలింగ్ దళం గురించి శుభ్‌మన్ మాట్లాడుతూ.. " ప్రతి ఆటగాడు ప్రత్యేకం.. వారి స్కిల్స్ వేరు. ఆటగాళ్లను వేరొకరితో పోల్చం. వికెట్లు పడగొట్టడమే సీమర్ల లక్ష్యం. ఈ క్రమంలో షమీని సిరాజ్‌తో భర్తీ చేసినట్లు చూడాలనుకోము. సిరాజ్ తనలానే ఆడాలి" అని పేర్కొన్నారు.

టీ20 ఫార్మాట్‌కు ఇంగ్లాండ్ జట్టులో బట్లర్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాడు. సాల్ట్-డకెట్ జోడీ అక్కడ ఓపెనింగ్ చేస్తోంది.

# శ్రేయస్‌కు బీసీసీఐ కాంట్రాక్టు ఖాయం

బీసీసీఐ (సెంట్రల్ కాంట్రాక్టులకు సంబంధించిన జాబితా విడుదల కావాల్సిఉంది. ఈనేపథ్యంలో క్రీడా పండితులు పలు ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కాంట్రాక్టు కోల్పోయిన శ్రేయస్ అయ్యర్ ఈసారి కచ్చితంగా దక్కించుకునే అవకాశాలే కనిపిస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ అనంతరం రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ ( రవీంద్ర జడేజా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. ఈ నేపథ్యంలో వారికి ఈసారి %ఇా%ం కేటగిరిలో స్థానం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఈ విభాగంలో కొనసాగాలంటే ఆటగాళ్లు టెస్టులు, వన్డేలు, టీ20లు ఇలా ఈ మూడు ఫార్మాట్లలోనూ ఆడాలి. దీంతో ఈ ముగ్గురు %ఇా% కేటగిరి కింద బీసీసీఐ కాంట్రాక్టులు పొందనున్నారు.

జస్ప్రీత్ బుమ్రా మాత్రం గత ఏడాదిలానే ఈ ఏడాది కూడా %ఇా%ం కేటగిరిని సొంతం చేసుకోనున్నాడు. నిరుడు %ఇా% కేటగిరిలో ఉన్న రవిచంద్రన్‌అశ్విన్ ఈసారి కాంట్రాక్ట జాబితా నుంచి నిష్క్రమిస్తాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు అతడు రిటైర్మెంట్ ప్రకటించడమే దీనికి కారణం. ఇంగ్లాండ్‌తో టీ 20 సీరీస్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన అక్షర్‌పటేల్ ఈసారి కేటగిరి %దీ% నుంచి %ఇా%కు వచ్చే అవకాశం ఉంది.

గత సంవత్సరం బీసీసీఐ ఆగ్రహానికి గురై, అనూహ్య పరిస్థితుల్లో శ్రేయస్ అయ్యర్ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయాడు. ఇటీవల జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో తన సమయోచిత బ్యాటింగ్‌తో టీమ్‌ఇండియా విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. దీంతో శ్రేయస్ తిరిగి కాంట్రాక్ట్‌ను పొందడం ఖాయంగా కనిపిస్తోంది. యశస్వి జైశ్వాల కూడా కేటగిరి నుంచి ప్రమోషన్ పొందే అవకాశాలున్నాయి. ఆకాశ్‌దీవ్( సర్ఫరాజ్‌ఖాన్ కేటగిరో స్థానం దక్కించుకోవచ్చు. నితీశ్‌కుమార్ రెడ్డి పేరు కూడా సెంట్రల్ కాంట్రాక్ట జాబితాలో కనిపించొచ్చు. శార్దూల్ ఠాకూర్(రుతురాజ్ గైక్వాడ్ కాంట్రాక్టులో కొనసాగడం సందేహంగానే ఉంది. ఏదేమైనప్పటికీ సెలక్షన్ కమిటీ, ప్రధాన కోచ్‌తో సంప్రదింపుల తర్వాత బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా తుది జాబితాను అపెక్స్ కౌన్సిల్ ముందు ఆమోదం కోసం పెట్టనున్నాడు. అప్పుడే అధికారికంగా పూర్తి సమాచారం తెలియనుంది.

# దేశాన్ని రెండు ముక్కలు చేయాలన్న గంగుల విజ్ఞతకే తెలుసు

## దేశ పౌరిడిగా గంగుల వాఖ్యలు ఖండిస్తున్నాం

## మాజీ మేయర్, బిజెపి నాయకులు సునీల్ రావు



కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):భారత దేశ సార్వభౌమాధికారా నికి కట్టుబడి, ఒక శాసనసభ్యుడిగా ప్రమాణం చేసిన వ్యక్తి దక్షణ భారతాన్ని ప్రత్యేక దేశంగా ప్రకటించాలని, దాని కోసం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన వాఖ్యల్ని ఖండిస్తున్నామని బిజెపి నాయకులు, మాజీ మేయర్ సునీల్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంగుల వ్యాఖ్యలను ప్రతి ఒక్కరు ఖండించాల్సిందేనీ, భారతదేశం ఒక సుసంపన్నమైన దేశంమని, ఎంతోమంది త్యాగధనుల పోరాటం వల్ల మన స్వాతంత్రం సాధించుకున్నమని చెప్పారు. దేశం మనది ఈ భారతదేశం అఖండంగా ఉండాలని భారతదేశ ప్రతి పౌరుడుగా మనస్ఫూర్తిగా కోరుకుంటారు. అటువంటి దానికి వ్యతిరేకంగా గంగుల కమలాకర్ మాట్లాడారో ఆ వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. వెంటనే గంగుల కమలాకర్ బేషరతు గా క్షమాపణ చెప్పి ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. భారతదేశం విడిపోవాలి అనే మనసత్వం గలవారు ఎవరైనా కూడా భారతదేశానికి శత్రువుల వంటి వారేనని, అటువంటి వ్యక్తులు పట్ల సమాజం కూడా చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అన్ని రంగాలలో కూడా మన ప్రధానమంత్రి మోడీ దేశాన్ని ముందుకు తీసుకుపోతున్నారనీ, ఈ దేశంలో ఇటువంటి కుంచితమైన మనస్తత్వం కలిగినటువంటి నాయకులు ఈ విధంగా ప్రజల్లో భేదాభిప్రాయాలు తీసుకవచ్చి భారతదేశాన్ని విడగొట్టాలని దురాలోచన చేస్తున్నారో అటువంటి దురాలోచన మైన మాటలను అందరూ కూడా ఖండించాలన్నారు.

# బిఆర్ఎస్ కు ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చిన బుద్ధి మారలేదు

## అయోధ్య రామ మందిర అక్షింతలపై, హిందూ సమాజంపై వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుండాలి

## బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్



కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు వి ఆర్ఎస్ ఇచ్చి గద్దె దించిన ఇంకా ఆ పార్టీ నేతల బుద్ధి మారలేదని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దూబల శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ కరీంనగర్లో నిర్వహించిన సన్నాహక సమావేశం లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బిజెపి పై, కేంద్ర మంత్రి బండి సంజయ్, అయోధ్య రామ మందిర అక్షింతలపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతి సారి హిందువుల మనోబాలు దెబ్బతినేలా వాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. కేటీఆర్ అయోధ్య నుండి వచ్చినవి అక్షింతలు కావు., రేషన్ బియ్యం తెచ్చి అక్షింతల పేరుతో పంచి ప్రజలను మోసం చేశారని వాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఒక వర్గం ఓట్ల కోసం, మద్దతు కోసం యావత్తు హిందు సమాజాన్ని కించ పరిచేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. కేటీఆర్ మీ వ్యాఖ్యలను హిందూ సమాజం గమనిస్తుందని హిందువుల మనోబాలను కించ పరుస్తే మీ పార్టీకి పుట్టగతులు ఉండవనీ హెచ్చరించారు. ఎన్నికల్లో తగిన రీతిలో ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ బిఆర్ఎస్ నాయకుల తీరు మారడం లేదన్నారు. జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ అడ్రస్ లేకపోకుండా పోయిందని , అలాంటి పార్టీ నేతలు బిజెపిపై, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పై అనవసర వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన అభివృద్ధి గురించి టిఆర్ఎస్ నేతలకు తెలియకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. కరీంనగర్ జిల్లాలో బండి సంజయ్ కుమార్ నాయకత్వం లో చాలా అభివృద్ధి పనులు దిగ్విజయంగా కొనసాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో కరీంనగర్ అభివృద్ధి కోసం నిధులు తెచ్చిన ఘనత బండి సంజయ్ కుమార్ కె దక్కుతుందన్నారు. పెద్ద ఎత్తున స్మార్ట్ సిటీ నిధులు వందల కోట్లు తెచ్చి కరీంనగర్ నగరాన్ని పూర్తిగా అభివృద్ధి చేసిన ఘనత బండి సంజయ్ కుమార్ కె దక్కుతుందన్నారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్యలు, రైల్వే ఓవర్ బ్రిడ్జ్ సమస్యలు, నేషనల్ హైవేలు, గ్రామాల్లో అంతర్గత రహదారులు, ఇలా అనేక సమస్యలకు పరిష్కారం చూపిన నాయకులు బండి సంజయ్ అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ కు చేసిన అభివృద్ధిపై ఆత్మ విమర్శన చేసుకోవాలన్నారు. కరీంనగర్ నగరానికి కేబుల్ బ్రిడ్జ్ అని తెచ్చి., వేసిన రోడ్లు లేచి పోయి బిగించిన లైట్లు రాకుండ కళావిహీనంగా తయారు చేశారన్నారు.మానేరు రివర్ ఫ్రంట్ అతి గతి లేకుండా పోయిందని విమర్శించారు. బిఆర్ఎస్ వందల కోట్ల రూపాయలతో, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై చేపట్టిన నాసిరకం పనులు సజీవ సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయన్నారు. ఇది మీ బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. బండి సంజయ్ హాయాంలో నగరంలో జరిగిన రోడ్లు, లైట్లు, పార్కులు, త్రాగు నీరు, లాంటి అభివృద్ధి పనులు ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు. ప్రజలకు అంతా తెలుసు ఎవరు ఏం చేస్తున్నారో అన్ని విషయాలు గమనించే బండి సంజయ్ కుమార్ ను పార్లమెంటు ఎన్నికల్లో రెండోసారి భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. ఆ గెలుపే ఆయన చేసిన అభివృద్ధి కి నిదర్శనమ్మన్నారు.ఇవన్ని తెలిసి మోడి నాయకత్వం, భారతీయ జనతా పార్టీ ని కేటీఆర్ , బిఆర్ఎస్ నేతలు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. భారతీయ జనతా పార్టీ ని, నాయకులను చులకన చేసి మాట్లాడం మానుకోవాలనీ హెచ్చరించారు. భారతీయ జనతా పార్టీ నాయకత్వాన్ని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉ ంటాయని, ప్రజలంతా ఒక్కటయ్యే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల జిల్లాకి మంజూరు చేయకపోవడం

## తీవ్ర అన్యాయం: ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరవింద్




కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):కరీంనగర్ జిల్లాకు మంజూరైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ను హుస్నాబాద్ నియోజకవర్గానికి కేటాయించుకోవడం విద్యార్థి లోకానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల కలగానే మిగిలిపోయిందనీ ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ శాతవాహన యునివర్సిటీ కమిటీ అధ్యక్షులు చిట్యాల రాజు కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అరవింద్ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లాకు పూర్తిగా ద్రోహం చేసినట్టు కనబడుతుంది. కరీంనగర్ కేంద్రంగా వివిధ జిల్లాల నుంచి వచ్చి ఇంజనీరింగ్ విద్యలో ప్రైవేట్ కళాశాలలో వేలాదిగా చదువుకుంటున్నారనీ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు సరిపడ ఉన్న, ప్రభుత్వ కలశాల లేనందున విద్యార్థులు తప్పనిసరి ప్రైవేట్ కలశాలలో చేరుతున్నారనీ చెప్పారు. .ఆర్థిక ఇబ్బందులూ ఉన్న విద్యార్థులకు చదువు అందని పరిస్థితి ఉ ంటుందనీ విచారం వ్యక్తం చేశారు. కరీంనగర్లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు అవుతుందని కోటి ఆశలతో విద్యార్థులు ఎదురుచూస్తూ ఉంటే తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. పెద్దపెల్లి యువ వికాసం సభలో వరాల జల్లు విద్యారంగానికి కురిపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటను తప్పరు, నేడు పొన్నం తమ రాజకీయ స్వార్థం కోసం మాత్రమే ఆయన నియోజకవర్గానికి కేటాయించుకున్నారనీ చెప్పారు. కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఎంతో అవసరమున్న నేపథ్యంలో హుస్నాబాద్ కు కేటాయించుకోవడం పూర్తిగా కరీంనగర్ జిల్లా విద్యారంగాన్ని విస్మరించినట్టేనని ఆరోపించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంగా విద్యార్థులు ఆశలను ప్రభుత్వం అడియాశలు చేస్తూ ఉత్తర్వులు జరిచేయడం జరిగిందనీ చెప్పారు. ఉత్తర తెలంగాణ కరీంనగర్ కేంద్రంగా వివిధ జిల్లాల నుండి ఇక్కడ వచ్చి అభ్యసిస్తున్నారు ,శాతవాహన యూనివర్సిటీ లో ఏర్పాటు చేస్తే బాగుండేది అని వారు అన్నారు. కరీంనగర్ జిల్లా సిటీ ఔట్స్ కట్స్ లలో చాలా ప్రభుత్వ భూములు ఉన్నాయి వాటిని ఉపయోగించుకొని కరీంనగర్ లోనే కేటాయిస్తే విద్యార్థులకు ఉపయోగపడే అవకాశం ఉండేది కానీ పూర్తిగా ఏకపక్ష నిర్ణయాలు తో విద్యారంగాన్ని చిక్కుల్లో పెట్టవద్దని సూచించారు. దాంతోపాటు యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ లా కోర్స్ ఏర్పాటు చేయాలనీ, విద్యార్థుల చదువులను పూర్తిగా ఇరకాటకంలో పెట్టకూడదనీ, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల కరీంనగర్ లోనే ఏర్పాటు చేయాలి లేనియెడల పోరాటాల సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, మహేష్, శంకర్, దత్తు, మల్లేష్, వెంకటేష్, పాల్గొన్నారు.

# ఎడ్యుకేషనల్ హబ్ గా కరీంనగర్

## -విద్యా రంగంలో సీఎం రేవంత్ రెడ్డి విప్లవాత్మక మార్పులు

## -కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జ్ వెలిచాల



కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగంలో చేపడుతున్న విప్లవాత్మక మార్పులతో కరీంనగర్ ఉమ్మడి జిల్లా రాబోయే కాలంలో ఎడ్యుకేషనల్ హబ్ గా మారబోతున్నదని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. కరీంనగర్లోని శాతవాహన యూనివర్సిటీకి లా కాలేజీ, హుస్నాబాద్ లో ఇంజినీరింగ్ కాలేజ్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇందుకోసం ప్రత్యేకంగా కృషి చేసిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో రాజేందర్ రావు మీడియాతో పెద్దపల్లి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళాశాలలు ప్రకటించారని, మూడు నెలల లోపే వాటిని మంజూరు చేస్తూ హామీని నిలబెట్టుకోవడం చారిత్రాత్మకమన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కరీంనగర్ జిల్లాలో విద్యారంగం కుంటుపడిందని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనీసం కరీంనగర్ కు మెడికల్ కాలేజ్ మంజూరు చేయలేదని మండిపడ్డారు. మెడికల్ కాలేజ్ ఏర్పాటు కోసం గతంలో ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ కు మెడికల్ కళాశాల మంజూరు చేశారని పేర్కొన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటులో మంత్రి పొన్నం ప్రభాకర్ కీలకపాత్ర పోషించారని తెలిపారు. బిఆర్ఎస్ పాలకులు గత పదేళ్ల కాలంలో విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగ అభివృద్ధికి అనేక విప్లవాత్మకమైన కార్యక్రమాలు చేపడుతున్నారని రాజేందర్ రావు తెలిపారు. ప్రతి ఏటా ప్రభుత్వం బడ్జెట్లో విద్య రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నదని చెప్పారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లోనూ ప్రభుత్వం విద్య శాఖకు ఈ 23,108 కోట్ల రూపాయలు కేటాయించిందని పేర్కొన్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ దూరదృష్టితో అర్ధ శతాబ్దానికి పూర్వం చెప్పిన ఈ మాటలు నేటికీ మన సమాజానికి వర్తిస్తాయనీ, అందులో భాగంగానే యువతకు శాస్త్ర- సాంకేతిక నైపుణ్యతను పెంపొందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని హైదరాబాదులో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యావ్యవస్థను తయారు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. దీనికోసమే రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి 11, 600 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం ఒక చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ప్రతి నియోజక వర్గంలో కనీసం ఒక యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నదని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో హుస్నాబాద్లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో బీటెక్ సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచులను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణా నికి రూ.44.12 కోట్లు కేటాయించగా అందులో రూ. రూ.29.12 కోట్లు ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. శాతావాహన వర్సిటీలో ఏర్పాటు చేయనున్న లా కాలేజీలో మూడేళ్ల కోర్సు, రెండేళ్ల కోర్సు(మేధో సంపత్తి చట్టం)లో అడ్మిషన్లను ఇవ్వనున్నారని తెలిపారు. ఈ కాలేజీ నిర్మాణానికి మొత్తం రూ.22.96 కోట్లు కేటాయించగా.. అందులో ప్రస్తుతం రూ.5 కోట్లు మంజూరు చేశారనీ, మొత్తంగా రూ.67.08 కోట్లను ప్రభుత్వం ఈ రెండు కాలేజీలకు కేటాయించనుందని రాజేందర్రావు పేర్కొన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి

## -కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు సమకూర్చాలి

## -రైతులకు అవగాహన కల్పించాలి

## -జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని, జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా కొనుగోళ్ల కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ధాన్యం పూర్తిగా పరిపక్వతకు వచ్చిన తర్వాతనే హార్వెస్ట్ చేసేలా రైతులకు, హార్వెస్టింగ్ మిషన్ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కోతలకు సంబంధించి రెవెన్యూ గ్రామాల వారీగా నిర్దిష్ట ప్రణాళిక ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకపు యంత్రాలు, తేమను కొలిచే యంత్రాలు, గన్ని సంచులు, తార్పాలీన్ కవర్లు వంటివి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఉన్న ప్యాడి క్లీనర్ లతో పాటు మరో 15 ప్యాడి క్లీనర్ లను కొనుగోలు చేయాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు తర్వాత వెను వెంటనే వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. రైతుకు సకాలంలో సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యాలు వేరువేరు ప్రదేశాల్లో ఉండేలా చూడాలని సూచించారు. ఎండాకాలం దృశ్య రైతులకు నీడ, తాగునీటి సౌకర్యం ఉండేలా చూడాలని తెలిపారు. సిబ్బంది కొనుగోలు రిజిస్టర్ ను అందుబాటులో ఉంచుకోవాలని, పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. తేమ యంత్రాన్ని నీడలోనే ఉండేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాకే మంజూరైన ఇంజనీరింగ్ కళాశాల,

## హుస్నాబాద్ కు తరలించడం సరికాదు:సిపిఐ నాయకులు సురేందర్ రెడ్డి, రాజు

కరీంనగర్, మార్చి 25(భారత శక్తి): కరీంనగర్ జిల్లాకు మంజురు అయిన ఇంజనీరింగ్ కళాశాలను పొన్నం ప్రభాకర్ తన శాసనసభ నియోజకవర్గంలోని హుస్నాబాద్ కి తరలించడం పట్ల సిపిఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, కౌన్సిల్ సభ్యులు న్యాలపట్ల రాజు విచారం వ్యక్తం చేశారు కరీంనగర్ నగరంలో ఉన్న శాతవాహన యూనివర్సిటీకి అనుబంధంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నిర్మిస్తే కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేదని తను జన్మనిచ్చిన ప్రాంతంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ రావడం పొన్నం కి ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. కరీంనగర్ చుట్టుపక్కల ఉన్న అన్ని జిల్లాల్లో ఇంజనీరింగ్ కళాశాలు ఉన్నాయని కరీంనగర్ నగర కేంద్రంగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే విద్య హబ్ గా కరీంనగర్ మారుతుందని పొన్నం ప్రభాకర్ తన వ్యక్తిగత స్వార్థం కోసం కరీంనగర్ కాకుండా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో నెలకొల్పడం విడ్డూరంగా ఉందన్నారు. కరీంనగర్ నుండి హుస్నాబాద్ వెళ్లే దారిలో నిర్మించిన ప్రజలు సంతోషించే వారని కానీ తన ఇష్టారాజ్యంగా ఎక్కడో మారుమూల ప్రాంతంలో నిర్మిస్తామనే ఆలోచనను విరమించుకోవాలన్నారు. వెంటనే ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాల కరీంనగర్ జిల్లాలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# మన నుంచి ఆస్కార్‌ను చాలాసార్లు లాగేసుకున్నారు: దీపికా పదుకొణె



మన దేశంలో ఎంతోమంది టాలెంటెడ్ నటీనటులు ఉన్నారని నటి దీపికా పదుకొణె అన్నారు. తాజాగా దీపికా తన ఇన్‌స్టాలో ఓ వీడియోను పంచుకున్నారు. అందులో ఆస్కార్ గురించి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకుంటూ ఈ మాట అన్నారు

‘చాలాసార్లు మనకు రావాల్సిన ఆస్కార్లను లాగేసుకున్నారు. భారతదేశ సినీ చరిత్రలో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. కానీ ఆ సినిమాలకు, ఆ కథలకు, నటీనటుల ప్రతిభకు గుర్తింపు రాలేదు. ‘ఆర్ఆర్ఆర్’లోని పాటకు ఆస్కార్ ప్రకటించినప్పుడు నేను ప్రేక్షకుల్లో కూర్చొని ఉన్నాను. ఆ సమయంలో ఎంతో భావోద్వేగానికి గురయ్యాను. నిజానికి ఆ సినిమాతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను ఆ సినిమాలో భాగం కూడా కాదు. కేవలం ఒక భారతీయురాలిగా ఆ క్షణంలో వ్యక్తిగతంగా ఎంతో ఆనందం వేసింది. ఆ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. ‘ది బ్రూటలిస్ట్’ చిత్రానికి గాను ఈ ఏడాది అడ్రియన్ బ్రాడీ ఉత్తమ నటుడిగా ఆస్కార్ గెలిచినందుకు నేను సంతోషించాను” అని చెప్పారు.

ఇక 2023లో జరిగిన ఆస్కార్ ప్రదానోత్సవంలో దీపిక ‘ఆర్ఆర్ఆర్’ చిత్రంలోని నాటునాటుని ఆడియన్స్‌కు పరిచయం చేసిన సంగతి తెలిసిందే. ‘దు యూ నో నాటు?’ తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు. ‘ఆర్ఆర్ఆర్’ చిత్రం నుంచి ‘నాటు నాటు ’ ఇదే..’ అంటూ దీపిక ఈ పాటను పరిచయం చేయడంతో వేదిక మొత్తం చప్పట్లతో మారుమోగింది.



# రాబిన్‌హుడ్.. అందర్నీ నవ్విస్తుంది

“కరోనా వస్తే క్వారంటైన్ 14రోజులే. కానీ, నేనొస్తే జీవితాంతం” అంటున్నారు కథా నాయకుడు నితిన్ . ఇప్పుడాయన.. శ్రీలీల జంటగా వెంకీ కుడుముల రూపొందించిన చిత్రం ‘రాబిన్‌హుడ్’. మైత్రీ మూవీ మేకర్స్ నంస్థ నిర్మించింది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అతిథి పాత్రలో నటించారు. ఈ సినిమా ఈనెల 28న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ వార్నర్ (ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. తనని ఈ చిత్రంలో భాగం చేసినందుకు చిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చిందని, తప్పకుండా అందరికీ నచ్చుతుందని వార్నర్ అన్నారు.

అనంతరం హీరో నితిన్ మాట్లాడుతూ.. “ఈ చిత్రంపై మేము చాలా నమ్మకంగా ఉన్నాం. శ్రీలీలతో నాకిది రెండో సినిమా. మా తొలి చిత్రం అంతగా ఆకట్టుకోలేదు. కానీ, ఈ సినిమా కచ్చితంగా అలరిస్తుంది. దీంట్లో లీల పాత్ర వినోదాత్మకంగా ఉంటుంది. మా చిత్రంలోకి కేతిక ఇంపాక్ట్ ప్లేయర్‌లా వచ్చింది. ఆమె తన స్టెప్స్‌తో ‘అదిదా సర్‌ప్రైజ్’ పాటను మరో స్థాయికి తీసుకెళ్లింది. మైత్రీ వాళ్లు లేకుంటే ఈ చిత్రం ఇంత భారీగా వచ్చేది కాదు. వాళ్ల కోసమైనా ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నా. వెంకీకి నాపైన ఎంత ప్రేమ ఉందో.. దాన్ని ఈ చిత్రంలో చూపించాడు” అన్నారు. “అందరం కలిసి ప్రేమతో, కసితో చేసిన చిత్రమిది. ఇది అనుకోకుండా చేసిన సినిమా. కానీ, నేను అనుకున్న దానికన్నా చాలా బాగా తీశారు” అంది నటి శ్రీలీల

దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ.. “ట్రైలర్‌లో చూసింది కొంచెమే. ఇది పెద్ద స్పాన్ ఉన్న సినిమా. కచ్చితంగా అందర్నీ నవ్విస్తుంది. ఇందులో వార్నర్ పాత్ర చిన్నదే అయినా అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది” అన్నారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ మాట్లాడుతూ.. “నవ్వులతో పాటు మంచి కథ, పాటలు, యాక్షన్.. అన్నీ ఉన్న చిత్రమిది. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా. తప్పకుండా పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుంది” అన్నారు. నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. “ఈ వేసవిలో ఏసీ థియేటర్లలో కుటుంబంతో కలిసి మనస్ఫూర్తిగా నవ్వుకుంటూ చూసే చిత్రమిది. ఈ సినిమా తర్వాత నితిన్ హీరోగా మరో మెట్టు పైకి వెళ్తారు” అన్నారు. ఈ కార్యక్రమంలో దేవ్‌దత్, జీవీ ప్రకాశ్ కుమార్, సాయి రాజేశ్, రాహుల్ సంకృత్యాన్, వివేక్ ఆత్రేయ, ఎస్‌కేఎన్, కేతిక శర్మ, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘లూసిఫర్’ తీద్దామనుకున్న దర్శకుడు చనిపోయాడు.. అలా పృథ్వీరాజ్ చేతుల్లోకి..

‘లూసిఫర్’.. పరిచయం అక్కర్లేని సినిమా. మోహన్‌లాల్ (కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ (దర్శకత్వంలో రూపొందిన మలయాళీ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్. దీనికి కొనసాగింపుగా ‘ఎల్2: ఎంపురాన్’ మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. అసలు ‘లూసిఫర్’ పేరుతో మొదట సినిమా తీయాలనుకున్నది ఎవరు? అది ఎందుకు పట్టాలెక్కలేదు? ఈ టైటిల్‌తో సినిమా తీయాలనుకున్న దర్శకుడు ఎలా చనిపోయారు?




**ముందుగానే టైటిల్ అనుకుని..**

అది 2012 ‘లూసిఫర్ ’పేరుతో దర్శకుడు రాజేశ్ పిళ్లై, రచయిత మురళీ గోపి ఓ కథను సిద్ధం చేశారు. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో దీన్ని తీర్చిదిద్దాలన్నది వాళ్ల ఆలోచన. ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోనీ పెరంబవూర్ కూడా అందుకు సిద్ధంగా ఉన్నారు. ఏడాదిలో సినిమా పూర్తి చేసి, 2013లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకున్నారు. మోహన్‌లాల్‌కు వెళ్లి కథ చెప్పడంతో ఆయన కూడా ఓకే అన్నారు. ఇదే విషయాన్ని రాజేశ్ పిళ్లై ‘ఎట్టకేలకు నా కల నిజమైంది’ అంటూ ప్రకటించారు. కేరళ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ‘లూసిఫర్’ టైటిల్ రిజిస్టర్ అయింది. అయితే, అప్పటికే కుంచకోబోబన్ కథానాయకుడిగా రాజేశ్ పిళ్లై ‘మోటార్ సైకిల్ డైరీస్’ పేరుతో ఓ మూవీని మొదలు పెట్టారు. (ఇప్పటికీ మూవీ పూర్తి కాలేదు) అలాగే మరోవైపు మురళీ గోపి కూడా ‘లెఫ్ట్ రైట్ లెఫ్ట్’ ప్రాజెక్ట్‌తో బిజీ అయిపోయారు. దీంతో ఆ ఏడాది ప్రకటన మినహా సినిమా ముందుకు కదల్లేదు.

**కన్నుమూసిన రాజేశ్ పిళ్లై**

2014 జూన్‌లో ‘లూసిఫర్’ను మొదలు పెట్టాలని రాజేశ్ భావించారు. థ్రిల్లర్ జానర్‌లో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. రాజేశ్‌కు కుంచకోబోబన్‌తో మంచి అనుబంధం ఉండటంతో ఆయన కూడా ఇందులో నటిస్తారని వార్తలు వచ్చాయి. అయితే, బోబన్ మాత్రం అప్పటికి ఎలాంటి ఆలోచనా లేదని తెలిపారు. నటించే అవకాశాలను కొట్టిపారేయలేదు. రచయిత మురళీ గోపీ కూడా ఇందులో నటిస్తారని రాజేశ్ పిళ్లై ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. జూన్‌లో సెట్స్‌పైకి వెళ్లిపోవాల్సిన మూవీ అనివార్య కారణాలతో ఇంకా స్క్రిప్ట్ దశలోనే ఉండిపోయింది. జులై నుంచి మురళీ గోపి ‘లూసిఫర్’ స్క్రీన్‌ప్లే రాయడం మొదలు పెట్టారు. అదే సమయంలో రాజేశ్ పిళ్లై ఇతర ప్రాజెక్టులతో బిజీ అవడంతో కొన్నాళ్లు మళ్లీ మూవీని పక్కన పెట్టేశారు. 2016 ఫిబ్రవరిలో అనారోగ్య కారణాలతో రాజేశ్ పిళ్లై కన్నుమూయడంతో ‘లూసిఫర్ ’పేరుతో తీయాలనుకున్న ప్రాజెక్ట్ పక్కకు వెళ్లిపోయింది.

**ట్రాక్‌లోకి వచ్చిన పృథ్వీరాజ్..**

రాజేశ్ పిళ్లై మరణం తర్వాత రచయిత మురళీ గోపీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన పనులు చూసుకుంటూనే ‘లూసిఫర్ వర్క్ కూడా చేస్తున్నట్లు తెలిపారు. సరిగ్గా మూడు నెలల తర్వాత పృథ్వీరాజ్ సుకుమార్ దర్శకత్వంలో మోహన్‌లాల్ కథానాయకుడిగా ‘లూసిఫర్ టైటిల్‌తో సినిమాను ప్రకటించారు. దీనికి కూడా మురళీగోపీ రచయిత కావడం గమనార్హం. అయితే, రాజేశ్ పిళ్లై తీయాలనుకున్నది వేరే కథ అని, దానికి, ఈ మూవీతో సంబంధం లేదని అటు పృథ్వీరాజ్, ఇటు మురళీగోపీ ఇద్దరూ స్పష్టం చేశారు. కేవలం తాము టైటిల్‌ను మాత్రమే తీసుకుంటున్నామని ప్రకటించారు. ‘లూసిఫర్ టైటిల్‌తో మురళీ గోపి రెండు కథలను డెవలప్ చేశారని, రెండో కథకు తాను దర్శకత్వం వహిస్తున్నట్లు పృథ్వీరాజ్ ఆనాటి విలేకరుల సమావేశంలో తెలిపారు.

**కేవలం టైటిల్ మాత్రమే!**

అసలు 2012లోనే మురళీగోపి ఈ కథ పాయింట్‌ను మోహన్‌లాల్‌కు వినిపించారట. అయితే, అప్పటికి దర్శకుడిగా ఎవరినీ అనుకోలేదట. అయితే, పృథ్వీరాజ్‌కు దర్శకత్వం చేయాలన్న ఆసక్తి ఉందన్న విషయాన్ని మోహన్‌లాల్ దృష్టికి తీసుకురావడం, అందుకు ఆయన కూడా ఒప్పుకోవడంతో ఈ పాయింట్‌ను టేకప్ చేసి ‘లూసిఫర్ టైటిల్ తీసుకున్నారు. అప్పటివరకూ మలయాళ ఇండస్ట్రీలో నిర్మించనంత భారీ బడ్జెట్‌తో మూవీని తీసేందుకు నిర్మాత ఆంటోని పెరంబవూర్ ముందుకు వచ్చారు. 2016 చివరి నాటికి ‘లూసిఫర్’లో నటిస్తున్నట్లు మోహన్‌లాల్ ధ్రువీకరించారు. ఆ తర్వాత ఏడాది పాటు ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకొన్న ఈ కథ 2018లో పట్టాలెక్కింది. ఈ సినిమా పనుల కోసమే. కొచ్చిలో ఓ అపార్ట్‌మెంట్‌ను పృథ్వీరాజ్ కొనుగోలు చేశారు. అక్కడే కథ డెవలప్‌మెంట్, నటీనటుల ఎంపిక అంతా జరిగింది. ‘ఒడియన్’ సెట్‌లో పూర్తి కథను మోహన్‌లాల్‌కు వినిపించారు. ‘బ్లడ్.. బ్రదర్‌హుడ్.. బిట్రెయల్’ ట్యాగ్‌లైన్‌తో ‘లూసిఫర్’ను ప్రకటించారు.

**34ఏళ్ల తర్వాత ఫాజిల్..**

2014లో ఓ ఇంటర్వ్యూలో పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. తాను దర్శకత్వం వహించే తొలి చిత్రంలో మోహన్‌లాల్, మంజు వారియర్ కచ్చితంగా ఉంటారని అన్నారు. అన్నట్లుగానే వారిద్దరినీ ఎంపిక చేశారు. రచయిత మురళీ గోపి ఇందులో ఓ పాత్ర చేయాల్సి ఉన్నా, పూర్తిగా స్క్రిప్ట్ డెవలప్‌మెంట్‌పై దృష్టి పెట్టడంతో చేయలేదు. ఆ తర్వాత వివేక్ ఒబెరాయ్, ఇంద్రజీత్ సుకుమారన్ తదితరులు వచ్చి చేశారు. 34ఏళ్ల తర్వాత దర్శకుడు ఫాజిల్ ఇందులో నటించారు. ఇందులో వివేక్ ఒబెరాయ్ పాత్రకు నటుడు వినీత్ డబ్బింగ్ చెప్పారు. రూ.30 కోట్ల బడ్జెట్‌తో ‘లూసిఫర్’ను రూపొందించారు. (‘లూసిఫర్’ గురించి మరికొన్ని ఆసక్తికర విషయాలు తదుపరి కథనంలో.. స్టే అండ్ రీఫ్రెష్

# ‘ఓ భామ అయ్యో రామ’ టైటిల్ అర్థమిదే..

ఇంటర్నెట్ డెస్క్: సుహాస్ ( మాళవిక మనోజ్ జంటగా రామ్ గోదల తెరకెక్కిస్తున్న చిత్రం ‘ఓ భామ అయ్యో రామ’ ( హరీశ్ నల్ల నిర్మాత. తాజాగా ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మూవీ యూనిట్ చిట్‌చాట్ నిర్వహించింది.



సుహాస్ ఎప్పుడూ మంచి సినిమాలు ఎంచుకుంటారు.. ఈ సినిమా ఎంచుకోవడానికి కారణం?

సుహాస్: దీని స్టోరీ చాలా బాగుంటుంది. సెకండ్ హాఫ్‌లో ట్విస్ట్ అందరినీ ఆకట్టుకుంటుంది. భావోద్వేగాలు ఉన్నాయి. ఈ స్టోరీని అందరూ ఎంజాయ్ చేస్తారు.

హిట్ 3లో మీరు ఉన్నారా?

సుహాస్: లేను

ఈ సినిమా టైటిల్ అర్థం ఏంటి?

దర్శకుడు రామ్: ఇందులో హీరో పేరు రామ్.. హీరోయిన్ పేరు సత్య. ఓ భామ అంటే ఒక అమ్మాయి.. అయ్యో రామ అంటే తన పరిస్థితులు.. ఇంతకు మించి చెప్పలేను. ఈ సినిమా చూశాక ఇంకా మీకు క్లారిటీ వస్తుంది. నా రియల్ లైఫ్‌లో జరిగిన కొన్ని సంఘటనలు కొన్ని ఇందులో ఉన్నాయి.

మీ సినిమాలకు బాక్సాఫీస్ నంబర్లు రావట్లేదు కారణం ఏంటి?

సుహాస్: నేను దాని గురించే ఆలోచిస్తున్నాను. సినిమా బాగుంది అంటున్నారు. కానీ, కలెక్షన్లు రావడం లేదు.

పూర్తిస్థాయి కమర్షియల్ సినిమా ఎప్పుడు తీస్తారు?

సుహాస్: నాకు అలాంటివి సెట్ అవ్వవు. అందుకే చేయలేదు. హీరోగా నటిస్తూనే క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేస్తూనే ఉంటాను. తమిళంలో త్వరలోనే ఓ సినిమా చేస్తున్నాను.

ఈ సినిమా బడ్జెట్ ఎక్కువైందా?

నిర్మాత హరీశ్: ఒక సినిమా తెరకెక్కిస్తున్నప్పుడే అది హిట్ అవుతుందా లేదా అని అర్థమవుతుంది. ఇది అలాంటి సినిమానే. అందుకే దీని కోసం ఎక్కడా రాజీ పడకుండా ఖర్చుపెట్టాం.

మీ పాత్ర ఎలా ఉంటుంది?

మాళవిక మనోజ్: నా పాత్ర పేరు సత్యభామ. ఇలాంటి సినిమాలో ఇప్పటి వరకూ నటించలేదు. టాలీవుడ్ ఇండస్ట్రీ చాలా పెద్దది. గొప్ప సినిమాలు ఇక్కడి నుంచే వస్తున్నాయి.

ఇప్పుడు ప్రకటనలు కూడా చేస్తున్నారు. రెమ్యునరేషన్ ఎంత ఇస్తున్నారో పంచుకుంటారా?

సుహాస్: ప్రతిసారి ఇదే ప్రశ్నవేస్తున్నారు టార్చర్ అనిపిస్తోంది (నవ్వుతూ). బానే ఇచ్చారండీ. నంబర్ చెప్పలేను.

ఇందులో సుహాస్‌ను హీరోగా తీసుకోవడానికి కారణం?

దర్శకుడు రామ్: కథ రాసుకునేటప్పుడే సుహాస్ హీరో అయితే బాగుండని అనుకున్నాను. ఈ పాత్రకు ఆయన సరిపోతారు. కథ బాగుంటే తెలుగు ఆడియన్స్ ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ సినిమాను కూడా ఆదరిస్తారు.

హిట్ 3 గురించి ఏమైనా హింట్ ఇస్తారా?

దర్శకుడు రామ్: ఇందులో నానిని చూసి అందరూ భయపడతారు.

# వాటిపై దృష్టిపెడితే సరిగ్గా నటించలేను: అదా శర్మ



‘ది కేరళ స్టోరీ’తో దర్శక-నిర్మాతలు సుదీప్తోసేన్, విపుల్ అమృత్‌లాల్ షా విజయాన్ని అందుకున్నారు. వీరిద్దరూ కలిసి తెరకెక్కించిన చిత్రం ‘బస్తర్: ది నక్సల్ స్టోరీ’. అదా శర్మ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ చిత్రం అనుకున్నస్థాయిలో ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేదు. తాజాగా ఈ సినిమా ఫెయిల్యూర్ గురించి అదా శర్మ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

“ఒక సినిమా ఆదరణ సొంతం చేసుకోలేదంటే దానికి ఎన్నో కారణాలు ఉంటాయి. మంచి సినిమాను అందిస్తున్నామా, లేదా అని చూస్తాను. నాకు వచ్చిన పాత్రకు వంద శాతం న్యాయం చేస్తున్నానా, లేదా అనేది ఆలోచిస్తాను. బాక్సాఫీస్ నంబర్లపై దృష్టిపెడితే సరిగ్గా నటించలేను. మేం ‘ది కేరళ స్టోరీ’ సినిమా తెరకెక్కించేటప్పుడు అది అంత పెద్ద విజయం సాధిస్తుందని అనుకోలేదు. లేడీ ఓరియంటెడ్ మూవీ అయినప్పటికీ రూ.378 కోట్లు వసూళ్లు చేసి రికార్డు సృష్టించింది. ఆ సినిమాలో నటించేటప్పుడు కూడా నేను బాక్సాఫీస్ నంబర్ల గురించి ఆలోచించలేదు. నా పాత్ర ఎలా చేస్తున్నాను అనేది చూశాను” అని చెప్పారు. బస్తర్ ప్రాంతంలోని సామాన్యులపై మావోయిస్టులు సాగించిన అమానుషాలు.. మందుపాతర పేల్చి 76 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను పొట్టనపెట్టుకున్న వైనం తదితర అంశాలతో ‘బస్తర్: ది నక్సల్ స్టోరీ’ తీర్చిదిద్దారు. మావోయిస్టులను అణచివేయడానికి నియమితురాలైన ఐపీఎస్ అధికారి నీరజ మాధవన్‌గా అదాశర్మ కనిపించారు. ప్రస్తుతం ఈ చిత్రం జీ5 వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

భారత శక్తి


# కేంద్ర మంత్రి బండిపై ఏసిపికి పిర్యాదు: మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్

కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దేశ ప్రజలకు సేవ చేసేది ఏమీ లేక, చిల్లర మల్లర మాటలతోనే కాలయాపనచేసి.. పదవీకాలం వెళ్ళదీసేటట్టు ఉన్నాడని మాజీ కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ ప్రదాత తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో నిలిచిన కెసిఆర్ ను దొంగ నోట్లు ముద్రించాడని చేసిన వాఖ్యలకు ఖండిస్తూ కరీంనగర్ పట్టణ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఏసీపీకి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పైన బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ కొన్నాళ్లు మతం పేరు మీద రాజకీయం చేశాడని, ఏకంగా ఒక అడుగు ముందుకేసి కెసిఆర్ పై చేసిన వాఖ్యలకు నిరసనగా బండి సంజయ్ కుమార్ పైన పైన పట్టణ ఏసిపి కి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా బండి సంజయ్ కుమార్, ఇలాంటి చిల్లర మల్లర మాటలతో కరీంనగర్ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉండి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం



సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే కరీంనగర్ ప్రజలు మిమ్మల్ని తిరస్కరిస్తారని, కార్పొరేటర్ గా కూడా గెలవకుండా చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జి చుక్క శ్రీనివాస్ , నగర %దీ=ూం% అధ్యక్షులు బొంకూరి మోహన్, నియోజక వర్గ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నాయకులు ఆరే రవి గౌడ్, వోడ్నాల రాజు , ఆఫ్రోజ్, సందీప్ వర్మ , కిరణ్ గౌడ్, అజయ్, సోహెల్, అవ్వేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపు ను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ



కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):బుట్టి రాజారామ్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరుగుతున్న ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంప్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం హాజరు పట్టిక, రికార్డులను తనిఖీ చేసి ఫార్మసీ స్టోర్స్ లో మందుల నిల్వలను, పేషెంట్లకు వంపిణీ చేన్తున్న మందులను పరిశీలించారు.. అదేవిధంగా పేషంట్ల లేబరేటరీ టెస్ట్ కొరకు సేకరించిన శాంపిల్స్ వివరాలను అవి జిల్లా కేంద్రం ప్రధాన ఆస్పత్రిలోని టీహబ్ కు పంపిస్తున్న ఆన్లైన్ రిపోర్టులను కంప్యూటర్లో నమోదు చేయాలనీ ఆదేశించారు.. ఎన్ సి డి క్లినిక్ లోని అధిక రక్తపోటు, డయాబెటిస్ రోగుల వివరాలను వారికి అందుతున్న మందుల వివరాల నమోదును పరిశీలించారి. పట్టణ ఆరోగ్య కేంద్రం ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపు వచ్చిన మహిళలకు వారికి అందుతున్న సేవలు నదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తీగలగుట్టపల్లి బస్తీ దావఖాన ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపు తనఖీ చేసి హాజరు పట్టిక ను ఇతర రికార్డులను పరిశీలించి, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బుట్టి రాజారామ్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సల్మా, తీగలగుట్టపల్లి బస్తీ దావఖాన డాక్టరు లావణ్య ,ఎన్ హెచ్ ఎం డిపిఓ స్వామి,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి బోనాల జాతరకు ఆహ్వానం పలికిన శ్రీకాంత్ గౌడ్






ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 25 (భారత శక్తి): ములుగు జిల్లా మల్లంపల్లి మండలం బోలోని పల్లి లోని పోచమ్మ తల్లి బోనాల జాతరకు బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా యూత్ అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ జిల్లా ప్రజలందరూ ఆహ్వానితులేనని పిలుపునిచ్చాడు. ఈనెల 28 (శుక్రవారం) న నిర్వహించనున్న పోచమ్మ తల్లి బోనాల జాతరకు మంగళవారం ములుగు ఎస్సై వెంకటేశ్వరరావు, లక్ష్మారెడ్డి లను ఆయన ఆహ్వానించాడు. శ్రీకాంత్ గౌడ్ స్వగ్రామైన మల్లంపల్లి నుండి ప్రభ ఎడ్ల బండి కట్టి కుటుంబ సమేతంగా పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తారు.

జాతరకు ముఖ్య అతిథులుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి దనసరి సూర్య హాజరుకానునట్లు శ్రీకాంత్ తెలిపాడు. పోచమ్మ తల్లి జాతరకు ఊరంతా ఆనంద ఉత్సవాలతో రంగురంగుల తో విరిసిల్లే విధంగా ప్రభ బండ్ల కట్టి గ్రామంలోని ఇంటికో బోనం ఎత్తి పోచమ్మ తల్లిని ఘనంగా కొల్చుకుంటారని పేర్కొన్నారు. ఎంతో అంగరంగ వైభవంగా జరిగే జాతరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, యువకులు ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి : టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మార్చి 25: తెలుగునాడు విద్యార్థి సమాఖ్య టీఎన్ఎస్ఎఫ్, విఆర్ కె అకాడమీ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన టి ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని వాటిని సాధించుకోవడానికి సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. నిరాశ దరిచేరకూడదని కష్టపడితే ఎంతటి విజయమైన దక్కుతుందని అన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో పోటీ పెరిగిపోయిందని ఆ పోటీలో నిలబడాలంటే సరియైన శిక్షణ అవసరమని సూచించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన డాక్టర్ జైపాల్ రెడ్డి కి టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ తరపున కృతజతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆర్కే విద్యాసంస్థల సీఈవో డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని విద్యార్థులను ప్రోత్సహించాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమానికి సహకరించామని అన్నారు. విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంస, ప్రశంస పత్రాలతో అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విఆర్ కె అకాడమి ప్రోగ్రాం ఇన్చార్జి జలిగామ శ్రీకాంత్,సమన్వయ కర్త







నవీన్,ఎస్ఆర్ కె ప్రిన్సిపాల్ దత్తాద్రి,జూనియర్ ప్రిన్సిపాల్ నరేష్ అధ్యాపక బృందం శంకర్, మల్లేష్, ధర్మపురి, శేఖర్,రంగనాయకులు,మహేష్,మహేందర్,మధు,నవీన్ లు పాల్గొన్నారు.

# 16వ రోజుకు చేరిన రిలేనిరహార దీక్షలు

## మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లి ను కలిసిన జే ఏ సి సభ్యులు

## ఆవిష్కరణకు చర్యలు తీసుకోవాలి డిమాండ్

కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రం ఆర్ టి సి బస్టాండ్ ముందు విగ్రహాల ముసుగుల తొలగించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు 16వ రోజుకు చేరాయి. ముసుగులు తొలగించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ జేఏసి సభ్యులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ను మంగళవారం హైదరాబాద్ లో వారి నివాసంలో కలిసారు. మండల కేంద్రంలో నెలకొల్పిన విగ్రహాలపై ఉన్నటువంటి ముసుగులు తొలగించాలని డిమాండ్ చేస్తూ పొలిటికల్ జేఏసి సభ్యులు రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మంత్రి ని కలిసి వినతి పత్రం సమర్పించారు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటుతో ఆర్టిసి ప్రాంగణం






సుందరంగా ఉంటుందని, ఆ దిశలో ఆలోచించాలని జేఏసి సభ్యులు పొన్నం ను కోరారు. అనంతరం అసెంబ్లీ కి వెళ్లిన జే ఏ సి సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యకు వెంటనే పరిష్కారం చూపించాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఆర్టిసి ఎండి సజ్జనార్ లకు లెటర్ రాసినట్లు ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొంకటి లక్ష్మీనారాయణ, సుగుర్తి జగదీశ్వరాచారి, దుండ్ర రాజయ్య, మాతంగి శంకర్, వంతడుపుల సంపత్, మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా మాజీ సభ్యులు ఎలుక ఆంజనేయులు, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు కనకం రాములు, సముద్రాల లక్ష్మణ్ లు ఉన్నారు.

లి16 వ రోజుకు చేరిన నిరాహార దీక్షలులి

తిమ్మాపూర్ మండల కేంద్రం ఆర్ టి సి బస్టాండ్ ముందర గత రెండేళ్ల క్రితం నెలకొల్పిన మహనీయుల విగ్రహల ముసుగులు తొలగించాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 16 వ రోజుకు చేరుకున్నాయి. రాజీవ్ రహదారి పక్కన ఏర్పాటు చేసిన అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహాల ముసుగులను తొలగించేందుకు భాద్యత కలిగిన నాయకులు ప్రయత్నం చేయాలని కోరారు. కోయడ మురళి, మాతంగి భూమయ్య, డప్పు తిరుపతి, సముద్రాల మల్లేశం, బొర్ర శంకర్, బొర్ర వేణు, అజయ్ తదితరులు దీక్షల్లో పాల్గొన్నారు.

# దామెర పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి25:వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ దామెర పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు పోలీస్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, పోలీస్ కమిషనర్ పరిశీలించడం, స్టేషన్ నందు విధులు సిబ్బంది వివరాలతో పాటు, పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా ఎలాంటి నేరాలకు సంబంధించి కేసులు నమోదవుతాయని, ఎలాంటి గోడవలు అధికంగా జరుగుతాయి, ఎంత మంది రౌడీ షీటర్లు వున్నారు, వారిని ఎలా వారిని తనీఖీ చేసారు, అలాగే స్టేషన్ అధికారి రోజువారి వివరాలను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నెలకోసారి తప్పనిసరిగా స్టేషన్ అధికారి తప్పని సరిగా రౌడీ షీటర్లతో పాటు అనుమానిత వ్యక్తుల ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై చుట్టు ప్రక్కల వారిని ద్వారా అరా తీయాలని, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదుదలపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారికి సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్‌కుమార్, ఏఎస్పీ ప్రస్తుతం దామెర స్టేషన్ ఎస్.హెచ్.ఓ ఏ.ఏస్పీ మనన్‌భట్, పరకాల ఏసిపి సతీష్‌బాబు వున్నారు.

# న్యాయవాదులు విధులకు బహిష్కరణ

## -న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు నిరసనగా

## -న్యాయంచేసే న్యాయవాదులకే రక్షణ లేదు

## -అధ్యక్ష, కార్యదర్శులు పీవీ, బేతి




కరీంనగర్, మార్చి 25(భారత శక్తి):కరీంనగర్ బార్ అసోసియషన్ ఆధ్వర్యంలో న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు నిరసనగా మంగళవారం విధులు బహిష్కరించి, కోర్టు ప్రాంగణంలో నిరసన తెలియజేశారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న ఇజ్రాయిల్ అనే న్యాయవాది పై దస్తగిరి అనే నిందితుడు తన పై కేసు పెట్టించాడని కక్షపెంచుకొని కత్తితో దాడి చేసి హత్య చేసాడని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల పై తరచూ దాడులు జరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని, న్యాయం చేస్తున్న న్యాయవాదులకే రక్ష లేకుండా పోయిందని, వెంటనే ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం తెచ్చే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రఘువీర్, కటకం రాజేందర్, బెజ్జంకి శ్రీకాంత్, సీనియర్ న్యాయవాదులు కొరివి వేణుగోపాల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy